ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక విజయసంవత్సరం మార్చి, ఏప్రిల్ మాసములు

శ్రీ

ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక

(Journal of the Telugu Academy)

చందా సంవత్సరమునకు మూఁడు రూపాయలు.

సంపుటము ౪౨ { విజయ సంవత్సరము మాఘ,ఫాల్గుణ, మాసములు } సంచిక ౬

ప్రాచ్యవిద్యావిధానమున మార్పులు

మన దేశమున నాంగ్లప్రభుత్వ మున్నంతవఱకు దేశభాషల కెట్టి గౌరవము లేక యడుగునఁ బడియుండుట యందఱికిఁ దెలిసినవిషయమే. ఆంగ్లప్రభుత్వావసానదినములలో జరిగిన యాందోళనమువలన విద్యా ప్రణాళికలోఁ బ్రాచ్యభాషలకుఁ గొంత స్థానము కలిగెను. విశ్వవిద్యాలయము ప్రాచ్యవిద్యాపరీక్షల జరుపుటయు, అందు తీర్ణులైనవారికి 'డిప్లమా'ల నొసంగుటయు, ఉన్నత విద్యాశాలలలో, కళాశాలలలో వారి కుద్యోగములు లభించుటయు సంభవించెను. స్వరాజ్యము వచ్చిన తర్వాతఁ బ్రాచ్యవిద్యల కింకను గౌరవము, ప్రాచుర్యము నొసంగు ప్రయత్నములు జరిగెను. దేశములో నిదివఱ కాంగ్లభాషకుఁ గల ప్రాధాన్య మిఁక ముందు సంస్కృతాంధ్రములకుఁ గలుగవలె నను నాందోళనము బయలుదేఱెను. దీని ఫలమే ప్రాచ్యవిద్యావిధానమున నేఁడు జరుగుచున్న మార్పులు.

ఈ మార్పుల నగ్గడించుటకుఁ బూర్వముఁ విద్యావిధాన మెట్లున్నది కొంత పరికింతము. మదరాసు విశ్వవిద్యాలయమున 'విద్వాన్'

'శిరోమణి' అనియు, ఆంధ్రవిశ్వవిద్యాలయమున 'భాషాప్రవీణ, విద్యాప్రవీణ'అనియుఁ బరీక్షలు గలవు. ఈ పరీక్షలు జరుగుటకు ముందు అడ్వాన్సుడ్ పాఠశాలలలో నాల్గుసంవత్సరములు చదువవలెను. చివర సంవత్సరమునఁ బ్రవేశపరీక్ష జరుగును. అందుత్తీర్ణులైనచోఁ బ్రాచ్య విద్యాకళాశాలలో మొదటి రెండు సంవత్సరములు ప్రిలిమినరీ పరీక్షకు, కడమ రెండు సంవత్సరములు ఫైనలు పరీక్షకు జదువవలెను. అందుత్తీర్ణుడైనచో విద్యార్థి 'ప్రవీణ'బిరుదమునకర్హుఁ డగును. ఈవిద్యా విధాన మాంగ్లవిద్యా విధానము ననుకరించుచున్నది. అక్కడ ఎస్. ఎస్.ఎల్. సి లేక మెట్రిక్యులేషన్ పరీక్ష యిందలి ప్రవేశపరీక్షకు సమానము. ఎస్. ఎస్. ఎల్. సి. యందుత్తీర్ణుఁడైనచో రెండు సంవత్సరములు 'ఇంటర్ మిడీయట్' రెండు సంవత్సరములు బి.ఏ. చదువవలయును గదా. ప్రాచ్యవిద్యావిధానమునందలి ప్రిలిమనరీ ఫైనలు పరీక్షలు వీనికిఁ దుల్యములు.

ఈ విధముగా భాషాప్రవీణ, విద్యాప్రవీణ పరీక్షలు, బి. ఏ. పరీక్షలతో సమానమైన ప్రణాళిక గల వనుట కెట్టి సంశయము లేదు. బి. ఏ. యందుత్తీర్ణుఁ డగుట కొరక విద్యార్థి యెంత శ్రమపడవలెనో, వీనియందుత్తీర్ణుఁ డగుటకుఁగూడ నంత శ్రమపడి తీరవలెను. స్థితిగతు లీ విధముగ నున్నను బి. ఏ. పరీక్షయందుత్తీర్ణుఁడైనవానికిఁ గల గౌరవము ప్రాచ్యవిద్యాభట్టభద్రునకు లభించుట లేదు. బి. ఏ. పట్టభద్రున కుద్యోగ ప్రారంభముననే డెబ్బదియైదు రూప్యముల వేతనము లభించుచుండఁ బ్రవీణపరీక్షయందుత్తీర్ణుఁ డైనవానికి నుద్యోగాంతముననఁ గాని యది లభించుట లేదు. బి. ఏ. తో పాటితఁడు ఎస్. ఎస్. ఎల్. సి పరీక్షకుఁ బాఠము చెప్పుచున్నవాఁడే. బాధ్యత లన్నియు సమానమే. వేతనము మాత్రి మత్యల్పము. ఇతనిని బండితుఁ డని పిల్చెదరు. పండితుఁ డను పదము జీతము తగ్గించుటకుఁ జాల ననుకూలముగా

నున్నది. ఇందు ఆంగ్లవిద్యావంతులు ప్రాచ్యవిద్యలపైఁ జూపు నవమానధోరణి వెల్లడియగుచున్నది. మన జాతికి స్వకీయ మైన దానియందు ద్వేషము, పరకీయమైన దానియం దాదరణము సహజ మగుటచే స్వభాషాపండితులకు జరుగుచున్న యవమానమును ప్రభుత్వము ప్రజలు కూడఁ జూచి హర్షించి యూరకున్నారు. మఱి యే దేశములోను స్వభాషావేత్తల కిట్టి యవమానము జరుగదు.

కొంత కాలము క్రిందట పండితులు ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్షయందుత్తీర్ణులై ట్రైనింగు పొందినచో, బి. ఏ. బి. ఇడి. లతో సమాన వేతనము పొందఁ గల రని ప్రభుత్వ మంగీకరించెను. ఈ సమాన గౌరవము కొంతమందికి మాత్రమే కలుగును. ఉత్తీర్ణులైన యందఱికిఁ గలుగదు. ఇందు ట్రైనింగు, బి. ఇ డి లకు బదులుగాను, ఎస్.ఎస్.ఎల్.సి. లోకజ్ఞానమునకు నవసర మని వీరి యభిప్రాయము. ఎస్.ఎస్. ఎల్. సి. చదివినవారి కెంత లోకజ్ఞాన ముండునది మనకుఁ దెలియును గదా ! ప్రవీణులను ప్రాచ్యవిద్యలలో నేదైన నున్నతవిద్య గడింపుమనుటలో నర్థమున్నదిగాని నిరుపయుక్తమైన ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్షయందుత్తీర్ణులు కమ్మనుటలో నర్థము కన్పించుటలేదు. ఇది యాంగ్లవిద్య చదివినవాఁడు పెద్దలోకజ్ఞానము కలవాఁ డనియు, ప్రాచ్యవిద్యల నధిగమించిన వాఁడు మూఢుఁ డనియుఁ దత్సూత్రనిర్మాతల యభిప్రాయ మైనట్లు వెల్లడియగుచున్నది.

రెండు మూఁడు సంవత్సరములక్రింద జరిగిన యాందోళనము వలనఁ బ్రాచ్యవిద్యావిధానమునఁ గొన్ని మార్పులు గావింపఁబడెను. అందును లోపములు లేకపోలేదు. కాని యది కొంత యాచరణయోగ్యముగా నున్నది. అడ్వాన్సుడ్ పాఠశాలలలో నిఁక ముం దాఱు తరగతులుండును. అవి మొదటి ఫారమునుండి ఎస్ ఎస్. ఎల్. సి. తరగతివఱకుఁ గల యాఱుఫారములఁ బోలియుండును. ఈ యాఱు సంవత్సరముల

చివర విద్యార్థి, ఓరియంటల్ ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్షకుఁ గూర్చుండవచ్చును అందు త్తీర్ణుఁడైనచో సాధారణమైన ఎస్. ఎస్. ఎల్. సి. యందు త్తీర్ణుఁడైనవానికిఁ గల్గు లాభములు వీనికిని జేకూరును. ఇందు త్తీర్ణుఁడైనచోఁ బ్రాచ్యకళాశాలలలోఁ జేరి ప్రవీణాది పరీక్షలకుఁ జదువవచ్చును. ఆంగ్లకళాశాలలలోఁ జేరి ఇంటర్‌మిడియట్ చదువవచ్చును. ఉద్యోగాభిలాషి యైనచో సర్వీస్‌కమీషన్ పరీక్షకుఁ గూర్చుండవచ్చును. సెకండరీగ్రేడ్ ట్రైనింగుకుఁ గూడ వెళ్ళవచ్చును. ఓరియంటల్ ఎస్. ఎస్. ఎల్. సి. తీసికొన్న విద్యార్థి కావలసినచో, ఇంగ్లీషు హైస్కూళ్ళలోఁ దత్తుల్యమైన కక్ష్యలలోఁ జేరవచ్చును.

ఈ ఓరియంటల్ ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్షలో విద్యార్థి వారమునకుఁ బదునెనిమిది పీరీయడులు సంస్కృతాంధ్రములనే పఠించును. ఇంగ్లీషు, సాంఘికశాస్త్రము, రెండు ఎస్. ఎస్. ఎల్. సి. లకు సమానమే.

ఇందు సంస్కృతాంధ్రములు వారమునకుఁ బదునెనిమిది పీరీయడులు పఠించుటయే విశేషము. దీనివలన సంస్కృతాంధ్రములకుఁ గొంత ప్రాచుర్యము, గౌరవము కలుగఁగల దని భావింపఁబడుచున్నది.

ఈ విధానము ననుసరించి యింటర్మీడియేట్, బి. ఎ. తరగతులలోఁగూడ ప్రాచ్యవిద్యలకుఁ బ్రాధాన్య మొసంగుటకై యత్నములు జరుగుచుండుట ముదావహము.

ప్రవరుఁడు - వరూధిని

శ్రీ చతుర్వేదుల సత్యనారాయణగారు, ఎం.ఏ., బి.ఓ.యల్.

ఆంధ్రప్రబంధములలో మనుచరిత్ర కున్న పేరు మఱి యొక దానికి లేదు. మనవారు భక్తికోసము భాగవతము నీతికోసము రామాయణము ధర్మముకోసము భారతము చదువుదురు. ఆనందము కోసము మనుచరిత్రను బఠింతురు. ఇది తెలుఁగుప్రబంధములలో మొట్ట మొదటిది. ఆంధ్ర పంచకావ్యములలో నగ్రగణ్య మైనది. "అల్లసాని వాని యల్లిక జిగిబిగి" కిది తారకాణ. అతని శిల్పకౌశలమున కిది యాటపట్టు. ఆంధ్రమునఁ గాక భరతదేశమున నితరప్రాంతములలో వరూధినీప్రవరు లన్న నెవరో యెవరికినిఁ దెలియదు. ఎవ్వరో కొంత మంది పౌరాణికులకుఁ దప్ప నితరుల కెవ్వరికిఁ దెలియుట కవకాశము లేని మామూలు పాత్రలఁ గొని రామకృష్ణపాత్రల వలె ననుదిన స్మరణీయులఁ గావించిన యాంధ్రకవితాపితామహుని ప్రతిభావైశద్య మే మని పొగడఁగలము! వరూధినీప్రవరు లే దేశమువారో గాని పెద్ద నార్యుఁడు వారిని దెలుఁగువారిని గావించెను. వా రెట్లు తెలుఁగువారి హృదయరంగముల కెక్కినది మనము చూడఁగలము. ఎవని నైనఁ బర స్త్రీవిముఖుని మనవారు చూచినచో వెంటనే యితఁ డెవఁడో "ప్రవ రాఖ్యుని వలె నున్నాఁ"డని ప్రశంసింతురు. ఈ ప్రశంసలో రెండు విష యములు గమనింపఁదగినవి. మొదటిదీ నామము తెలుఁగువారి జిహ్వాగ్రమున నుండుట. రెండవది యీ పేరు ప్రవరుఁ డనియో ప్రవ రాఖ్యుఁ డనియో కూడ విమర్శింపక ప్రయోగించుట. కవి తన కావ్య మునఁ "బ్రవరాఖ్యుఁ డలేఖ్య తనూ విలాసుఁడై" అని చెప్పెను. తెలుఁ గు వా రందఱు నాతనిపేరు ప్రవరాఖ్యుఁ డనియే గ్రహించిరి. పే రేది యో స్పష్టముగాఁ దెలిసికొనుట కవకాశము లేని విధమున రసమగ్ను లై రని భావము. ఈ విధముగా మనుచరిత్రమునఁ బెద్దనార్యుని యీ పాత్రచిత్రణ మద్భుతముగా నున్నది. ఇట్టి విశ్వజనీన పాత్రల నిర్మించిన

యల్లసాని వారి పాత్రచిత్రణము బాగుగా లే దని కొందఱు విమర్శకు లాక్షేపించిరి. వారి యాక్షేపణలకు సమాధానము మఱి యొకసారి చూతము. వరూధినీ ప్రవర పాత్రలఁ జిత్రించుటయం దాతఁడు చూపిన కళాకౌశలమును నేఁడు పరికింతము.

వరూధినీ ప్రవరుల వృత్తాంతము మార్కండేయపురాణము చతుర్థాశ్వాసము చివరఁ గలదు. ఇందుఁ బ్రవరుఁడు హిమవత్పర్వతమునఁ జిక్కువడువఱకు పదునేను పద్యములలో నున్నది. వరూధినీప్రవరుల సంవాదము నిరువది పద్యములలో వ్రాసెను. ఈ ముప్పదియైదు పద్యముల వృత్తాంతమును పెద్దనార్యుఁడు తన శిల్పచాతుర్యమును బ్రదర్శించుచు నూటపది పద్యములలోఁ జెప్పెను.

అందు నిందుఁ గల ప్రవరవర్ణనపద్యములఁ బరికించినచోఁ బెద్దనార్యుని ప్రతిభావిశేషము వ్యక్తము కాఁ గలదు. మార్కండేయ పురాణమున—

"అతులగుణోత్తరుఁడు గలఁ డొక్క ధరణీ
సురవరుఁ డశ్వినులకంటె సుందరుఁ డెందున్."

"అతిసుకుమారమూర్తి ప్రవరాఖ్యుఁ డుదాత్తుఁడు వేదపారగుం
డతిథి జనార్చనాభిరతుఁడై చరియించుచు శైల కాననాం
చిత సకలావనీ తల విశేషము లెల్లను బ్రీతిఁ గన్గొనన్
మతిఁ గడుఁ గోరుచుండ నొక నాఁ డొక యౌషధసిద్ధుఁ డింటికిన్"

అని కలదు.

మనుచరిత్రలో—

ఆ పురిఁ బాయకుండు మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి భా
షాపర శేషభోగి వివిధాధ్వర నిర్మల ధర్మకర్మదీ
క్షాపరతంత్రుఁ డంబురుహ గర్భ కులాభరణం బనారతా
ధ్యాపన తత్పరుండు ప్రవరాఖ్యుఁ డలేఖ్య తనూ విలాసుఁడై.

ఈ పద్యమునఁ బరికింపఁదగిన విశేషము లెన్నియో కలవు. అందు,

1. ప్రయోగ వైచిత్రి;— మార్కండేయపురాణమున, అశ్వినులకంటె సుందరుఁ డని కలదు. ఇందు మకరాంక శశాంక మనోజ్ఞ

మూర్తి యని యున్నది. అశ్వినులు, మన్మథుఁడు, చంద్రుఁడు. వీ రందఱు సౌందర్యమున కుపమాన భూతులు. కాని యశ్వినులిరువురు దేవతలు. ప్రవరుఁ డొక్కఁడు. ఒక్కని కిరువుర నుపమానముగా గ్రహించుట యుపమా దోషము గాఁ దలఁచి పెద్దనార్యుఁడు ప్రవరుని మన్మథునితోను, చంద్రునితోను విడిగాఁ బోల్చెను. మకరాంక శశాంక మనోజ్ఞ మూర్తి- ఇచట వృత్త్యనుప్రాస, ఛేకానుప్రాసలు శ్రుతిసుభగముగా నున్నవి. మారన ప్రవరుని ధరణీసురవరుఁ డని వర్ణించెను. పెద్దన "అంబురుహ గర్భ కులాభరణం"బని వర్ణించెను. ధరణీసురవరుఁ డనఁగా బ్రాహ్మణశ్రేష్ఠుఁ డని యర్థము. ఆ పదమున కంతకంటె నితర విశేష మేదియు స్ఫురింపదు. అంబురుహగర్భకులాభరణంబు - అను శబ్దమునకుఁ గూడ బ్రాహ్మణశ్రేష్ఠుఁడను నర్థమే యైనను, అందలి పద వ్యుత్పత్తి విశేషముచే నీటియందుఁ బుట్టిన, కమలముల నుండి పుట్టిన, బ్రహ్మయొక్క వంశమున కాభరణ మని యర్థము వచ్చుచున్నది. బ్రాహ్మణులు బ్రహ్మవలనఁ బుట్టిరి. బ్రహ్మ కమలమునుండి జనించెను. కమలములు నీటియం దుద్భవించెను. కారణగుణములు కార్యమందు సంక్రమించు నను న్యాయమున నీటియొక్క పవిత్రత్వము, పద్మముయొక్క సౌందర్యము, బ్రహ్మయొక్క ప్రజ్ఞావిశేషము గల జాతియం దగ్రగణ్యుఁ డను నర్థము స్ఫురించుచున్నది. ఈ విధముగాఁ జెప్పుటచేఁ బై గుణము లీతనికి సహజము లనియు ధ్వనించుచున్నది.

2. ఈ పద్యమునఁ బ్రవరునకు వేసిన విశేషణములచేఁగవి ముందటి కథా వస్తువునకు బీజావాపము చేసినాఁడు. ఈ విశేషణము లెట్లు సార్థకములో ముందుఁ దెలియఁ గలవు.

3. పెద్దన కవిత్వము ధ్వనిప్రధాన మైనది. దానికి నిదర్శనముగా నీ పద్యము చూడుఁడు.

మీ మాటలు మంత్రంబులు;
మీ మెట్టిన యెడ ప్రయాగ; మీ పాదపవి
త్రామల తోయము లలఘు
దోఘ మార్గ ఝరాంబు పౌనరుక్త్యము లుర్విన్.

మీ మాటలు మంత్రముల వలె నూర్జస్వలములు; మీ రడుగు పెట్టిన చోటు ప్రయాగవలెఁ బుణ్యపదము; మీ కాళ్లు కడిగిన నీరు ఆకాశగంగ వలె పవిత్ర మైన దని వాచ్యార్థము. "అభ్యాగతః స్వయం విష్ణుః" అను నది యిందలి వ్యంగ్యార్థము. వేదములు విష్ణుని వాక్కులు. విష్ణువు ప్రయాగయందుఁ గలఁడు. ప్రయాగమాధవుఁ డని ప్రసిద్ధి గదా! ప్రయాగ యతఁడు మెట్టిన చోటు. విష్ణుపాదములనుండి గంగానది పుట్టెను. విష్ణుని యందలి యీ లక్షణము లభ్యాగతుని యం దారోపించి కవి పై లోకోక్తిని ధ్రువ మొనర్చెను. ఈ విధముగనే "ఆ పురి బాయకుండు" అను పద్యము కూడ ధ్వనిప్రధాన మైనది. ఈ పద్యమునఁ బ్రవరుఁడు లోకానుభవము లేనివాఁడు. దాన, స్వపర తారతమ్య వివేకరహితుఁడు. అందుచే నాత్మవిశ్వాసము లేనివాఁ డని చెప్పుటయే కవితాత్పర్యము. లోకానుభవము లేనివాఁ డని చెప్పుట కోసమే పద్యము మొదటనే "ఆ పురిఁ బాయకుండు" అను విశేషణమును "బ్రయోగించి యతని శీలమున నది ప్రధానలక్షణ మని నిరూపించెను.

ఇఁకఁ బ్రవరుఁ డెట్లు లోకానుభవము లేనివాఁడో చూతము. అతఁడు పుట్టిన తరువాత నరుణాస్పదపురము నెన్నఁడు వదలి యెఱుఁగఁడు. అంతియే గాదు. గ్రామములోఁ బనియుండి యింటి నైన వదలి యెఱుఁగఁడు. అతఁడు వివిధాధ్వర నిర్మలధర్మకర్మ దీక్షాపరతంత్రుఁడు.

"కిం త్వనుష్ఠాన నిత్యత్వం, స్వాతంత్ర్య మపకర్షతి
సంకటా హ్యాహితాగ్నీనాం, ప్రత్యవాయై ర్గృహస్థతా" అన్నట్లు,

కర్మపరతంత్రునకు స్వాతంత్ర్య మెక్కడిది? మాధ్యాహ్నికభోజనము వఱకు నిట్టి కర్మలతో సరిపోవును. భోజనానంతరము రాత్రి నిద్రించు నంతవఱకు "అనారతాధ్యాపన తత్పరుఁ"డై కాలము గడపుచుండెను.

ఈ విధముగాఁ బ్రవరున కొక్క క్షణమైనను తీఱిక లేదు. వీనికి బురములోనికిఁ గాని యూరి దాఁటి గాని పోవుట కవకాశము లేదు. కావున నీతని కెవరితోడను సంసర్గము లేదు. లోకముతో సంసర్గము లేనివానికి లోకానుభవ ముండదు. లోకానుభవము లేనివారికి స్వపర తారతమ్య వివేక ముండదు. అది యుండనివానికి నాత్మవిశ్వాసము కుదు

రఁడు. ఇట్లు పరంపరగాఁ బ్రవరునకు నాత్మవిశ్వాసము లేదను సంగతి ప్రథమ పద్యముననే సూచించి మున్ముందు పద్యములలోఁ గవి దానిని విస్తరించెను.

ప్రవరుని దినచర్య చూచినచోఁ బై విషయము స్పష్ట మగును. అతఁడు తెల్లవాఱు జామున లేచి శిష్యులతోఁ గూడ వరణానది కేగి, యట స్నాన జపతపముల నిర్వర్తించుకొని, కొంత ప్రొద్దెక్కు నప్పటి కింటికిఁ దిరిగి వచ్చుచుండెను. ధర్మకర్మ తత్పరుఁ డగుటచే నప్పటినుండి మధ్యాహ్నము వఱకు నీ పనితో సరిపోవును. మధ్యాహ్న సమయమున నింటికి వచ్చిన యతిథులకు సపర్యఁ గావించి వారితోఁ గూడ భుజించును. భోజనానంతరము వారితోఁ దీర్థయాత్రలఁ గూర్చి ముచ్చటించును. అనంతరము శిష్యవత్సలుఁడు గావున విసుగు విరామము లేక యనారతాధ్యాపనతత్పరుం డగును.

ఎప్పుడును గర్మపరుఁడై యధ్యాపనతత్పరుఁ డగుచో వాని జీవిక యెట్లు? ఇలు దీర్చువా రెవరు? సంసార మెట్లు గడచును? వీని నిర్వహించుట కైన లోకముతో సంబంధము లేక యెట్లుండఁ గలఁడు? అను ప్రశ్నలు రా వచ్చును. ఈ ప్రశ్నలకుఁ దగిన సమాధానమును పెద్దన సూచించియే యున్నాఁడు. ప్రవరుఁ డొకరిని యాచింపవలసిన యవసరము లేదు. అతఁడు ధనాఢ్యుఁడు. మాన్యక్షేత్రములు పెక్కు చందాలఁ బండుటచే నింటఁ బాడియుఁ బంటయుఁ దఱుగక యున్నవి. అందువలన నొకరి నాశ్రయింపవలసిన యవసరము లేదు. సమృద్ధిగాఁ దినుట కున్నను ధనతృష్ణ యితరుల నాశ్రయింపఁ జేయును. కాని ప్రవరున కా తృష్ణయు లేదు. ఇతని కులము శీలము గుణములు చూచి పాత్రుఁ డని యే భూపాలుఁ డైనను దాన మీయఁ దలఁచినచోఁ జివరకు నెట్టి దోషము లేని సాలగ్రామదాన మైనఁ బట్టఁడు. కూరిమి సోమిదమ్మ సౌఖ్యావహయై భజించుచుండఁ దలిదండ్రులు సుఖులై దేవియు దేవర వోలె నిలు దీర్చుచుండగా నితని కాపురము లోప మేమియు లేక జరుగుచుండెను.

ప్రవరునకు లోకములో నెట్టి సంబంధము లేకున్నను జ్ఞానరహితుఁడైన మూఢుఁడు కాఁడు. ఇతఁడు వేదవేదాంగపారంగతుఁడు. అనారతాధ్యాపనతత్పరుఁ డగుటచే, ఆ సంస్కారము దృఢముగాఁ గలదు. ఇతఁడు భాషయం దపర శేష భోగి. తన యభిప్రాయము వివరించుటయందును, తన కిష్టములేని యితరుల మాటల ఖండించుటయందును సమర్థుఁడు. కాని పుస్తకజ్ఞాన మెంత యున్నను బ్రత్యక్షమునకు సాటి రాదు. ఒక విషయమును గూర్చి యెంత విన్నను జూచిన దానితో సమము గాదు గదా ?

ప్రవరుఁడు తరుణవయస్సునం దున్నాఁడు. తారుణ్యము నూత్నవస్తుదర్శనకుతూహలి. నిర్మలధర్మకర్మదీక్షాపరతంత్రుఁ డగుటచే ధర్మేతరము లైన కార్యములయం దాతనికి మనస్సు పోదు. తీర్థయాత్ర ధర్మకర్మమే యగుటచే నాతనికి వనధి పర్వత సరి త్తీర్థ సందర్శ నాభిలాష మాత్మ నుప్పొంగుచుండెను. కాని యగ్నిహోత్రి యగుటచే "సంకటా హ్యాహితాగ్నీనాం ప్రత్యవాయై ర్గృహస్థతా" అన్నట్లు ప్రత్యవాయ బాహుళ్యమున నిల్లు విడిచిపోవుట కేమియు నవకాశము లేకుండెను. తరుణాగ్నిహోత్రి యను పదముచే వాని మనస్సునం దున్న యీ యారాటమును గవి వ్యక్త మొనర్చెను. ఇందువలనఁ గర్మలోపము లేకుండఁ దీర్థసందర్శనోపాయ మతఁడు కోరుచుండె నని కవి సూచించుచున్నాఁడు. కాని యది యెట్లును సిద్ధింప కుండుటచే,

"పోయి సేవింప లేకున్నఁ బుణ్యతీర్థ
మహిమ వినుటయు నఖిలకల్మషహరంబ"

అని తృప్తి చెంది తీర్థసంవాసుల రాక విని యెంత దూరమైన వారి కెదు రేగి యింటికిఁ దెచ్చి సద్భక్తితో నాతిథ్య మొనఁగి సంతృప్తు లైన వారిఁ జేరఁ జని తీర్థమహాత్మ్యములఁ దెలియ నడుగుచుండెను. కర్మబాహుళ్యముచేఁ దాఁ బో లేక పోవుటకు వెచ్చ నూర్చుచుండెను.

ఇట్లుండఁగా నౌషధసిద్ధుఁ డొకఁడు వాని యింటి కతిథిగా వచ్చెను. ఆతని కెదు రేగి తెచ్చి పూజించి యిష్టమృష్టాన్నకలనసంతుష్టుఁ జేసెను. సుఖముగాఁ గూర్చున్న యాతని చెంతఁ జేరి తీర్థమాహాత్మ్యము లడుగ నారంభించెను. ఇంతవఱకుఁ బ్రవరునకు లోకానుభవము లేమిని దెలిపినాఁడు. ఇఁక లోకానుభవము లేకుండుటచే స్వపర తారతమ్య వివేకము, అందువలన నాత్మవిశ్వాసము లే దని యీ యౌషధసిద్ధుని తోడి సంభాషణమున వ్యక్త మొనర్చెను.

ప్రవర యోగ సిద్ధులలోఁ బ్రవరుఁడు మహత్తరుఁడు. ఇతఁడు వేద వేదాంగ పారంగతుఁడు. అనారతాధ్యాపనతత్పరుఁడు. వివిధాధ్వరకర్మ దీక్షాపరతంత్రుఁడు. భాషాపర శేషభోగి. అప్రతిగ్రహీత. అతిథిసపర్యాపరాయణుఁడు. అందువలననే కవి యీతని నంబురుహగర్భకులాభరణ మని ప్రశంసించెను. ఇఁక నోషధిసిద్ధుఁ డేవో కొన్ని యోషధుల శక్తు లెఱింగి తద్బలముచే సమస్తాశావకాశములఁ దిరుగ నేర్చెను. కవి యీతని బాహ్యాకారమును, దేశద్రిమ్మరితనమును వర్ణించెనే గాని యాతని గుణ విశేషమును గాని పాండిత్యవైభవమును గాని వర్ణింప లేదు. వర్ణింప కుండుటచే నాతని కీ లక్షణములు లే వని ధ్వనింపఁ జేసెను. ఈ విధముగా యోగసిద్ధుని కంటె నన్నిటఁ బ్రవరుఁ డధికుఁడు. కాని తన యౌన్నత్యము తా నెఱుంగఁడు. ఓషధిసిద్ధు నొక యోగిగాఁ దలంచెను. యోగుల శక్తుల నెఱింగిన వాఁ డగుటచే నీతని గూడ శక్తిమంతుని గాఁ దలంచెను. గురూపసదనకాలమునుండి తన యందు జీర్ణించిన వినయవిధేయతల నీతని యెడఁ జూప సాగెను. తన యధికారమును బట్టి యోషధిసిద్ధుఁడు ప్రవరునెడ వినయముతో మెలంగ వలెను. కాని యితఁడు దేశద్రిమ్మరి. దేశద్రిమ్మరుల కుండ వలసిన చొరవ యీ సిద్ధునకుఁ గూడఁ గలదు. ఇతఁ డతిశయమును జూపునే కాని ప్రవరు నెడ వినయవిధేయతలతో మెలంగఁడు.

వీరిరువురి సంభాషణములో నాలు గంతరములు గలవు.

1. మహిమోన్నతుఁ డయ్యును వినయమునఁ జేసి ప్రవరుఁడును, అల్పుఁ డయ్యును దేశద్రిమ్మరియగు సిద్ధుఁడును, సంభాషణారంభమున సమానస్కంధులుగా నుండిరి. ఇరువురు నొకరి నొకరు ప్రశంసించు కొనిరి. "మీ మాటలు..." అని ప్రవరుఁడు సిద్ధుని మహిమను సూచించుచు నుపచార వాక్యములు పలికెను. సిద్ధుఁడును మావంటి వారి కెల్ల గృహస్థులే గదా యాశ్రయ మని గార్హస్థ్యమును బ్రశంసించుచు నుపచార వాక్యములు పల్కెను. ఇట్లిరువురు సమానప్రతిపత్తితో సంభాషణము నుపక్రమించినను, పోనుపోను బ్రవరుఁడు వినయముచే వినమ్రుఁ డగుచుండెను. సిద్ధుఁడు స్వోత్కర్షచే నౌన్నత్య మొందుచుండెను.

2. ప్రవరుఁడు కౌతుకముతో "ఏయే దేశములం జరించితిరి... ఆ యా చోటులఁ గల్గు వింతలు మహాత్మా! నా కెఱింగింపవే!" అని వేఁడుకొనెను. సిద్ధుఁ డాదరాయత్తచిత్తుఁడై యతని కనియె. ఇపుడు సిద్ధుఁడు వక్త. ప్రవరుఁడు శ్రోత. వక్త యెక్కువ. శ్రోత తక్కువ. ఈ విషయము ప్రవరుఁడు "మహాత్మా!" అని సంబోధించుటచేతను, సిద్ధుఁ డాదరాయత్తచిత్తుఁడై యనుటచేతను ధ్రువపడుచున్నది. సిద్ధుని సంభాషణలో నాతని స్వోత్కర్ష బాగుగా వ్యక్తమగుచున్నది. నేను సమస్తాశావకాశములను జూచితిని. అచ్చటచ్చటం గల తీర్థవిశేషంబుల వర్ణింప నేరి తరము? అస్తంబునం గల మణిప్రస్తరంబుల విశ్రాంతిఁ జింతించిన మేనం బులక లిప్పుడు వొడమెడు, రజతశైలంబు నోలంబులం గాలగళు విహార ప్రదేశంబులం గనిన సంసృతి క్లేశంబులు వాయవే? మేరు శిఖరంబుల సోయగంబులఁ గలయం గనుంగొనుట బహుజన్మకృత సుకృత పరిపాకంబునం గాక యేల చేకూర నేర్చు? యని చవులూరఁ జెప్పి 'ఏ నట్టి మహాద్భుతంబు లీశ్వరానుగ్రహంబున నల్ప కాలంబునఁ గనుఁగొంటి'నని యది విన్నవారికి సహజముగాఁ గల్గెడి సందేహమును వారించెను.—ఇది రెండవ యంతరము.

3. సిద్ధుని తీర్థయాత్రావృత్తాంతమును శ్రద్ధతో నాలించి ప్రవరుఁ డాశ్చర్య చకితుఁ డయ్యెను. ఏదో జనసామాన్యమునకుఁ దెలి యని మహిమ యీతనియందుఁ గలదు. చూడఁగా నీతఁడు ప్రాయ పుఁజిఱుత వాఁడు. తెక్కలు గట్టుకొని యెగిరిపోయినను నీతఁడు వర్ణిం చిన తీర్థములఁ జూచుటకు మఱి యేండ్లును బూండ్లును బట్టును. ఈశ్వ రానుగ్రహమువలనఁ దన కీ మహిమ గల్గె నని యీతఁడు చెప్పుచు న్నాఁడు గాని వారి మహిమలు వా రెఱుంగ వలసినదే గాని నా బోటి వాని కూహింప శక్యము గాదు. అట్టి మహిమాన్వితుని యనుగ్ర హము వలనఁ దాను దీఱని యీ తీర్థయాత్రావాంఛ నెందులకుఁ దీర్చుకొనఁ గూడదు? ఒకరికి పీ లైనది మఱి యొకరికి పీలు గా కుం డునా? అయినను వెఱపు లేక యీ సంగతి యడుగు టెట్లు? అని తలంచి కుతూహలాతిశయమున నెట్లో వినయభంగమున కైన నోర్చి సిద్ధునితో "వెఱువక మీ కొనర్తు నొక విన్నపము...మీ మహిమ తీర యెఱుంగుదు రేమి చెప్పుదురు" అని వినమ్రుఁ డై యడిగెను. అంత సిద్ధుఁడు తన యాధిక్యమును సూచించుచు "సందియము తెలియ నడుగుట తప్పా? ఇది పరమరహస్య మైనను దాపక చెప్పెదను. పాద లేప మను దివ్యౌషధము కలదు. దాని భూరి ప్రభావముచే మనోవేగ ముతోఁ జరించుచుందు" మని పల్కెను.

ఇపుడు ప్రవరుఁ డాతని ప్రభావమునకు వెఱఁ గందుచున్నాఁడు. సిద్ధుఁ డాతని కథయు మెచ్చుచున్నాఁడు — ఇది మూఁడవ యం తరము.

4. సిద్ధునకుఁ గల తీర్థాటన సామర్థ్యము తన కెట్లు కల్గునా యని శంకించుచున్న ప్రవరునకుఁ బాదలేప ప్రశంసచేఁ గుతూహలము కుత్తుక బంటి యయ్యెను- ధర్మకర్మములకు లోపము లేకుండఁ దీర్థాటనము సలుపఁ గల్గుట యెట్లను తీఱని కోరిక నేఁడు నెఱవేఱఁ గల దను నాన పొడమెను.

ప్రవరుఁ డంత ముందు మీ మహిమలు మీకే తెలియును మా కేమియుఁ దెలియవు; అయినను మీ కొక విన్నపము చేసెద నని పల్కెను. ఇప్పుడు భక్తితో దోసిలి యొగ్గి మీ దివ్యపరిభాషం బెఱుఁగని నా ప్రల్లదములు సహింపుఁడు. కోపపడక దయతో నన్ను మీ శిష్యునిగా స్వీకరించి తీర్థయాత్రలవలన ధన్యాత్ముఁగా జేయుఁ డని వేఁడుకొనెను. చూడుఁడు. భాషాపరశేషభోగి యగు ప్రవరుఁడు తనకు లేని తీర్థయాత్రాసాధన మగు పాదలేపనము కల్గి నంతమాత్రన సిద్ధుని యెదుటఁ దా నాడిన మాటలు ప్రల్లదము లని వినయభరముచే నెంత క్రుంగిపోయినాఁడో! అంత సిద్ధుఁడు తన ప్రేఁపసజ్జ దంతపు బరిణె యం దున్న పాదలేపనమును దీసి యిది యది యని చెప్పక యాతని కాలికిఁ బూసెను. లోకములో మంచి భేషజముగలట్టి వైద్యుఁ డొకఁడు మం దిచ్చు నపు డిది యది యని చెప్పఁడు. తా నిచ్చినది తీసికొన వలెను గాని యదే మని యడుగుటకు రోగి కర్హత లే దని యాతని యభిప్రాయము. వైద్యున కెక్కడఁ గోపము వచ్చునో యని, కోపము వచ్చినచో మం దెక్కడ నీయఁడో యని మందుపేరు తెలిసికొని మాత్రము నే నేమి చేయవలెను. కావలసినది రోగము కుదురుటకుఁ గదా యని, రోగి యా మందును స్వీకరించును. అట్లే ప్రవరుఁడు ప్రశ్నించినచో సిద్ధున కేమి కోపము వచ్చునో యనియు, తీర్థయాత్రా సామర్థ్యము కలిగిన చాలు ననియు మఱుమాట పలుకక పాదలేపమును గాలికిఁ బూయించుకొనెను. దీనితోఁ బ్రవరుని వినయము, సిద్ధుని స్వోత్కర్ష యుఁ బరాకాష్ఠ వహించెను.

ఇటఁ బ్రవరుఁడు లోకానుభవము లేమి స్వపరతారతమ్య మెఱుంగఁడు. ఉత్కృష్టుఁ డగు తన్నపకృష్టుని గాను, తా నెఱుంగని పాదలేపము కల్గినంత మాత్రానఁ దన కంటె నపకృష్టుఁ డగు సిద్ధుని మహిమాన్వితుని గాను దలంచి వినయభారముచేఁ గ్రుంగిపోయెను. ఇట్లు సకల గుణసంపూర్ణుఁ డైనను నాత్మవిశ్వాసము లేకపోవుట ప్రవరుని గొప్ప లోపము. ఈ లోపమును దీర్చి యాతని నాదర్శబ్రాహ్మణునిగాఁ గవి

చేయఁదలంచెను.

ప్రవరుఁడు పాదలేపప్రభావముచేఁ బుణ్యక్షేత్రముల కాలవాలము, దివ్యతీర్థములకు నిలయమును, ప్రకృతివైచిత్రికిఁ దావలము నగు హిమగిరి కేఁగెను. అచట బదరీనారాయణాది పుణ్యక్షేత్రములఁ జూచెను. ఒక క్షేత్రమునుండి మఱియొక క్షేత్రమునకుఁ బోవుచు నడుమనున్న ప్రకృతివైచిత్రి కబ్బుర మందెను. అంత మధ్యాహ్న మగుటచేఁ దత్కాలోచిత కృత్యములఁ దీర్చికొనుటకు నింటికిఁ బోవఁదలంచి—

"తలమే బ్రహ్మకు నైన నిన్నగ మహత్త్వం బెన్న నే నిమ్మెయిం
గల చోద్యంబులు రేపు గన్గొనియెదం గాకేమి నేఁ డేగెదన్.

అనుచుఁ గ్రమ్మఱు వేళ మంచుతోఁ బెరసి పాదలేపము కరఁగిపోయెను. ఆ సంగతి పాప మాతఁ డెఱుంగఁడు. ఎగిరిపోవుటకుఁ గాళ్లెప్పుడు రాలేదో యప్పు డాతని సంతాపమున కంతు లేదు—

ఇంటిపట్టుననుండి యిదివఱ కెన్నఁడు నూరువెడలి యెఱుంగఁడు. ఇప్పుడు ఘోరవనప్రదేశమునఁ నొంటఁ జిక్కుకొనెను. తా నెటు వచ్చినది తెలియదు. తన యూరి కెటు పోవలసినది త్రోవ చూపెడివారు కానిపించరు. ఇట్టి స్థితిలోఁ గూడ వినయవంతుఁ డగుటచే "బుద్ధిజాడ్యజనితోన్మాదుల్ గదా శ్రోత్రియుల్" అని తన్ను దా నిందించుకొనఁ జొచ్చెను. తన యూరినుండి వెడలివచ్చినందులకుఁ గాని యొంటిగా నుంటి నని గాని బాధపడుట లేదు. నిత్యనైమిత్తికాదికర్మలకు లోపము కల్గెనే యని యాతని విచారము. ఎచ్చట హవ్యకవ్యములచే సంప్రీతుఁ డగు నగ్నిహోత్రుని స్తుతించి యింటికిఁ బోఁగల శక్తియాతని కప్పుడు లేకపోలేదు. కాని తన శక్తి తా నెఱుంగఁడు, అనఁగా నాత్మవిశ్వాసము లే దన్నమాట. అందువలన "నను నిలుసేర్చు నుపాయం బొనరింపఁగఁ జాలు సుకృతి యొకఁ డొదవఁడొకో" యని పరాపేక్షచేఁ జింతాసాగరమున మునింగెను. భయంబు గదురఁబోవుచు నెదుర గంధర్వ యక్షగాన ఘూర్ణితమగు నొక్కకోనఁ గనెను. కనుఁగొని యిది

మునియాశ్రమ మని యూహించి యందలి ముని యనుగ్రహవశమునఁ ఘ్రిటిలో నింటి కేఁగి కర్మలోపము లేకుండఁ జేసికొన వచ్చునని తలంచెను. అది మునియాశ్రమ మని తలంచుటలోఁ బ్రవరుని మనోవృత్తులఁ బెద్దన చక్కఁగా ధ్వనింపఁజేసెను. ఆ కోనలోనికిఁ బోయి పోయి యొక శృంగారసన్నివేశమధ్యమున నున్న గారుడోత్కీర్ణ మైన భవనమును గాంచెను. మునియాశ్రమ మని యచ్చటి కరుదెంచిన ప్రవరుఁ డా భవనమును గాంచి యచ్చెరు వంది సమీపించుచుండఁగాఁ దాంబూల పరిమళముచే గుమగుమ లాడు నొక వాయువు వీచెను. ఇట్టి పరిమళమునకు నాలవాల మగు నా భవనము మునినిలయము కా దని యెఱింగియు జనాన్వితముగదా, యందలి వారి యనుగ్రహముచేఁ దన యూరు చేరలేక పోదునా యని తలంచి యా భవనము చేరఁబోయి లోకోత్తర సౌందర్యరాశి యగు మరున్నారీశిరోరత్నమును గాంచెను. ఆమె స్త్రీ యని యాతఁడు సంకోచింప లేదు. ఆమె మాత్రము "ఇలు సేర్చు నుపాయం బొనరింపఁగఁ జాలు సుకృతి కాఁగూడదా? యని సమీపించెను. ముందు కవి వరూధినిని శృంగారరసస్వరూపిణిఁ గావించెను.

ఆమె పుట్టినది పాలసముద్రము, చంద్రుని చెల్లె లైన చెలువ యామెతోఁబుట్టువు. సకలశిల్పశాస్త్రవిచార మామెకు సహజమైన విద్య. జంత్రగాత్రముల రా ల్గరగించు గాంధర్వము నేర్చుకొన్న విద్య. త్రిమూర్తుల సభలు విద్యాప్రదర్శనశాలలు. రంభాతిలోత్తమాదులు ప్రాణసఖులు. మేరుపర్వతమునందలి కల్పవృక్షవాటికలు విహారసీమలు. అశ్వమేధ రాజసూయాదియాగములు సల్పినవారికే యామె లభింపఁ గలదు. ఈ విధముగ నతిదుర్లభ మైన స్త్రీరత్నముగా వరూధిని-చిత్రింపఁ బడెను.

అనంతరము తదనురూప మైన పరిసరముల నిట్లు వర్ణించెను. ఆమె యింటిముందు లేఁత మామిడిగున్న గలదు. దాని మొదట మణులు తాపిన యరుఁగు గలదు. చల్లనిగాలి కొట్టుచుండఁగా నామె దానిపైఁ గూర్చుండెను. ఆ సుందరి చంద్రకావి పావడగట్టి దానిపై నాణె మైన

రవసెల్లా చుట్టి పైఁట వేసికొని చంద్రకాంతమణులు పొదిగిన పీటపైఁ గూర్చుండెను. వ్రేళ్లతో మీటునపుడు తంత్రులవలనఁ బుట్టిన నాదముతో నవ్యక్తమధుర మైన సన్నని కంఠనాదము లయించి, ముద్దులొలుకుచుండ నాలాపగతిఁ జొక్కి యరమోడ్పుఁగను దోయి రతిపారవశ్యవిభ్రమము దెలుపఁగా, వీణపైఁ బలికించు గీతప్రబంధములకుఁ జేతియందలి రత్నకంకణఝుణఝుణధ్వనులు తాళమానములు గొల్పుచుండ, మనోహరముగా వీణ వాయించుచుండెను. ఎట్టి విరాగి కైనను జిత్తము మెత్తఁజేయు శృంగారసన్నివేశ మిందుఁ గవి ప్రతిభానిబద్ధమయ్యెను. ప్రవరుని ధర్మప్రవణత్వమును నిరూపించుట కిదియే సరియైన నికషస్థానము కాఁదలంచి కవి యాతని నీ పరిసరములలోనికిఁ దెచ్చెను.

ఆమె శృంగారమూర్తి. యతఁ డతిలోకసుకుమార సుందరాకారుఁడు. ఒంటిపాటునఁ దనయింటి కరుదెంచెను. "వరూధినికి వంటయింటిలోఁ గుందేలు చిక్కినట్లైనది." ఎట్లూరకుండఁగలదు? ప్రణయరసము పొంగఁ జొచ్చెను. నయనాంబుజములు వికసింపఁగా, కన్నులనుండి నల్లని కాంతులు పొంగి పొరలఁగాఁ జన్గవ గగుర్పొడవఁగాఁ గోర్కెలు గుబ్బటిలఁగా, నామె ప్రవరుని దిలకించెను. అతని జూచినపిమ్మట నామె కే లక్షణము లుదయింప లేదు. చూపుతో సమముగా నివి పొడసూపెను. ఈ వర్ణనమున నామె రతిని సామాన్యముగా నిరూపించి యనంతర మామెకుఁ గల్గిన రతివికారములఁ గవి వర్ణింపఁజొచ్చెను. "చూచి ఝుణంఝుణత్కటక- అను పద్యమున సంచారిభావములను, తరువాతి మూఁడు పద్యములలో నామెకుఁ గల్గిన సాత్వికభావములను వర్ణించెను. రతి యిట్లు క్రమముగాఁ బుష్టి చెందుచుండ "ఏలని బంటుగా మరుండక్కఁ గొనంగరాదె యకటా! నను వీఁడు పరిగ్రహించినన్" అని తలంచెను.

ఇట్లు మన్మథబాణపీడిత యై యగ్గల మగు పెందత్తరమున లజ్జ పెత్తఁగా దారి కడ్డముగా నిలిచెను. అట్లడ్డముగా నిల్చిన వరూధినిని

చేరఁ జని ప్రవరునకు సంభాషింపఁ దొడంగెను. ఈ సంభాషణములో కూడ ఆత్మవిశ్వాస మగ్గలము. కాని పోనుపోను బ్రవరుఁడు గడుసువాఁడై యాత్మవిశ్వాసము బడయుచుండఁగా వరూధిని కదియంతరించి దీనురా లగుచుండెను.

1. ప్రవరుఁడు వరూధినిని జేరం జని "అమ్మా! భయము లేక యొంటిమై యి వ్వనభూమిలోఁ దిరుగుచున్నదానవే, నీ వెవ్వతవు? నేను బ్రాహ్మణుఁడను. ప్రవరుఁ డను పేరివాఁడను. మక మెక్కి యి న్నగాగ్రమునకు వచ్చి త్రోవఁ దప్పితిని. మా యూరి మార్గము తెల్పుము. నీకు శుభం బగు''నని పల్కెను.

ప్రవరుఁడు సరళ స్వభావుఁడు. తన యొంటరితనమునకు భయపడఁ జొచ్చెను. మహిమాన్విత కావున వరూధిని యొంటరిగా నుండెనని తలంచి యీమె యెడఁ గూడ భయభక్తులతో మెలంగి తన యూరి త్రోవ చూపు మని యడిగెను.

వరూధిని తన విలాసవిభ్రమములచే నాతని వలపింపఁ జూచుచుండెను. పరవశీకరణమున వేశ్యలు చూపెడి చాకచక్యము నీమెయం దద్భుతముగాఁ బెద్దన చిత్రించినాఁడు. తన్ను జూచినంతనే యాతఁడు వశంగతుఁ డగునని యామె విశ్వాసము. అతఁ డట్లు కాకుండుటచేఁ గనుంగవ మెఱుంగు లుబ్బఁ దాటంకములు, చనుఁగవయు,నడుము వడంకఁగా సెలవివాఱ విలాసముగా నొక నవ్వు నవ్వెను. "స్త్రీణా మాద్యం ప్రణయవచనం విభ్రమో హి ప్రియేషు'' అన్నట్లు తన విభ్రమములనే ప్రణయవచనముగాఁ బచరించెను. ఇంకొకఁ డైనచో నా నవ్వును జూచి యామెకు పాదదాసుఁ డయ్యెడివాఁడే. ఇట్లొనర్చినను బ్రవరుఁడు మాత్రము చలింపలేదు. ఆ ఛాందసునకుఁ దన విలాసము లర్థము కా లేదని యామె పలుకరింపఁ గడంగి "భూసురేంద్ర! ఒంటరిగా నున్న నన్ను బలుకరింపవలె నని కాని లేనిచోఁ జెంపకుఁ జేరెడు కన్నులున్న వే నీవు వచ్చినత్రోవ నీకుఁ దెలియదా? భయములేక యిట్లు పలుకుటకు

మే మంత చులుకనై తిమా?" యని సాభిప్రాయముగా నుడివెను. ఇప్ప టికిని బ్రవరునియం దెట్టి వికారము గన్పడలేదు. తన యభిప్రాయము గ్రహించెనో లేదో యీ గోలయని స్పష్టప్రతిపత్తికై తన వృత్తాంతము దెలియఁజేసి "ఈ మనోహర ప్రదేశము లన్నియు నా విహార ప్రదేశము లు. నీవు మా యింటి విందవైతివి. ఇచట నేఁడ దేతీ యాతిథ్యమును బడసి పొమ్ము, "అని యాతిథ్యవ్యాజమును బ్రకటించియు నతనిపై వలపు నాఁపుకొనఁజాలక "అయ్యో! కుందనమువంటి శరీరము నడియెండ కెంతగాఁ గందిపోయినదో! ముద్దులొలుకు నీ మొగ మెంతగా వాడినది విశ్రాంతికై మా యింటికి వచ్చి మమ్ముఁ బవిత్రులఁ జేయు మని కోరెను.

ఇందు వరూథిని కాతనిపైఁ గల వలపు వ్యక్త మయ్యెను. మాయ లచే నాతని వశము గావించుకొను తలంపు స్పష్ట మయ్యెను. తన మాయ లు భగ్నమైనకొలఁది మనమున నెట్లు సమాధానపడుచున్నది తెల్ల మయ్యెను.

2. ప్రవరునకు మొదట నామె మాయమాట లర్థము కాలేదు. నిజముగాఁ దనకు నాతిథ్య మొసంగఁదలంచుచున్న దనుకొని నిజగృహ గమనవ్యగ్రుఁడై యిట్లనెను-" ఓ యింతీ ! నీవు చేయు నతిథిసపర్యలు మాకు వచ్చినవి. మీ యింటికి వచ్చి యొకటి, రాక మఱియొకటి యునా ? ప్రియమే చాలును. మా ధ్యాహ్నికములకై త్వరగా నింటికిఁ బోవలెను. మీ మహత్త్వములు దివ్యములు. తలఁచుకొన్నచో నొక్క నిముసములో నన్ను మా యూరు చేర్పఁగలరు. కావున నో తల్లీ! నన్ను ప్రియలతోఁ గూర్పు మని వేఁడుకొనెను.

మాధ్యాహ్నిక కర్మలు చెడిపోవు నని విచారించుటచేఁ బ్రవరుని గృహ్యకర్మాసక్తి తెలియనున్నది. తన పొందువలనఁ గల్గుసుఖముచే నూహింపఁదలఁచి తన వలలోఁ బడక మాటిమాటికిఁ దనయూరి దారి నడుగు ప్రవరునితో వరూథిని యిట్లనెను."ఏమయ్యా! నీకుఁగాలు నిలు వదా ? ఊరక యూరికిఁ బోవలె నని పల్కెదవు. ఇక్కడి రత్నకందర ములు, చందనవనములు, గాంగసైకతములు, లవలీనికుంజములు మీకు

టీర నిలయములకు సరిరాకపోయెనా ?" అని తన యభిప్రాయమును ధ్వనింపఁజేసి "చల్లకు వచ్చి ముంత దాఁపనేల" యని విస్పష్టముగా "బ్రాహ్మణోత్తమా ! నా మనము నీపైఁ జిక్కెను. నన్ను మన్మథునకు నప్పగించెదవో, పూవుపొదరిండ్లను గౌఁగిట గారవించెదవో నీ యిష్టము" అని పల్కెను.

ఇచట వరూధినికిఁ బరాజయము కల్గెను. కాని యామె కది గోచరింపలేదు. ఛాందసుఁ డగుటచే స్పష్టముగాఁ జెప్పినఁగాని తన యభిప్రాయము ప్రవరునకుఁ దెలియ దని తలంచెను.

3. మీ మహత్త్వములు దివ్యము లని వరూధినిని బ్రవరుఁడు మొదట గారవించెను. ఆమె తన్ను గామించుచున్నదని గ్రహించిన పిమ్మట నీరసభావముతో "వనజేక్షణా ! విచారింపక వ్రతు లైన బ్రాహ్మణులఁ బ్రేమింపఁదగునా ? నే నిక్కడ నున్నచో సురార్చన, విప్రసపర్య, జననీ జనక సేవ మొదలగు గృహ్యధర్మములు చెడుటయే గాదు. ఆహితాగ్నిని గావున నా శ్రౌతధర్మములకుఁ గూడ భంగము కలుగును. శ్రౌతధర్మములకు భంగము కల్గినచోఁ బ్రాయశ్చిత్తము చేసికొనుట మొదలగు నగచాట్లెన్నియో పడవలసివచ్చు నని తాత్పర్యము. కావున నింటికిఁ బోవలెను. దారి తెల్పు మని వేఁడెను. ఇందుఁ బ్రవరుని గృహ్యశ్రౌతకర్మనిరూఢియు, దానివలనఁ గల్గిన యింద్రియనిగ్రహము వ్యక్తమగుచున్నది. ప్రవరుఁడు తన్ను తెలిసియే నిరాకరించుచున్నాఁడని వరూధినికి స్పష్ట మయ్యెను.

తా నొకరి నిరాకరించుటయే గాని నిరాకృతి యన్న నెట్టిదో యెన్నఁడు నెఱుఁగని వరూధినీ సమ్మోహనశక్తి నేఁడు కుంఠితమయ్యెను. ఆత్మవిశ్వాసము కొంత సడలి యొక మెట్టు దిగి మోమున విన్నబాటు గాన్పింపఁగాఁ బ్రవరుని బ్రబోధింపఁదొడంగి "మన్మథాకారా ! లేఁబ్రాయమున వైదికధర్మములయందు వినియుక్త మగుచో నీ వింక భోగములఁ బొందుట యెప్పుడు ?" అని పలికి నాకు భోగములతోఁ బని లే దని యాతఁడు నిరాకరించునేమో యని తలంచి యాతని భోగపర్వ

తమును నిరూపించుచు నిట్లనెను-"శ్రౌతధర్మము లగు యజ్ఞములు పలుపుట స్వర్గము కోసమేగదా! ఆ స్వర్గము మాకవుఁగిళ్ల సుఖించుటకోసమే గదా! పరలోకమున నట్టి భోగముల కాసించి మీరు యజ్ఞములు చేయుచుంటిరో యవి యిచ్చటనే యప్రయత్నముగా సిద్ధించుచుండఁగా నీ శ్రమ యేల? మా భవనములో భోగములకు లోపము లేదు. మృగమదము, జవాజి, పచ్చకప్పురము, పన్నీరు, కుసుమకదంబమును, ఇంకను గల్పవృక్షము లోనగు సంపదలు గలవు. కావున భోగపరుఁడవై నన్ను గూడి సుఖముగా రమింపుము. కోరికను లభింపని గంధర్వాంగనల పొందు కాదను కొఱగామి యుండునా? మిక్కుటమైన వలపుచేఁ దమ గాలి సోకినంతనే కరఁగిపోవు స్త్రీలను గౌఁగిటఁ జేర్చు భాగ్యము పెక్కుజన్మము లెత్తినఁగాని లభింపదు."

ప్రవరుఁడు నిరాకరించుచున్నకొలఁది యామెకు మోహ మగ్గలమగుచున్నది. తన విలాసవిభ్రమము లాతని కర్థము కా లేదనుకొని స్పష్టముగాఁ దన వల పెఱింగించినది. అతఁడు దానిని స్పష్టముగా నిరాకరించినాఁడు. ఇపుడు ప్రవరుని ప్రబోధించి తనమాట నేర్పరితనముచే నాతని వశ్యుని గావింపఁదలఁచినది. తన పొందువలని సౌఖ్య మాతఁడొనర్చు వైదికకర్మల ఫలమే గాని మఱియొకటి కాదు. అందువలనఁ దన్ను వలచుటవలన నాతనికిఁ గల్గు ప్రతిభంగ మేమియు లేదని చెప్పెను.

4. "స్వర్గకామో యజేత"- స్వర్గమును గోరువాఁడు యజ్ఞము చేయవలె నని వేదము లుద్ఘోషించుచున్నవి. స్వర్గకాముఁడై యజ్ఞము నర్చువానికి స్వర్గము తద్భోగములు సిద్ధించుమాట నిజమే. కాని ఫలాపేక్ష లేక నిష్కామముగా యజ్ఞములు చేయువానికిఁ జిత్తశుద్ధి కలిగి స్వర్గసుఖముకంటె నెన్నో మడుంగు లధిక మగు బ్రహ్మానందపదవి లభించును. ఫలాపేక్షచేఁ గర్మ లాచరించు కాముకుఁ డగు బ్రాహ్మణుఁ డింద్రియవశంగతుఁడై మన్మథశరశరవ్యుఁడై నశించును. కావున నీవు చెప్పినట్లు యజ్ఞములకు ఫలము స్వర్గభోగము లనుభవించుటయే గాదు. నిజమగు ఫలము బ్రహ్మానంద మనుభవించుట. నేను దానికై పాటుపడుచుంటిని గావున నన్ను నిర్బంధింపక యెఱిఁగితేని నగరమార్గమును

జూపి పుణ్యమునఁ బొమ్ము.'' అని వరూధిని మాటలకుఁ బ్రవరుఁడు సమాధాన మొసంగి యితరప్రసంగమును వారించెను.

ఇందుఁ బ్రవరుని ధర్మాచరణ మెట్లుండెనో తెలిపి యాతఁ డుత్తమ బ్రాహ్మణునిగా నిరూపించినాఁడు కవి. వరూధిని దన్ను వశ్యుని గావింపఁదలఁచినకొలఁది యాతఁడు త్రిదుపాలుచున్నాఁడు. ఇంత నీచముగాఁ బ్రవర్తించు నీమె యెట్టి దివ్యకాంత యని యామెను దివ్య కాంతగాఁ బరిగణింపక సాధారణ మైన స్త్రీ జనముగాఁ దలంచి నీకుఁ దెలిసినచో నగరమార్గమును దెల్పుము. తెలియ కున్నచో నూరకుండు ము. నాకు మాత్రము బోధింపకు మని పల్కెను, ఇప్పటికిఁ బ్రవరునకు స్వపరతారతమ్యము తెలిసెనేగాని యాత్మ విశ్వాస మింకను కుదురు కొనలేదు. ఇల్లు చేరుట కింకను వరూధినీ సాహాయ్య మర్థించుచుండెను.

తాను కాంక్షించుచున్నది బ్రహ్మానందపదవి గాని యిహపర లోకభోగములు కా వని ప్రవరుఁడు వరూధినీవాదమును ఖండింపఁగా నాతని పల్కుల కామె బెదరియు మన్మథసంతాప మధిక మగుచుండు టచే నె ట్లైనను నతనిని వశ మొనర్చుకొనవలె నని తహతహ పడు చుండెను.

ప్రవరుఁ డొంటిపాటున నున్నాఁడు. గొంటుతనం బెఱుంగఁడు. కంటి కింపుగాఁ దంగేటిజుంటివలెఁ గుఱ్ఱంగట నున్నాఁడు.

కల్పతరుమధ్య మానినకై పు, నవయావనమదము, అసమాన సౌందర్యగర్వము నామెను దట్టుముట్టాడి వివేకభ్రష్ట నొనర్చెను. ఎది రిని దన్నుఁ దెలియనేర దయ్యెను. తన వైదగ్ధ్యమును మెఱసి యతని నవయావనసౌందర్యములఁ జూఱఁగొనవచ్చునుగదా యని యోజించె ను. వెనుకటివలె విడివిడిగాఁ గాక తన విలాసవిభ్రమములను, మాట నేర్పును, యుక్తివైచిత్రి నొక్కసారి చూపి యాతని లోఁగొనఁదలం చెను.'' ముఖవికాసము గనిపింపఁగా, కొప్పు చెక్కుచు, గబ్బిగుబ్బల ముత్యాలహారములఁ దీరువడంజేయుచు, కుసుమకేసరంబుల రాల్చు నెపంబునఁ బయ్యెద విదిల్చి చక్క నవరించుచు, అంత బోడనూపు చెలులం దలనూపకుండఁ జూపు జంకెనల వారించుచుఁ బ్రవరుని జే

యిట్లనెను. "ఏ విషయములందు నింద్రియములు మనస్సు నేకాగ్రమై నానందమును జెందుచుండునో, ఆ యానందమునే పరబ్రహ్మ మందురు. 'ఆనందోబ్రహ్మ' యను నుపనిషద్వాక్యమున కిదియే యర్థము. అట్టి యానందము నా తోడి సమాగమమున సిద్ధించుచుండఁగా నీకు నసత్య విచారములతోఁ బని యేమి?" అని మాట విన్నాణ ముట్టిపడఁ దన వాద బలముచే నాతని నోడఁబఱుచుటకుఁ బ్రయత్నించెను.

నిరాకరింపఁబడిన కొలఁది వరూధినికి మోహ మగ్గల మగుచుండెను. అందువలనఁ దనకుఁ గల్గిన పరాభవ మామె గ్రహింపలేకపోయెను. తన శక్తియుక్తుల నొక్కుమ్మడిఁ జూపి ప్రవరుని లోఁగొనఁదలంచెను.

౫. తన్నోడఁ బఱుచు వరూధిని తత్తఱమును జూచి ప్రవరునకు మనమున సిగ్గు నసహ్యము జనించెను. నిస్పృహతోఁ దెల్పు చిఱునవ్వు నవ్వి యామెతో నిట్లనెను. "ఆనందోబ్రహ్మ" యను వాక్యమునకు బాగుగా నర్థము చెప్పితివి. ఈ పాండిత్యము నీకుఁ దక్క మఱియెవ్వరి కైనఁ గలదా! కామశాస్త్రోపాధ్యాయిని వలె నున్నావు. ఓహోహో! వేదధర్మములు పాపములా? రతి పుణ్యమా? ఉపనిషత్తులకు మీ సంప్రదాయార్థము లివేగదా? హవ్యవాహనుఁ డొసంగు సౌఖ్యముల నెఱుంగక యిట్లు మాటాడుచుంటివి. నీవు చెప్పెడివి తుచ్ఛసుఖములు. అవి మీసాలపై తేనియలు. నాకు సరణులు, దర్భలు, ప్రియము లైనట్టు లన్యములు గావు." ఇచట కవి ఉత్తమ బ్రాహ్మణునకు వలయు జ్ఞాన వైరాగ్యములు ప్రవరునియందుఁ బ్రదర్శించెను. వరూధిని చేష్టలు, మాటలు నతని కసహ్య మనిపించి యీసారి తన యూరికిఁ దోవఁ జూపు మని యడుగలేదు. పరాపేక్ష క్రమముగా నంతరించెను.

ఏమి చేసినను ప్రవరుఁడు లొంగకుండుటచేఁ దన వైదగ్ధ్యము వ్యర్థ మయ్యె నని వరూధినికి హృదయము జల్లు మనెను. కన్నులలో నీరు గిఱ్ఱునఁ దిరిగెను. అతనిఁ జేరఁ జూచుచుఁ దల యూఁచి గద్గదికతోఁ "వనిత తనంతఁదా వలచి వచ్చినఁ జుల్కన గాదె యేరికిన్" అని దైన్యమును వెళ్ళఁబోసియు మన్మథోద్రేకము పొంగిపొరలుటచే "నన్నింక

దుఃఖపెట్టకు'' మని పల్కుచు, నీవీబంధ మూడఁగా, కొప్పు వీడఁగా, శరీరము పులక లెత్తఁగా, నిట్టూర్పులు నిగిడించుచు సనుసయాలాప దీనాస్యయై యతని గౌఁగిలించి యధరం బాసించె.

వ్యసనాసక్తులకుఁ బ్రయత్నవైఫల్యము జ్ఞానకారణము కాదు. ప్రయత్నములు విఫలమగుకొలఁది యభినివేశము మఱింత యతిశయించు చుండును. అందువలనఁ దన వైదగ్ధ్య మంతయు వ్యర్థ మైనను నామెకుఁ దెలిసి రాలేదు. ప్రవరుఁడు గోల గావున మోమోటపడుచున్నాఁ డేమో యని తలంచి తానే బలాత్కారముగాఁ గౌఁగిలించినచో నాతని హృదయము కరంగకుండునా యని యూహించి యామె యతనిపైఁ బడెను.

నిరాకరింపఁబడినకొలఁది వరూధిని ప్రేమ యె ట్లుత్కటస్థితిఁ గాంచెనో తెలియుచున్నది. ఆమె కామించినకొలఁది ప్రవరునకు నింద్రియ నిగ్రహ మధిక మై పరాపేక్ష తగ్గుచుండెను. వరూధినికిఁ దన వైదగ్ధ్యము నందలి విశ్వాసము తగ్గెను.

6. వరూధినిని గౌఁగిలింపఁగాఁ బ్రవరుఁడు "హా! శ్రీహరీ" యని మోర మో మిడి యామె యంసద్వయముఁ బట్టి పొ మ్మని వైచెను.

ఇందుఁ బ్రవరుని ధర్మవీరత్వము పరాకాష్ఠ వహించినది. వైదిక కర్మానుష్ఠానముచే నాతని కింద్రియనిగ్రహము, చిత్తశుద్ధియుఁ గుదురు కొని యున్నవి. తాను యువకుఁడై మోహనమూర్తియై, యువతియై మోహనమూర్తియగు నప్సరఃకాంత తన్ను గౌఁగిలింపఁగా మెత్తపడు టకు మాఱుగా గడుసువాఁడై, ఆమె శరీరస్పర్శ పాపముగా దలంచెను. పాపపరిహారమునకై "హా శ్రీహరీ" యని భగవంతుని ధ్యానించెను. ఆమెను జూచుటయు పాపమే యని తలంచి మోర మో మిడి దూరము గాఁ ద్రోసివైచెను. వీరి యుద్ధతీ సంఘర్షణములోఁ బ్రవరుఁ డెక్కడ వరూధినీవాగురలలోఁ జిక్కుకొనునో యని పాత్రలచాటున నుండి పొంచి చూచుచు, ప్రవరుఁ డామెను ద్రోసివైచుటను జూచి, సంతో

షముతో “కలఁచునే సతుల మాయల్ ధీర చిత్తంబులని” అని పెద్దన ధర్మపతాక నెత్తెను.

ప్రవరునిచేఁ ద్రోపువడిన వరూధిని పరాజయపరాభవ మొందెను. కాని మోహాంధురా లగుటచే దానిని గాంచలేకుండెను. వ్యసనపరులకుఁ బరాభవములు గోచరింపవు గదా! కోపశోకములతో నాతనిని జురచురఁ జూచినది. గొంతు సవరించుకొని “ఓ దయావిహీనుఁడా! నీవు త్రోసినప్పుడు నీ గోరిచ్చోట, దగిలి యెంత బాధపెట్టెనో చూడుఁడు”మని చూపి వేదన నెపంబిడి కన్నీటి బిందువులు జాల్గాన దీనముగా నేడ్చెను. ఇతరోపాయములు భగ్నమైనప్పుడు స్త్రీల కేడ్పే గదా, ప్రబలమైన కార్యసాధనము.

తా నట్లేడ్చినచోఁ బ్రవరునకుఁ జాలిపుట్టి పశ్చాత్తప్తుఁడై తనపైఁ గరుణ వహించు నని యామె యభిప్రాయము. ప్రవరునకు వరూధిని మాయలమారి యని స్పష్టముగాఁ దెలిసెను. ఆమెతో మాటాడుట యనుచిత మని తలంచి, మాటాడక యూరకుండెను. ఎంతకు నతఁడు దయ చూడకుండుటను గాంచి యామె నయనిష్ఠురము లాడఁ జొచ్చెను. “భూసురవర్య! దయలేని నీ జపతపములవలన ఫల మేమి? పుణ్యము లన్నియుఁ జేసినవాని కెట్టి సద్గతులు కల్గునో దయార్ద్రబుద్ధికా సద్గతు లెల్ల కలుగును. చదివినందులకు ఫల మీ రహస్య మెఱుంగుటయే. నా యెడ దయఁ జూపని నీ చదువు వ్యర్థము సుమా! నీ కంటె చదువుకొన్నవారు సైతము- పరాశరుఁడు, విశ్వామిత్రుఁడు, మాందకర్ణి, ఇంద్రుఁడు మొదలైనవారు పరవనితాసక్తులేగదా! వారికంటె నీ గొప్పతన మేమి? నిజ మారసినచో నినుపకచ్చడా ల్గట్టికొనిన ముని మ్రుచ్చులెల్ల మా యిండ్ల ముందఱ బందగాండ్లే గదా!

7. ఇప్పు డామెతో మాటలాడుటగూడఁ బాపమే యని తలంచి యామె పలుకుచున్నను బ్రవరుఁడు సమాధాన మొసంగలేదు సరి గదా అశుచికారణ మని యామె మేనిజవ్వాదిపస కదంబించు నొడలు

కడిగికొని యాచమన మొనర్చి శుచియై గార్హపత్యవహ్నిని స్తోత్రి మొనర్చెను. వహ్నియుఁ దనవలె నిత్యనిర్మలుఁ డైన ప్రవరుని శీలము నకు ముగ్ధుఁడై యినుండు పశ్చిమాంభోనిధిలోఁ గ్రుంకకయు మున్న మందిరము చేర్చెను.

పరాపేక్ష యున్నంతకాలము ప్రవరునకు మోక్షము లేకుండెను. "ఎవరి మోక్షమునకు వారే కర్తలు" అను జ్ఞాన మాతనికి నుదయిం చెను. పరాపేక్ష యాత్మవిముక్తికిఁ గారణము కాకుండుటయే గాక బంధ హేతు వనికూడఁ దెలిసికొనెను. భక్తిమై నగ్నిహోత్రుని మెప్పించి తత్ప్రసాదమున నిల్లు చేరెను. "ధర్మో రక్షతి రక్షితః" అని గదా పెద్దలు చెప్పినారు.

ప్రవరుఁడు బ్రాహ్మణ శ్రేష్ఠుఁడు. కాని యతని యందొక లోపము కలదు. అతనికి లోకజ్ఞానము లేదు. లోకజ్ఞానము లేనివారికి స్వపర తారతమ్య వివేక ముండదు. అది లేనివారికి నాత్మవిశ్వాసము కలుగదు. ఏకాకియై హిమవత్పర్వతమునఁ జిక్కుపడి తన కర్తవ్యము తాను జూచుకొనుటలో నతనికి లోకములో సంబంధము కల్గెను. తన్ను వంచింపనెంచిన వరూథినితోడి సంభాషణమున స్వపరతారతమ్యవివేక ము కల్గెను. దారి చూపు మని వరూథిని నడిగి లాభము లే దని తన శక్తిపై నాధారపడి యిల్లుచేరుట కాతని కాత్మవిశ్వాసము కలిగెను. ఆత్మ విశ్వాసములేనివారిని మాయావులు వంచింపఁ జూతురు. ప్రవరున కాత్మ విశ్వాసము కుదురుకొనుటచే వరూథినీవాగురలలోఁ జిక్కుకొనక తరింపగల్గెను. ఇట్లు ప్రవరునియందలి లోపము తీఱి యతఁ డాదర్శ బ్రాహ్మణుఁ డయ్యెను. వేదవేదాంగ విజ్ఞానమే గాక లోకజ్ఞానముగూడ బ్రాహ్మణున కవసరమని కవి యిందు నిరూపించెను.

వరూథినీ ప్రవరుల గుణవైపరీత్యమును పెద్దనార్యుఁ డిం దద్భు తముగాఁ బ్రదర్శించెను.

ప్రవరుఁడు.	వరూధిని.
1. ఇతఁడు అంబురుహాగర్భకులాభరణము	1. ఈమె మరున్నారీ శిరోరత్నము
2. ఇతనికి ధర్మపురుషార్థము ప్రధానము	2. కామపురుషార్థము ప్రధానము
3. ధర్మవీరుఁడు	3. శృంగారాధిదేవత
4. ఆత్మవిశ్వాసములేక కార్యసిద్ధికై పరుల నాశ్రయింపఁదలంచుచుండును	4. ఆత్మవిశ్వాస మధికము. తన వైదగ్ధ్యముచే నెట్టివానినైన లోఁగొందు నను ధైర్యము కలదు
5. వరూధిని తన్నులోఁ గొనఁదలంచినకొలఁది గడుసువాఁడై స్వతంత్రుఁడగుచున్నాఁడు.	5. ప్రవరుఁడు నిరాకరించినకొలఁది మోహ మగ్గలమై పరతంత్ర యగుచుండును.
6. గృహ్య, శ్రౌత, ఉపనిషద్ధర్మభంగమును జెప్పి వరూధిని పొందు తప్పించుకొనఁ బ్రయత్నించెను	6. విలాస విభ్రమములు, సూచ్యార్థ సూచనలు, స్పష్టోక్తులు, యుక్తి ప్రతియుక్తులు చూపి ప్రవరుని పొందఁబడయ యత్నించెను.
7. ఆమెతో మాటాడుటగూడ మానహాని యని మౌనము వహించెను.	7. అతని వశ మొనర్చుకొనుటకై తన చూపిన వైదగ్ధ్యము విఫలముకాఁగా నీమెయాత్మవిశ్వాస మంతరించెను. దైన్య మధిక మయ్యెను. అతని బతిమాలెను. నిర్బంధించెను. ఏడ్చి జాలి పుట్టింపఁ జూచెను. నయనిష్ఠురము లాడి తన కనుకూలుని గావింపఁదలంచెను.

8. ఆమె కామించినకొలఁది యతనికి నిగ్రహ మధిక మయ్యెను	8. అతఁడు నిరాకరించినకొలఁది యామెకు మోహ మగ్గల మయ్యెను.
9. తనకు స్వతంత్రుఁడై కష్టవిముక్తుఁ డయ్యెను	9. పరతంత్రయై కష్టముల పా లయ్యెను.
10. 'ధర్మోరక్షతి రక్షితః' అను న్యాయమునకు లక్ష్యభూతుఁ డయ్యెను	10. "వంచకో వంచితః" అను న్యాయమునకు లక్ష్యభూతురా లయ్యెను.

వ్యక్తివివేకము

భాగవతుల కుటుంబరాయశాస్త్రి, ఎం. ఏ.,

అనుమితవాది:—మీ వాదము సుసంగతము కాదు. పైన మేము చెప్పినట్లు వస్త్వన్తరిత మగుచోటఁ జారుత్వ ముండదు. అందుచే నచట ధ్వని యున్న దనుట పొసఁగదు. వాచ్యార్థమునకును, ప్రతీయమానార్థమునకును నెచట వ్యభిచారిభావముగాని, అలంకారముగాని మాత్రమే వ్యవధాయకములుగ నుండునో, యచటనే ధ్వని నంగీకరింపవలయును. వస్తువు వ్యవధాయకముగ నున్నప్పుడు చారుత్వము లేకుండుటచే ధ్వని నంగీకరింపరాదు. "ఇచటఁ జారుత్వ మున్నది. ఇచట లేదు"-అని నిశ్చయించు విషయములోఁ గావ్యతత్త్వవిదులే ప్రమాణము.

వాచ్యప్రతీయమానార్థముల కొక వస్తువు మాత్రమే వ్యవధాయకముగ నున్న పద్యమున కుదాహరణము.

శిఖిపింఛకర్ణపూరా వధూః వ్యాధస్య గర్విణీ భ్రమతి
ముక్తాఫలరచితప్రసాధనానాం, మధ్యే సపత్నీనామ్. ♦

తా॥ ఒక కిరాతున కింతకుఁబూర్వమే కొందఱు భార్య లున్నారు. ఇపుడు మఱియొక కాంతను బెండ్లియాడినాఁడు. పూర్వపు భార్యలందఱును ముత్యములయలంకారములను ధరించినారు. ఈ క్రొత్త భార్య నెమిలికన్నులనుమాత్రమే కంఠాభరణముగా ధరించినది. అయినను, నీమె వారిముందుఁ జాల గర్వముతోనే తిరుగుచున్నది. పూర్వపు భార్యలమీఁద కిరాతున కధిక ప్రేమ లేదు. అందుచే నతఁడు వారితో నంతగాఁ గ్రీడించెడివాఁడు గాఁడు. దూరపు టడవుల కేఁగి, యేనుగులనుఁ గూడఁ జంపి ముత్యములఁ దెచ్చెడివాఁడు. ప్రస్తుత మట్లు గాదు. ఈ నవ

♦ శిఖిపింఛకర్ణపూరా=నెమిలియొక్క పింఛము మాత్రమే కర్ణాభరణముగాఁ గలిగిన, వ్యాధస్య, వధూః=కిరాతునియొక్క భార్య, ముక్తాఫలరచితప్రసాధనానాం=ముత్యముల యాభరణములు గల, సపత్నీనాం మధ్యే=సవతుల మధ్య, గర్విణీ=గర్వముకలదియై, భ్రమతి=తిరుగుచున్నది.

వధువునకు, నెమిలియీకలనుమాత్రమే తెచ్చి యీయఁ గలుగుచున్నాఁడు. అయినను నామె సగర్వముగ సవతులమధ్య తిరుగుచున్నది. దీని భావ మిది. ఈ నవవధువునం దత్యంతము కామాసక్తుఁ డగుటచే వ్యాధుఁడు దుర్బలుఁడై వన్యగజములనుఁ జంపలేక, మయూరములను మాత్రమే చంపఁగలుగుచున్నాఁడు. "ఇట్లితర భార్యలకంటె నితఁడు నాయందే యధికముగ నాసక్తుఁ డగునట్లు, నే నాతని నాకర్షింపఁగలిగితిని. ఇతర భార్యలకు నా కున్న సౌభాగ్యాతిశయము లేదు. నేనే యీ విషయమున వారి నతిశయింతును" అను తలఁపుతో నామెకు గర్వము కలిగినది.

ఇచట, ముందు (తృతీయవిమర్శమునందు) వివరింపఁబోవు రీతిని, వ్యాధుని నూతనవధువునందు సవతులకంటె నధికముగఁ గల సౌభాగ్యాతిశయ మనుమేయము. ప్రధాన మగు నీ యనుమేయమునకును వాచ్యార్థమునకును మధ్య "అవిరతసంభోగసుఖాసంగనిస్సహాత్" (ఎల్లప్పుడును స్త్రీ సుఖములయం దాసక్తిచే దుర్బలుఁ డగుట) యను మఱియొక యనుమేయ మగు నర్థము వ్యవధాయకముగ నున్నది.- ఈ యనుమేయార్థమునకు "మయూరమును మాత్రమే చంపఁ గల్గియుండుట" యనునది సాధనము. వాచ్యప్రతీయమానములకుమధ్య రెండు వస్తువు లుండు పద్యమున కుదాహరణము.

"వాణిజక హస్తిదన్తాః కుతో౽స్మాకం వ్యాఘ్రకృత్తిశ్చ
యావ ల్లులితాలకముఖీ గృహే పరిష్వక్కతే స్నుషా."

[వాణిజక=ఓ వర్తకుఁడా!-యావత్=ఎంతకాలము, లులితాలకముఖీ=చెదరినముంగురు లున్న ముఖముగలదై స్నుషా=కోడలు, గృహే=యింటియందు, పరిష్వక్కతే=తిరుగునో- (తావత్=అంతకాలము) హస్తిదన్తాః=ఏనుగు దన్తములు, వ్యాఘ్రకృత్తిశ్చ=పులిచర్మమును, అస్మాకం=మాకు, కుతః=ఎట్లు లభించును-] దీని భావ మిది-ఏనుఁగు దంతములను బులిచర్మములను గొనుటకు వచ్చిన వర్తకునకు వృద్ధవ్యాధుఁడు తెలుపుచున్నాఁడు.-"నా కోడ లెప్పుడును జెదరిన ముంగురుల

తోనే నా యింటఁ గన్పడుచున్నది. ఆమెతో నిరతము నా కుమారుఁడు సుఖాసక్తుఁ డగుటచేతనే యామె ముంగురు లట్లున్నవి. ఇట్లు నిరత సుఖాసక్తిచే నా పుత్రుఁడు దుర్బలుఁడై నాఁడు. ఈపరిస్థితులలో నాతఁడు సింహములను, పులులను వేటాడి చంపుట యెట్లు కుదురును ? కావున నా కోడలి యాకారముతో నున్నంతవఱకును హస్తిదన్తాదులు లభింప వని తెలిసికొమ్ము."

ఇట్లు చెప్పుటతో వ్యాధుఁడు,"నాత్ర తుషారస్పర్శః ధూమాత్" "ఇచట పొగ యుండుటచేఁ దుషారస్పర్శ లేదు,"అను విధమున వ్యాపక మునకు విరుద్ధ మగు కార్య ముండుటను దెల్పినాఁడు.

యత్ర తుషారస్పర్శః తత్ర, అగ్నే రభావః- ఎచ్చట తుషార స్పర్శ యుండునో యచ్చట నగ్న్యభావ ముండును.- అను వ్యాప్తిలో తుషారస్పర్శ వ్యాప్యము. అగ్నియొక్క యభావము వ్యాపకము. ఈ వ్యాపకమునకు విరుద్ధ మగ్ని. ఈ యగ్నినుండి పుట్టిన దగుటచే నగ్నియొక్క కార్యమే ధూమము - "ఇచట తుషారస్పర్శలేదు" అని తెల్పుటకై, వక్త, పై వ్యాప్తిలోని వ్యాపకమునకు విరుద్ధ మగు నగ్ని యొక్క కార్య మగు ధూమము నున్నట్లు వర్ణించినాఁడు. ఇట్లు వ్యాపక విరుద్ధకార్యోపలబ్ధిని వర్ణించి, తుషార స్పర్శాభావమును సాధించినాఁడు.

ధూమాత్ =పొగయున్నందువలన - "అనుటతోడనే" యత్ర ధూమః తత్రాగ్నిః" అను వ్యాప్తి ననుసరించి, అగ్ని యున్నదని యను మితి మగును. అగ్నియుండుటచేఁ దుషారస్పర్శ యుండదు" అను నను మితి తరువాత నుదయించును.

అటులే సమర్థుఁ డగు సుతుఁడు హస్తివ్యాఘ్రాదివ్యాపాదన పరాయణుఁ డైనపుడే హస్తిదన్తాదులు లభించును. ప్రస్తుతము వ్యాధ సుతుఁడు హస్తివ్యాఘ్రాదివ్యాపాదనపరాయణుఁడు గాఁడు. అందుచే హస్తిదన్తాదులు లేవు. ఇవి యన్వయవ్యతిరేకములు. ఇచట హస్తిదన్తా లుండుట యనునది వ్యాప్యము. సమర్థసుత కర్తృక మగు హస్తివ్యాఘ్రాది వ్యాపాదన పరత్వము వ్యాపకము. ఇంక హస్తిదన్తాద్యభావ

మును దెల్పుటకై, వ్యాపకమునకు విరుద్ధ మగు "స్నుషా సౌభాగ్యాతిశయ పరియుక్తమును, సవిరతసంభోగసుఖాసంగజనితమును నగు వ్యాధసుతునియొక్క నిస్పృహత్వమును వ్యక్తము సేయఁ దలఁచి, దానికిఁ గార్యమగు విలులితాలకముఖత్వమును వాచ్యముగఁ జెప్పినాఁడు. ఈ విధముగ హస్తిదన్తాద్యభావమును సాధించినాఁడు. [ఇచట విలులితాలకముఖత్వము వ్యాపక విరుద్ధకార్యము. దీనినుండి కారణ మగు సుతనిస్పృహత్వము నూహించుచున్నాము-(1) ఈమె విలులితాలకముఖత్వ, మాతని నిరత సంభోగాసక్తిని, త జ్జనిత మగు దౌర్బల్యమును సూచించును. సంభోగమువలననే ముంగురులు చెదరియుండు ననుభావ మిట గ్రాహ్యము. లేదా - (2) వ్యాధసుతుఁ డీమెతో రమించుచుండుచో నీమె ముంగురుల నలంకరించుకొనెడిది. అత్యన్త సుఖాసంగముచేఁగాని, లేక సహజనిస్పృహత్వముచేఁగాని యాతఁ డివు డీమెతో రమించుటలేదు. అందుచే నామె యకృతప్రసాధనయై యున్నది. ఏమైనను, నామె విలులితాలకముఖ యగుట కాతని నిస్పృహత్వమే హేతువు.-]

ఇచటఁ గోడలు "విలులితాలకముఖ'' యను నర్థము వాచ్యము. (ఇదియే వ్యాపకవిరుద్ధకార్యము) దీనినుండి వ్యాధసుతుని దౌర్బల్య మనుమిత మగుచున్నది. (ఇదియే వ్యాపకవిరుద్ధకారణము). దీనినుండి వ్యాధసుతుఁడు హస్త్యాదులను జంపుటలేదను విషయ మనుమిత మగును. అట్లనుటచే హస్తిదన్తాదులు లభించుట లేదను విషయము తుద కనుమేయమై సాధ్యసిద్ధి కలుగుచున్నది. ఇచట వాచ్యానుమేయార్థములకు మధ్య (1) వ్యాధసుతుని దౌర్బల్యము (2) వ్యాధసుతుఁడు హస్త్యాదులను జంపకుండుట'' యను రెండర్థములు వ్యవధాయకములుగ నున్నవి.

వాచ్యానుమేయములకు మధ్య మూఁడు విషయము లున్న పద్యము

"విపరీతసురతసమయే బ్రహ్మాణం దృష్ట్వా నాభికమలే
హరే ర్దక్షిణనయనం చుమ్బతి హ్రియాకులా లక్ష్మీః''

[లక్ష్మ్యాః=లక్ష్మికి, విపరీతసురతసమయే=పురుషాయిత రతియందు, నాభికమలే=విష్ణువుయొక్క నాభికమలమునందు, బ్రహ్మాణం దృష్ట్వా=బ్రహ్మను జూచి, హ్రియా=సిగ్గుతో ఆకులా=కలతఁ జెందినదై, హరేః=విష్ణువుయొక్క, దక్షిణనయనమ్=కుడికన్నును, చుమ్బతి=ముద్దిడుకొనుచున్నది.]

లక్ష్మి పురుషాయిత క్రీడయం దున్నప్పుడు, నాభికమలమున నున్న బ్రహ్మను జూచి సిగ్గిలినది. వెంటనే విష్ణువుయొక్క కుడికన్ను ముద్దిడుకొన్నది. సూర్యుఁడు విష్ణువునకు కుడికన్ను. ఆ కుడికన్నును లక్ష్మి ముద్దిడుకొనుట యనఁ గన్నుమూసికొని పోయినది. అనఁగా సూర్యు డస్తమించు నట్లే. సూర్యాస్తమయ మగుటచే నాభికమలము కూడ ముకుళించుకొనినది. అపు డాకమలములోని బ్రహ్మ కేమియుఁ గన్పడదు. లక్ష్మికి బ్రహ్మయును గన్పడఁడు. అందుచే లక్ష్మికి సిగ్గు తొలఁగినది, అని దీని భావము.

ఇచట లక్ష్మీలజ్జానివృత్తి సాధ్యము. సూర్యరూప మగు విష్ణువు యొక్క దక్షిణనేత్రమును లక్ష్మి ముద్దిడుకొనుట సాధనము. ఈ సాధనమువలన, నేత్రతిరోధానలక్షణ మగు సూర్యాస్తమయ మనుమిత మగుచున్నది. ఈ యనుమేయమునుండి నాభినలినసంకోచ మనుమిత మగుచున్నది. దీనినుండి బ్రహ్మ కన్పడకుండుట లేక బ్రహ్మ తమ సురత క్రీడను జూడకుండుట యను విషయము సిద్ధించుచున్నది.-

ఇట్లు విష్ణు దక్షిణనేత్రమును లక్ష్మి ముద్దిడుకొనుట యను వాచ్యార్థమునకును, లక్ష్మీలజ్జానివృత్తి యను వ్యంగ్యార్థమునకును మధ్య, సూర్యాస్తమయ, కమలసంకోచ, బ్రహ్మాదర్శన వ్యవధానములను

పత్యుశ్శిరశ్చన్ద్రకలా మనేన స్పృశేతి సఖ్యా పరిహాసపూర్వమ్
సా రంజయిత్వా చరణౌ కృతాశీః మాల్యేన తాం నిర్వచనం జఘాన॥

ఈ పద్యమునందు 45-46 పుటలలోఁ జెప్పినరీతిని-తాం నిర్వచనం జఘాన=పలుకకయే, ఆమెను పూలమాలతోఁ గొట్టెను- అను వాచ్యార్థమునకును, గౌరికి, శివునియందుం అభిలాషికశృంగార మున్నదను ననుమేయార్థమునకును మధ్య కౌతుకౌత్సుక్యప్రహర్ష లజ్జాది వ్యభిచారిభావము లనుమేయములై యున్నవి,

మూఁడు విషయము లున్నవి. ఇట్టి యనుమేయార్థ పరంపరగల కావ్యమం దనుమేయార్థజ్ఞాన మిన్ని యుపాయముల నధిరోహింపఁగలిగియుండును. అందుచే రసాస్వాదమును సమీపింపనైన సమీపింపలేదు. ఇట్లగుటచే నిట్టి కావ్యములు ప్రహేళికలతోఁ దుల్యములే కాని ధ్వనికావ్యములు కావు. కావున- "అర్థ"శబ్దము వాచ్యప్రతీయమానోభయార్థ విషయక మని చెప్పినను, ధ్వనిలక్ష్యములు కాని పద్యముల యందుఁగూడ నా లక్షణము సమన్వితమగుచుండుటచే ధ్వనికర్తలు చెప్పిన ధ్వని లక్షణమున కతివ్యాప్తి తప్పదు.-

వ్యభిచారిభావవ్యవహిత మగు పద్యమున కుదాహరణము.

అలంకార వ్యవహితమైన కావ్యమున కుదాహరణము.

లావణ్యకాన్తి పరిపూరిత దిఙ్ముఖేఽస్మిన్
స్మేరేఽధునా తవ ముఖే తరలాయతాక్షి
క్షోభం య దేతి న మనాగపి తేన మన్యే
సువ్యక్త మేవ జడరాశి రయం పయోధిః"

హే తరలాయతాక్షి=చంచలములును విశాలములు నగు నేత్రములు కలదానా? లావణ్యకాన్తి పరిపూరిత దిఙ్ముఖే=లావణ్యముచేతను, కాన్తిచేతను నింపఁబడిన దిశాముఖములు గలిగినట్టియు, అధునా=ఇప్పుడు (కోపమువలనఁ గలిగిన యరుణిమ శాంతించినపిదప) స్మేరే=వికసించి (ప్రసన్నమై) యున్నట్టియు, తవ, ముఖే=నీ ముఖ ముండఁగా, (నీముఖమును జూచియు నని భావము) అయం పయోధిః-ఈ సముద్రము, మనాగపి=కొంచెమైనను, క్షోభం=కలఁతను (మన్మథవికారమును) లేకపొంగుటను, యత్=ఎందువలన, న ఏతి=పొందుటలేదో, తత్-అందువలన, సువ్యక్త మేవ=స్పష్టముగనే, అయం=ఈ సముద్రము, జడరాశిః=జాడ్యసంచయ మని (మూఢుఁడని)_లేక జలరాశియని, మన్యే తలఁచుచున్నాను.

ఇచట ప్రసన్నమైన నాయికముఖమును జూచియు సముద్రము పొంగుట లే దనుటచే ముఖము పూర్ణచంద్రుఁడై యుండవలయు నను

భావ మనుమిత మగుచున్నది. ముఖము పూర్ణచంద్రుఁడే యను భావము కలుగుటకుముందు ముఖచంద్రుల కైక్యారోప మై యుండవలయును. ఉపమానోపమేయముల కైక్యారోపము రూపకాలంకారము. ఈ యలంకార మిచట ననుమితమే గాని వాచ్యము గాదు. కావునఁ జంద్రుఁడను ప్రతీయమానార్థమునకును, సముద్రము పొంగుట లేదే యను వాచ్యార్థమునకును మధ్య రూపకాలంకార మనుమిత మగుచున్నది. ఇచటఁ జంద్రవిషయకజ్ఞానమునే ధ్వనివిషయముగా నంగీకరింప వలయును గాని, మిగిలినవానిని ధ్వనివిషయములుగ నంగీకరింపఁగూడదు.

ఆక్షేపము:—వస్తువు, వ్యభిచారిభావము, అలంకారము వీనిలో నేది యైనను వాచ్య ప్రతీయమానములకు మధ్య, వ్యవధాన మున్నట్లే గదా! వ్యవధాన ముండుట యనువిషయమున విశేషము లేనప్పుడు, వ్యభిచార్యలంకారములు వ్యవధాయకము లైనపుడు చారుత్వ ముండు ననియు వస్తువు వ్యవధాయక మైనపుడు చారుత్వ ముండ దనియుఁ జెప్పుటలో నౌచిత్య మేమి?

సమాధానము:—వస్తువు-అలంకార వ్యభిచారి భావములకంటె భిన్న మగు జాతికి సంబంధించినది. అగ్ని మొదలగువానికంటె ధూమము మొదలగు నవి యెట్లత్యంతభిన్నములో, యట్లే, వస్తువనునది యనుమేయార్థ మగు రసముకంటె నత్యంత విలక్షణస్వభావ మైనది. వ్యభిచారిభావాదు లన్ననో, యనుమేయార్థముయొక్క ఛాయ ననుసరించియుండును. అనుమేయార్థ మగు రసముచే నుపరక్తము లైనవివలెఁ దదాలింగితము లైనవివలె నుద్భవించును. అందుచే ననుమేయార్థముకంటె నత్యంత విలక్షణము లైనవి కావు. అందుచే వ్యభిచారిభావ వ్యవధానము, వస్తువ్యవధానముకంటె భిన్నజాతీయము. అలంకారమునకును నలంకార్య మగు రసమునకును నాశ్రయాశ్రయిభావ ముండుటచే, నలంకార్య మగు రసముకంటె విభిన్నముగ నుండదు. అందుచే నలంకారవ్యవధానముకూడ వస్తువ్యవధానముకంటె భిన్న మైనదియే. ఇప్పటికిఁ దేలిన దేమన సర్థశబ్దమునకు, వాచ్యప్రతీయమానార్థములు రెండును సర్థములే యగుచో

వాచ్యానుమేయార్థములకు మధ్య రెండు లేక మూఁడు వస్తువులు వ్యవధాయకములుగ నున్నచోట ధ్వనిలక్షణమున కతివ్యాప్తి వాటిల్లును. అదిచట నతివ్యాప్తి కాదనియు ధ్వనిలక్షణము పట్టవచ్చు ననియు నందురా! అగుచోఁ బ్రహేళికాదిరూపము లగు పద్యములుకూడధ్వని కావ్యములే, కావలసివచ్చును.

ధ్వని లక్షములో "అర్థ" శబ్దము ప్రయోగించుటవలన సంభవించిన దోషముల నిప్పటికి వ్యక్తివివేకకర్త చూపినాఁడు. ఇంతవఱకుఁ జెప్పిన విమర్శయొక్క సారము నీ సంగ్రహశ్లోకములలో నిరూపించినాఁడు.

"యదర్థ ఇతి వాచ్యోఽర్థోఽభిమతోఽవ్యాప్తిరేవ సా
యే నైవం వాదినీత్యాదా వర్థస్యార్థాన్తరా ద్గతిః
అథోభా, తర్హ్యతివ్యాప్తిః ద్విత్రివస్తువ్యవాయిని
ప్రహేళికాదిరూపేఽపి, కావ్యే ధ్వన్యాత్మతా యతః॥
(సంగ్రహశ్లోకములు.)

కేవల మిచ్చటనే వాచ్యవ్యంగ్యార్థము లుభయములును గావ్యాత్మ యగు ననిచెప్పుట యుక్తియుక్తముగ లేదు. ప్రతీయమానార్థమే కావ్యమునకు జీవితభూతము. ప్రధానముగ నదియే, ధ్వని యగుట యభీష్టవిషయము. అందుచేఁ బ్రతీయమానార్థ మొకటియే యిచట నర్థశబ్దమున కర్థ మనుట యుక్త మగును. ధ్వనికర్తయే "కావ్యస్యాత్మా ధ్వని రితి", "కావ్యస్యాత్మా స ఏవార్థః ఇతి", "ప్రతీయమానా త్వన్యైవ భూషా లజ్జేవ యోషితః"- అను శ్లోకములలో నీ యభిప్రాయమునే తెల్పినాఁడు. కావున, మేము చూపిన దోషములు, ధ్వనిలక్షణములో నుండ కుండుటకై, "అర్థఃసహృదయశ్లాఘ్యః కావ్యాత్మా, యో, వ్యవస్థితః" అను శ్లోకమున, "కావ్యాత్మా యో వ్యవస్థితః" అనుటకు బదులుగ "యః కావ్యస్య వ్యవస్థితః" అని పాఠ ముండుట యుచితము.

భీమేశ్వర పురాణము - కావ్యత్వము

చిలుకూరి పాపయ్యశాస్త్రి.

ఇచట సంస్కృతమూలములో,

"మంత్రైః పంచాననం పంచబ్రహ్మపంచాక్షరాదిభిః
పూజయంతి ప్రతిదినం భక్త్యా బిల్వదళై ర్నవైః
నిష్ఠాపరాః కీర్తయంతి వేదమంత్రై స్సురద్విపః
తథా పురాణమంత్రైశ్చ విశ్వైకస్తుత్య మీశ్వరమ్."

అని పంచప్రణవములతోఁ గూడిన పంచాక్షరీమంత్రములచేఁ బరమేశ్వరునిఁ బూజించి రని యుండఁగా, శ్రీనాథుఁ డా పంచాక్షరీమంత్రమును ప్రాసాదపంచాక్షరినిగా నిరూపించుటచే, శ్రీనాథుఁ డుపాసించిన మంత్రము ప్రాసాదపంచాక్షరి యని స్పష్టముగఁ దెలియవచ్చుచున్నది. ఈతఁడు ఆప్రాసాదపంచాక్షరితో మంచుంగొండయనుంగుఁ బెండ్లికొడుకును బూజించినవాఁడు. గావుననే పరమేశ్వరుని యెడ నింతటిభక్తి భావము.

ఇట్టి భక్తితో దానవులు పరమేశ్వరు నారాధించి వరములు వడసి యుద్రేకించి, దేవతలను హింసింప మొదలుపెట్టఁగా వారు భీమనాథుని రక్షింపు మని వేడుకొనుసమయమున వారిచేఁ జేయించిన స్తుతి వేదాంతసారము. భక్తిరసభరితమును. ఇచట శ్రీనాథునకు వేదాంతశాస్త్రమునందుఁ గల పాండిత్యవిశేషము వ్యక్తమగుచున్నది.

దేవతల మొఱ విని పరమేశ్వరుఁడు దివ్యరూపమున నావిర్భవించిన రీతియు భక్తిభావభరితము; అతి విస్తృతము. కైలాసవాసి సర్వాంగశృంగార మొక్కవిస్తృతమైన వచనమునందుఁ జిత్రితమైనది. అతని పారమేశ్వరరూపమున కొకప్రతికృతి నిర్మితమైనది. ఆతరువాత భీమనాథుఁడు త్రిపురాసురసంహారమున కాయత్తపడినప్పుడు స్మరణమాత్రమున నమకూడిన సన్నాహము నిట్లు వివరించినాఁడు.

సీ. జలరాశిమేఖలావలయంబు రథ మయ్యె
రవియుఁ జందురుఁడుఁ జక్రంబు లైరి
శారదాజీవితేశ్వరుఁడు సారథి యయ్యె
శ్రుతులు నాలుగును వారువము లయ్యెఁ
బ్రణవమంత్రాక్షరము ప్రతోదం బయ్యెఁ
దారకావీథి పతాక యయ్యె
రత్నసాను ధరాధరము ధనుర్లత యయ్యె
నాగప్రధానుండు నారి యయ్యె
గంధవాహంబు లేదును గఱులు గాఁగ
విలయకాలానలజ్వాల ములికిగాఁగ
లచ్చిచనుదోయికుంకుమ బచ్చనయుగఁ
బాలమున్నీటియల్లుండు బాణ మయ్యె. ౭-౧౮౦

త్రిపురసంహారసమయమునందిట్టిసామగ్రి సమకూడుటను మహిమ్నస్తవమునందును పుష్పదంతుఁడు క్రిందిశ్లోకమునఁ దెలిపియే యున్నాఁడు.

శ్లో. రథః క్షోణీ యంతా శతధృతి రగేంద్రో ధను రథో
రథాంగే చంద్రార్కౌ రథచరణపాణిః శర ఇతి,
దిధక్షో స్తే కోఽయం త్రిపురతృణ మాడంబరవిధి
ర్విధేయైః క్రీడన్త్యో నఖలు పరతంత్రాః ప్రభుధియః.

త్రిపురాసురసంహారమున విష్ణువు బాణ మగుట వేదములందును బురాణములందును శివభక్తుల స్తవములందును నన్నిటను నేకరూపమున నుండిన విషయమే. శ్రీనాథుఁడు వర్ణించినపుడు మాత్రము "లక్ష్మీకుచకుంకుమాలిప్తుఁడైన క్షీరసముద్రజామాతయల్లుఁడు బాణ మగుట" విశేషము.

కావుననే శంకరుఁ డట్టహాసంబు నేసి యమ్మహాస్త్రంబు నేయఁగా నారాయణాస్త్రవహ్ని త్రిపురదైతేయుల యంతఃపురకాంతలందు వింతచేష్టలు గావించినది. ఈ చేష్ట లన్నియు శ్రీనాథుఁడు చేయించినవియే. పాలమున్నీటియల్లుఁడు గావుననే వానిచే నిట్టి శృంగారచేష్టలు రాదగ్రసము నడుమఁ జేయించినాఁడు మన వాఁడు.

సీ. కరపల్లవంబులు కబళించుఁ గబళించి
ప్రబలనితంబభారముల వ్రాలుఁ
జెక్కుటద్దములపైఁ జెరలాడుఁ జెరలాడి
శ్రీవణావతంసమంజరులు ముట్టు
వలిచన్నుఁగవలపైఁ బొలపాడుఁ బొలపాడి
నాభిరంధ్రములపై నటన సేయు
వేణీభరములపై విహరించు విహరించి
బింబాధరములపై బిత్తరించు
సభపుకరముక్త నారాయణాస్త్రవహ్ని
కాముకుని కోమలాంతసంగంబు పగిదిఁ
దెగువమీఱంగఁ ద్రిపురదైతేయరాజ
సదనశుద్ధాంతభామినీ జనములందు. ౪-౧౪౦.

భీమనాథుఁడు త్రిపురాసురసంహారము చేయుటకై దివ్యస్యందనం బెక్కి-బయలుదేఱునపుడు యాత్రాసన్నాహము రాజవీథిలో నడిచినది. ముత్తైదువలు సేసలు చల్లుట, వేత్రహస్తులు బరాబరి సేయుట, అంతరిక్షమునుండి దుందుభిధ్వానములతోఁ బుష్పవృష్టి కురియుట, మునిబృందము జయజయధ్వనులు గావించుట మున్నగునవి వీరరససన్నాహమునకు సరిపడినట్లు నడిచినవి. ప్రబంధమునకు యాత్రావర్ణనము సమకూడవలెఁ గదా !

సీ. పరి బ్రాహ్మి మొదలైన సప్తమాతృకలు ద
న్గూడ సేసలు చల్లె గోగులమ్మ
పసిఁడివేత్రము పట్టి పాతాళభైరవుం
డందంద నందడి నపనయించె
దివ్యదుందుభినాద దీర్ఘగర్జితముతోఁ
గురిసె మిన్నున నుండి కుసుమవృష్టి
జయజయధ్వని దేవసంయమీశ్వరకోటి
సంఘటించెఁ గరాంబుజంబు నొసలఁ

దిృపురసంహార మొనరింప దీక్షచేసి
భీమనాథేశ్వ రేశ్వరస్వామి శివుఁడు
దక్షవాటీవిభుఁడు మేరుధనువు వట్టి
యేచి పంటవలంతి తే రెక్కినపుడు.

భూమి రథమై మేరువు ధను వ్వయిన దనిగదా యీ వర్ణనము. పర్వత రూపమైన ధనుస్సును బరమేశ్వరుఁ డెట్లు లెక్కువెట్టెనా? యను సంశ యము మెవ్వనికైనఁ బొడమక మానదు. కాని యట్టి సంశయ తీర్చినాఁడు కవి. అదియు సరిపడియే యున్నది.

క. ముక్కంటి మేరుచాపం
బెక్కిడి సారించెఁ బన్నగేంద్రగుణంబుఁగా
మక్కువ హిమగిరికన్యక
క్రిక్కిఱిసిన కుచము లలము కేలుండమిన్గా. ౪-౧౩౧

పరమేశ్వరుడు గిరిరాజసుతయొక్క క్రిక్కిఱిసిన కుచములను సారించు హస్తపద్మముతో మేరుధనువు నెక్కిడఁ గల్గుట యాశ్చర్య మేమున్నది? పర్వతము లన్నిటికంటె మేటిగదా హిమవంతుఁడు. వాని కూఁతురగు పార్వతియాకృతి యామెకుచములు పర్వతప్రతిమములే యయి యుం డును గదా! అవియును క్రిక్కిఱిసినవి. వానితో నిత్యము విహరించు నలవాటుగల కరముతో బంగారుకొండను వంచుటలో శ్రమ యంతగ నుండ దనుట యెంతయుఁ బొసగియున్నది. ఇట్టి కల్పనలోఁ గావ్యత్వ ముట్టిపడును గదా!

అట్టి ధనుస్సునకు నారియయిన శేషు నెక్కువెట్టుటలోఁ గూడ సున్నితమైన భావసంపద, కల్పనాసమృద్ధి యేర్పడినది.

సీ. కమ్మనూకిన నూత్నకలధౌతమును బోలెఁ
జక్కంగ నిక్కి మైసొక్కి మూనె
నంతరాంతరములం దస్థిబృందంబులు
పెళపెళ మనిమొఱు గిలుకు లెసఁగెఁ

బగిలి బీటలువాఱి తగడెత్తెఁ గుబుసంబు
తోరంపు వెల్లుల్లితునుక లట్లు
మహనీయతరఫణామండలంబులు లేఁత
చిగురుటాకుల ఛాయ జేగురించె
హాటకాద్రి ధనుర్దండ కూటకోటి
వంచి బాహావలేప దుర్వారలీలఁ
గాలకంఠుండు త్రిపురసంక్షయ మొనర్ప
నెక్కు వెట్టిన యపుడు భోగీశ్వరునకు. ర. ౧౩౦.

కాలకంఠుఁడు మేరుధనుర్దండమునకు సరిపడిన పన్నగాధీశుని నారిగాఁ గొని, వింటిబద్దను వంచి యల్లెత్రాటిని ధనుర్దండమునకు ఎక్కువెట్టు నప్పుడు వాసుకిశరీరము కమ్మచ్చులాగిన క్రొత్తబంగారువలె శరీరము నందలి ముకుతలు ఊడినది. నడుమ నడుమ నెముకలు పెళపెళమని విరిగినవి. కుబుసము బీటలువాఱి వెల్లుల్లిరేకలవోని పొరలు రేఁగినది. వెడఁదయైన పడగలు లేఁతచిగుళ్ళవలె నెఱ్ఱవాఱినవి. ఈ వర్ణన మెంతయు సహజముగఁ గొనసాగినది. దృశ్యము సాక్షాత్కరించునట్టిలీరు, దాని తోపాటు కాలకంఠుని బాహావలేపము పాఠకులకుఁ బ్రత్యక్షమైనట్టు లున్నవి.

పరమేశ్వరుఁడు ధనుష్టంకారము చేసినప్పటి యాటోపము వీర రసోత్తేజకమై వెలసినది. రసానుగుణమైన శైలీపాటవముకూడ నీ క్రింది పద్యమునం దెసలారినది. వృత్తముకూడ సరిపడినట్లు నడచినది.

మ. గిరిశస్థూలభుజాఘరీత విభవక్రీడా సమాస్ఫాలిత
స్థిరబాణాసన గూఢపాద్గుణలతా దీర్ఘోగ్రఘోషంబునన్
ధరణీచక్రము దిద్దిరం దిరిగెఁ బాతాళంబు ఘూర్ణిల్లె నం
బరముం దిక్కులు వ్రయ్యలయ్యెఁ బగిలెన్ బ్రహ్మాండభాండంబులున్.

అట్టి యాటోపముతో నారాయణుని బాణముచేసి, పాశుపతాస్త్రంబు సమంత్రకంబుగా నభిమంత్రించి, ఫాలలోచనాగ్నిశిఖలతో జోడించి వేయఁగా నమ్మహాస్త్రపాతమున లోహమయమైన త్రిపురాసురుల

మూఁడునగరములు కరగిపోయి మూఁడుముద్దలుగఁ దయారైనవి. పురములలోని భోగోపకరణము లన్నియు భస్మమైపోయినవి. ప్రాసాదములు కేళీదీర్ఘికలు బాహ్యాభ్యంతరకక్ష్యలు ఉపవనములు నన్నియు దగ్ధములై పోయినవి. కాని యచటి కాలాంతకలింగ మొక్కఁడుమాత్రము చెక్కుచెదరక యుండెను. ఆ త్రిపురాసురుల సర్వస్వము భస్మమై పోయినపుడు వారల కుపాస్యమైన పరమేశ్వరలింగము చెడకుండుట వింతగదా! అది శ్రీనాథుని నోట వింతలలో వింతగా వినవచ్చినది.

మ. అమరాధీశ సమర్పితంబులగు లీలారామకల్పద్రుమ
ప్రసవంబుల్ కనుగందవయ్యె; విలసత్పాటీరగోరోచనా
ఘుసృణాలేపన పంకిలాకలనమై గుంఫించె నారాయణా
స్త్రసముజ్జృంభణ భీమలింగమునకున్ దైత్యేయరాట్స్వామికిన్.

నారాయణాస్త్రసముజ్జృంభణమునఁ త్రిపురాసురుల కుపాస్యమైనభీమలింగమునకు ఇంద్రుఁడర్పించిన కల్పసుమములు కనుగందనేలేదఁట. దైత్యకులాంగనలయెడఁ గాముకునిలీల వర్తించిన యా నారాయణాస్త్రము ఆ లింగమునకు చందనకర్పూర కస్తూరికాదిలేపన పరిపాటిని సమకూర్చి పెట్టినదఁట.

ఇట్టి యద్భుతము లావహిల్లఁగఁ గాలకంఠుఁడు త్రిపురాసుర సంహారము గావించి, జయలక్ష్మిని బరిగ్రహించి, యుద్ధసాధనము లన్నిటిని యథాస్థానములకుఁ బంపివైచెను. గంధర్వాదులు మహాపదానమగు త్రిపురాసురసంహారము గానముచేయుచుండఁగ సంతోషాతిరేకమున—

శా. ఆడెం దాండవ మార్భటీపటహలీలాటోపవిస్ఫూర్జిత
క్రీడాడంబర ముల్లసిల్ల గరళగ్రీవుండు జూటాటవీ
క్రీడాఘాతకశారికోటకరుటీ కోటీలుఠచ్ఛింధువీ
చీడోలాపటలీ పరిస్ఫుటతర స్ఫీతధ్వనిప్రౌఢిమన్. ౪-౧౪౮.

ఈ శివతాండవములో శ్రీనాథుని కావ్యరచనయు మహోద్భటితోఁ దాండవించినది. శైలిలో గంగాతరంగిణీతరంగధ్వనిప్రౌఢిమలు ప్రతిఫలించినవి. శివతాండవ మెదురుగ సాక్షాత్కరించినది. ఇట్లు శంకరాపదానము

లలో వీరరసపరిస్ఫూర్తితో వెలసిన యీ త్రిపురాసుర సంహారము,తదు పాస్యదైవతమైన లింగమే పంచారామములందు పంచలింగములై వెల యుటకు మూలమై, భీమేశ్వరపురాణమునకుఁ గావ్యత్వ మాపాదించు టలో నన్నివిషయములను మూలాధార మని తెలియవచ్చుచున్నది.

సప్తగోదావరావతరణము

పరమేశ్వరుఁడు త్రిపురాసురసంహారానంతరము, వారల కుపా స్యమైన లింగమును పంచఖండములుగా ఖండించి, వానిని పంచారామ ములందు నిలిపి, తనకు మొదటిమామయగు దక్షప్రజాపతియొక్క పట్ట యిన యీరామం బగుటచే దక్షారామంబున శివసన్నిధానంబై దా నుండునట్టులుగఁ బ్రతిష్ఠితుఁ డయ్యెను. పరమేశ్వరుఁడు దక్షారామము నందుఁ బ్రతిష్ఠితుఁడై నప్పుడు భీమనాథునకు అర్ఘ్యపాద్యాచమనీయా ద్యుపహారములు నెఱపుటకు గోదావరినదిని గొనివచ్చుటకై భరద్వా జాదిమహామునులు తలపెట్టిరి. వా రానది నొక శుభముహూర్తమునకుఁ గొనివచ్చి, యీ పవిత్రజలములచే భీమనాథునకుఁ బ్రతిష్ఠ చేయవలయు ననుకొని, దక్షారామమునుండి రాజమహేంద్రపురమునకు శివ్యసమేత ముగ వచ్చిరి.

ఆ సప్తర్షులు గోదావరీనదిని కనులారఁ గాంచునరికి వారికి హృదయములం దెన్నియో పవిత్రభావము లుదయించినవి. "గౌతమీ నదిలోని నీటిని ప్రీతితో త్రాగినమనుజులకు మఱి తల్లి చనుబాలు త్రాగవలసిన యక్కఱ యుండదు. మహర్షులారా! కనుఁగొంటిరా! గౌతమీగంగ తరంగహస్తములతో ఘుమఘుమధ్వాన హుంకారఘో షములతో పాతకసమూహమును జంకించుచున్నది. ఈ గోదావరమ్మ పృథివియెల్లను రక్షించు వేరఁటాలు." ఇట్లు మెచ్చుకొని యీ యమ్మకు భక్తిభావము తులకింప స్తుతినమస్కారములు చేయ మొదలుపెట్టినా రా మహర్షులు. ఈఘట్టమున శ్రీనాథుఁడు భక్తిభావముచేఁ బులకితుఁ డై పాఠకులహృదయము పులకరించునట్టు లీ స్తుతినమస్కారములను నెఱపినాఁడు. గోదావరీనది భక్తిభావాతిరేకమున గోదావరమ్మ, గంగమ్మ యనునట్టిచనవు శ్రీనాథునకే కానవచ్చును.

“తల్లీ ! గోదావరి ! గోదావరి ! గోదావరి ! అని ముమ్మాఱు నీ నామమును స్మరించువారికి నీవు సకలశుభములు సంపాదింతువు గదమ్మా ! నీ యంబువు లసితరుచులు; అమృతోపమరుచులు; అవి మా కభ్యుదయం బిచ్చుఁగావుత.” ఇట్టులు ప్రార్థించి మహర్షులాయమ్మకు నమస్కారములు నెఱపిరి.

శా. ఆ పాతాళగభీరనీరకు సుధాహారామరచ్ఛాయకున్
దీవ్యాలంకృతికిన్ మహేంద్రనగరీనిశ్రేణికాయష్టికిన్
తాపోపాయవిధావిహర్త్రికి మహోదన్వద్దృఢాలింగన
వ్యాపారప్రతిపన్నసౌఖ్యకును సాష్టాంగమ్ము గంగమ్మకున్.

గౌతమీనది కొన్నితావులందు నేటికిని అంతు తెలియని **లోతు** గలిగియే యుండును. కార్తికమాసమునందుఁ గలఁక దేఱిన నీటితో గోదావరి శ్రీనాథుఁడు తెలిపినట్టులు సుధాహారామాలచ్ఛాయమై యుండును. జంబూద్వీపమునకు నడిమిభాగమునంతటను వ్యాపించి హారముపగిది నొప్పారుచుండును. స్వర్గలోకాధిరోహణమునకు నిశ్రేణిక యీపూతనది. నేటికి నీ నదీతీరమునఁ గల యగ్రహారములలో స్వర్గైకసాధనములయిన యజ్ఞయాగాదిక్రియాకలాపములు జరుగుచుండుట యిందులకుఁ దార్కాణము. పవిత్రమైన నదీజలము లెప్పుడును తాపము నపనయించునవియే యగును. ఈ పద్యమున శ్రీనాథుఁడు గంగమ్మకు ఋషులచే నమస్కారము చేయించుచు, నా యమ్మను మహాసౌఖ్యవతినిగాఁ జిత్రించినాఁడు. దానికిఁ గారణ మామె మహోదధియను భర్త నెల్లపుడు గట్టిగాఁ గౌఁగిలించుకొనియుండుట. భర్త నెల్లపుడు నెడఁబాయకుండఁ గౌఁగిలించుకొనియుండు సతి,మహాసౌఖ్యవతి యనుట సహజమే కదా ! అట్టి సుఖమును బడయుగంగమ్మ సడకను మఱియొకవైపునకుఁ ద్రిప్పవలయును. ఈ విషయమును వ్యంగ్యముగ సూచించుటకై శ్రీనాథుఁడు “మహోదన్వద్దృఢాలింగన వ్యాపారప్రతిపన్నసౌఖ్య యగు గంగమ్మకు సాష్టాంగ మ్మునిపించినాఁడు మహర్షులచేత. ఎంత గొప్పవా రయినను స్తుతిపూర్వకముగ నమస్కరించిన ప్రసన్నులగు

దురు కదా! అట్టి ప్రసన్నత గౌతమికిఁ గలుగుటకే యీస్తుతి నమస్కారములు.

శా. రంభోరూకరశాతకుంభ ఘటధారాపూరణప్రక్రియా
గంభీరక్వణసాంద్ర భిన్నకరిరాడ్గండూషనిర్భిన్నకున్
సంభావించి నమస్కరింతుము త్రిసంధ్యంబున్ ముదంబొప్ప నీ
కంభోజాసనకుండికాంబుజవనీహంసాభ గోదావరీ !

దీనికి మూలమునం దీక్రిందిశ్లోకము గానవచ్చుచున్నది.

శ్లో. కాంతాకర స్వర్ణఘటాంబుపూర్తి
ధ్వనీభగండూష విభిన్నరూపే
అంభోజఖేలద్వరరాజహంసే
గంగే నతాస్మో భవతీం త్రిసంధ్యం.

ఈ శ్లోకమునందలి భావమును శ్రీనాథుఁ డొకకొంత పొడిగించి యున్నాఁడు. కాంతలను రంభోరువులనుగాఁ జేసి, వారు బంగారుకలశములలో నీరునించుటచే ధ్వని కొక గాంభీర్యమును జతకూర్చి యున్నాఁడు. దానికి గంధగజముల గండూషములకొదను జోడించి గోదావరి కొక ప్రత్యేకవిశేషము నాపాదించిపెట్టినాఁడు. వనితల కరచాలనములతోఁ గూడిన ఘటపూరణములచేతను గంధగజముల గండూషములచేతను బాయలుపాయలై నొప్పారు గోదావరికి త్రికాలములయందు నమస్కారముల నొనరింతు మని మహర్షులామె నగ్గించినారు. మూలములో గోదావరీనది పద్మముల వనము రాజహంసల విహారముచే దృష్టిప్రియ మైనదిమాత్రమే. దానికొక విశిష్టమైన పవిత్రత నాపాదించుటకై బ్రహ్మదేవుని కమండలువు నందలి పద్మవనమున విహరించు రాజహంసనుగాఁ జేసినాఁడు గోదావరిని. అట్టి గోదావరికి ముదమార నమస్కరించుటలో నొక విశేషము సమకూడునుగదా ?

ఇట్లు నమస్కరించి స్తుతించి, యీవెనుక నా యమ్మను దమవెంట రమ్మని ప్రార్థించియున్నారు. ఈ ప్రార్థన గోదావరీప్రవాహము వలె సరసమధురముగను, భావగంభీరముగను నడచినది. ఈ స్తుతి

హృదయమును ద్రవింపఁజేయు మధురతరఘట్టము. గోదావరీనదీసౌంద ర్యమునంతయు నీ పద్యమునందు కన్నులకుఁ గట్టినట్లు చిత్రించి నాఁడు. భీమేశ్వరపురాణమున కీ సీసము నాయకమణి యనవచ్చును. కనుఁడు:—

సీ. విచ్చేయుమమ్మ శ్రీవృషభవాహన శిర
 స్సామజ మదకటాసారధార !
పయనంబుగావమ్మ భర్గజటాటవీ
 కుటజశాఖాశిఖాకోరకంబ !
రావమ్మ యాదిమబ్రహ్మదోః పల్లవ
 స్థితకమండలు పుణ్యతీర్థజలమ !
లేవమ్మ విశ్వంభరా వధూటీకంఠ
 తారమౌక్తిక హారదామకంబ !
తెరలతో వీచికలతోడఁ దరులతోడ
విమలడిండీరఖండతండములతోడ
మురువు శీవియు నామోదమును జవంబు
వడువు నొప్పంగ గంగమ్మ నడువవమ్మ. భీమ. ౪-౧౭౫.

ఈ యాహ్వానమునందు వినయము తొణికిసలాడుచున్నది. హరశిరస్సం భూతయగు గంగనుగా గోదావరిని భావించి, పరమేశ్వరుని సామవేదో ద్భవమగు మత్తగజముగను, నదీప్రవాహమును తన్మదధారగను నారో పము చేసియున్నాఁడు. అట్టి గంగమ్మను దమవెంట విచ్చేయు మని ప్రార్థించినా రామహర్షులు. పరమేశ్వరజటాజూట మనువనమునఁ బొడ మిన కొండమల్లెమొగ్గయైన యాజనని పయనంబు గమ్మనినారు. ఆదిమ బ్రహ్మ కరపల్లవమునఁ దాల్చిన కమండలువునందలి పుణ్యతీర్థోదక మా ! రమ్మని యాహ్వానించినారు. భూరమణీకంఠ దేశమునకు ముక్తా హారమై వెలయుదానా ? లేవమ్మ యని వేఁగిరించినారు. వచ్చునప్పుడు నీయొయ్యారపువడువు గానవచ్చునట్లులు చిన్నియలలు పెద్ద తెరఁగలు

తెల్లనినురుగుముద్దలు వెంటఁగొనుచు మురువు శీవి ఆమోదము జవము నొప్పఁగ నడుపు మని నివేదించియున్నారు.

ఈ విజయవత్సరమున నొక్కమాఱు గోదావరి యీ పద్యము నందలి యార్భటితో త్ర్యంబకాచలశిఖాగ్రమునుండియు బయలుదేఱి, రాజమహేంద్రివరము వఱకువచ్చి, యచటనుండి సప్తశాఖలు నేకమై తరంగహస్తములతో సముద్రుని గౌఁగిలించినది. ఇట్లాగౌతమిని వినయ ప్రణయములతో వేఁడుకొని మహర్షులు కర్తవ్యము నిట్టులు వెలిఁ బుచ్చినారు.

మ. అదె మాస్వామి సుధారసోద్భవుఁడు దక్షారామభీమేశుఁ డ
భ్యుదయం బంది ప్రతిష్ఠ గైకొనెను సంభోరాశితీరంబునం
బదమా! షట్పదమాలికాపరిలసత్పాథోధునీసంపదా
స్పదనానా సలిలప్రవాహలహరీసంభార గోదావరీ! ౪-౧౭౬

ఈ భీమేశ్వరపురాణమునందే మఱియొకతావున శ్రీనాథుఁడు గోదావరిని వర్ణించుచు గౌతమీగంగ సప్తసముద్రములకు వలపువనిత యైన మంగళోత్సంగ యనినాఁడు.

గీ. నీరుకడఁ గోళ్ళఁగూడి మున్నీటిఁ గవయు
మొగుఁలుబడి వాహినుల కెట్లు మొరయవచ్చు
వార్ధులేడింటికి వలపు వనితయైన
మంగళోత్సంగ గౌతమీగంగ యెదుర.

ఈ ప్రసంగముననే గోదావరి నాసికసమీపమున నున్న త్ర్యంబకాచలమునుండి బయలుదేఱి క్రమముగా నార్యావర్తము మీఁదుగా తూర్పు సముద్రమునకుఁ జేరినతీరు నొక పద్యమున రేఖాచిత్రమును దీసినాఁడు.

సీ. త్ర్యంబకాచలశిఖాగ్రంబునం దుదయించి
పొదలి యార్యావర్తభూమి దఱిసి
మలఁగి దండకవనీమధ్యభాగమున నా
ప్రస్రవణాచలప్రస్థ మొఱసి

పట్టిన శ్రీవీరభద్రేశు సేవించి
తిలసోమనాథుమందిరము డాసి
ఏచి యనంతభోగేశ్వరస్థానంబు
రుదప్రిపాదములపైఁ ద్రోవగాఁగఁ
గోటిపల్లీశుకోమలాంఘ్రులకు మొ్రొక్కి
కుండలాముఖతీర్థంబు గుస్తరించి
భీమమండలి డాపలఁ బెట్టికొనుచు
గౌతమీగంగ లవణాబ్ధిఁ గౌఁగిలించె. 3-౨౧

గౌతమినది త్ర్యంబకాచలశిఖరమునుండి బయలుదేఱి, ఆర్యావర్త భూమిని సమీపించి, దండకారణ్యమధ్యభాగమునుండి వచ్చుచు ప్రస్ర వణాచలము నొరసికొనినది. ప్రస్రవణమనఁగా పాపిడి. ప్రస్రవణాచల మనఁగా పాపిడికొండ. దాని నీనాఁడు పాపికొండ యందురు. గౌతమీ ప్రవాహము దండకారణ్యమధ్యమునందు భద్రాచలము మీఁదుగా వచ్చుచుండ నడుమ నడ్డమువచ్చిన కొండ పాపిడిపెట్టుగాఁ జీలిపోయి నది. దానినే పాపిడికొండ యనెడివారు. ఈనాఁడు 'డి'కి చ్యుతి యేర్పడి పాపికొండగా వ్యవహార మేర్పడినది. దానికి మఱికొంత క్రిందికి వచ్చు నరికి పట్టిస శ్రీవీరభద్రేశుఁడు. పట్టిసమునం దుండెడి వీరభద్రేశ్వరుఁడు. ఇది రాజమహేంద్రవరమున కాఱుక్రోసులదూరమునం దున్నది. అచట నెలకొనిన యీశ్వరుఁడు వీరభద్రేశ్వరుఁడు. ఈ స్వామి యాలయము గౌతమీ ప్రవాహమధ్యమునం దున్నది. ఈ పట్టిస వీరభద్రేశ్వరుఁడు నీ ప్రాంతమందు ప్రసిద్ధమైన పరమేశ్వరమూర్తులలో నొక్కఁడు. నేఁటికి నీ యీశుఁడు శివరాత్రినాఁడు నలుజాములు వేదవచనములు విను చుండును. గోదావరి యీ పరమేశ్వరు నానాఁడు నీనాఁడును సేవించు చునే యుండును.

తిలసోమనాథుఁడు:—ఈ స్వామి పట్టిసమునకుఁ గ్రిందుగ రెండు క్రోసులదూరమునందున్న 'తాళ్ళపూడి' యను గ్రామమున నెలకొని యున్నాఁడు. ఈ పరమేశమందిరము గౌతమీనదీతీరమునందుఁ గలదు.

అనంతభోగేశ్వరము:—అనంతభోగేశ్వరుఁడు నెలకొనిన స్థానము. శ్రీనాథుని కాలమునందు సైత మీ యీశ్వరుఁడు గౌతమీనదీతీరమం దుండియుండును. ఈ నాఁ డనంతభోగేశ్వరుఁడు కుమారదేవమనుగ్రామమునందు స్థిరపడినాఁడు. ఇంతకు ముందు నదీతీరమునం దాలయ ముండినట్టులు నదీపతితములైన శిథిలములు కొన్ని యీనాఁటికిని కానవచ్చును. నేటికిని కల్యాణమండపము నదిలోఁ గానవచ్చును. ఈ యనంత భోగేశ్వరస్థానము తిలసోమనాథుని మందిరమునకుఁ గ్రింద రెండు క్రోసులదూరమునఁ గలదు.

రుద్రపాదములు:—రాజమహేంద్రవరమున నెలకొనిన మార్కండేయస్వామి చరణములు. గోదావరి యేపాటి పొంగినను నాటికి నేటికి నీ మార్కండేయస్వామి చరణములు సేవించుచునే యుండును. ఈపరమేశ్వరుఁడు భీమనాథున కిరుగుపొరుగులవారిలో నొకఁడై పశ్చిమసీమయందు నెలకొనియున్నాఁడు. ఈ రుద్రపాదములను కృత్యాదిలో శ్రీనాథు డీతీరున వివరించియున్నాఁడు.

సీ. కమలాచలాగ్ర మార్కండేయ శివశిర
శ్శశిచంద్రికాధౌత సౌధవీథి
గోదావరీపుణ్య కూలంకషాజల
స్ఫాతిత శ్రీరుద్రపాదయుగళి
గీ...సాంద్రవిభవంబు రాజమహేంద్రవరము. ౧-౪౨

ఈ రాజమహేంద్రవరమున కెదురుగ నుండిన కొవ్వూరును గోపాదక్షేత్ర మని యందురు. గౌతమమహర్షి గోవును జంపిన పాపము నివర్తించుటకై యీశ్వరునిగూర్చి తప మాచరించి, త్ర్యంబకాచలమునుండి గోదావరీనది నీ తావునకుఁ దెచ్చి గోవు నుత్తమలోకములకుఁ బంపుటచే నీ క్షేత్రమునకు 'గోపాదక్షేత్ర'మనుపేరు వచ్చె నని గౌతమీ మాహాత్మ్యమునందలి యైతిహ్యము. రాజమహేంద్రవరమునకు దక్షిణముగ రెండు క్రోసులదూరమున ధవళగిరి (ధవళేశ్వరము) గలదు. దానిని 'రామపాదక్షేత్ర' మని యందురు. పలివెల కొప్పులింగేశ్వర

స్వామి యాలయమున నెలకొనియున్న అనితల్లి శాసనములో "గౌతమీ మహానదీతీరమందును మార్కండేశ్వర మృకండేశ్వరు రుద్రపాదాల సన్నిధిని" అని యున్నది. దీనినిబట్టి మార్కండేయస్వామి చరణములే రుద్రపాదములని తెలియవచ్చుచున్నది. ఈ స్థానమునుండియే గోదావరి సప్తశాఖలుగఁ జీలి సముద్రమునఁ గలిసినది. రాజమహేంద్రివరము వఱకు గోదావరిని అఖండగౌతమి యని యందురు.

శ్లో. తుల్యాత్రేయీ భరద్వాజీ గౌతమీ వృద్ధగౌతమీ
కౌశికీచ వసిష్ఠాచ సప్తశాఖాః ప్రకీర్తితాః.

తుల్యానది:—గౌతమీనది రాజమహేంద్రవరమునుండి దక్షిణముగాఁ బ్రవహించుచు ధవళేశ్వరమునుండి నొకశాఖ గౌతమి యనుపేరను, విజ్జేశ్వరమునుండి మఱియొకశాఖ వసిష్ఠానదిగను వేఱయినది. ఈగౌతమీ శాఖనుండియే విడువడి—తుల్య,ఆత్రేయి, భారద్వాజి, గౌతమి, వృద్ధగౌతమి,కౌశికి—యను నాలుశాఖ లేర్పడినవి. వీనిలో తుల్యానదీ శాఖ ధవళగిరికి ముందునుండి వెలువడినది. ఈ నాఁడా శాఖాముఖ మొక పాడుపడిన కాలువగా, రాజమండ్రీనుండి ధవళేశ్వరము పోవునపుడు గ్రామారంభమునఁ గానవచ్చును. ఈశాఖ ధవళేశ్వరమునుండి బయలుదేఱి కడియము అనపర్తి తాపేశ్వరము మూవిడాడ వేళంగి మున్నగు గ్రామముల మీఁదుగఁ బ్రవహించి కాకినాడ సమీపమున చొల్లంగి యనుచోట సముద్రగామి యగుచున్నది. ఈ నదీసాగరసంగమ స్థానమున సోమేశ్వరుఁడు ప్రధానుఁడై నెలకొనియున్నాఁడు. ఇచటనే ఆంజనేయస్వామియుఁ గలఁడు. పుష్యబహుళ అమావాస్యనాఁడు అర్ధోదయ మహోదయ యాదిపర్వములందీ నదీసాగరసంగమమున స్నానదానాదులు మహాపుణ్యాదము లని పెద్దలు వాక్రొందురు.

ఆత్రేయీనది:—గౌతమీశాఖనుండియే తుల్యానది విడువడిన ధవళేశ్వరమునకుఁ దరువాత కోటిఫలికి రెండుక్రోసులు క్రింద నొకశాఖ విడువడినది. దానిని ఆత్రేయి యందురు. ఇది యీ నదీతీరమున రామ

చూ. దక్షిణహిందుస్థాన శాసనసంపుటము Vol V No 114.

ఘట్టమున నావిర్భావము నంది, కోరంగి యొద్ద సాగరసంగత మైనది. ఈ సాగరసంగమస్థలమున కురంగేశ్వరుఁడు గలఁడు. శ్రీ రాముఁడు కురంగము నీచోటఁ జంపుటచే నిచట ప్రతిష్ఠితుఁడైన యీశ్వరునకుఁ గురంగేశ్వరుఁ డను పేరు వచ్చినదని యైతిహ్యము.

భరద్వాజీ- గౌతమి:— ఈ భారద్వాజియను శాఖ ఇప్పుడు "అక్విడెక్టు" కట్టిన 'అన్నంపల్లి' యను చోటునుండి విడువడి ఇంజరము వఱకుఁ గానవచ్చుచు గౌతమీశాఖలోఁ గలసి యానాము (ఫ్రెంచి నగరము) మీఁదుగా సముద్రమునఁ గలియుచున్నది. ఈ మధ్యభాగమున నీనదిని భారద్వాజ్యంతర్భూతగౌతమి యని వాకొందురు. ఈసాగరసంగమక్షేత్రమును 'తీర్థాలమొండి' యని యందురు. ఇచట గౌతమి భారద్వాజి రేవ అహల్య యను పంచతీర్థములు గూడిన వనియు కావున దీనికి తీర్థాలమొండి (మొగ) యను పేరు వచ్చినదని తెలుపుదురు. ఇచట నీశ్వరుఁడు భైరవేశ్వరుఁడు. ఇచట భైరవపాళెము అను బెస్తపల్లె యొకటి గలదు.

వృద్ధగౌతమి:— ఈ శాఖ గౌతమీనదికి పశ్చిమతీరమునుండి వెలువడినది. దీని యుత్పత్తి యెచ్చటనో స్పష్టముగఁ దెలియదు. కౌశికినది పుట్టినచోటనే పుట్టినదేమో! ముక్తేశ్వరము మొదలు శానపల్లంక శానేలంక గేదెల్లంక కుండలేశ్వరము అను గ్రామముల సమీపమునందున్న మురికికాలువను వృద్ధగౌతమి యందురు. ప్రభుత్వము నదీముఖములను గప్పివేసినను దీనివి "వృద్ధగౌతమీడ్రైను"అను పేరితోడనే నేఁడును వ్యవహరింతురు. ఇది సాగరమునఁ గలిసినచోట వృద్ధేశ్వరుఁ డుండెడివాఁ డని వినికి. ఈనాఁ డాలయమును లింగమును సముద్రపతితములు. అచట బ్రహ్మేశ్వరుని లింగము గలదు. సంతానగోపాలేశ్వరస్వామి అరిష్టమ్మ యను నమ్మవారును గూడఁ గలరు. దీనికి బ్రహ్మసంవేద్యము అని పేరు. సంతానప్రాప్తికై సప్తసాగరయాత్ర చేయువారు ఈ స్వామియెదుట నిద్రింతురు. వారికి స్వప్నములు వచ్చుటయు, స్వప్నానుసారముగ సంతానఫలమును బడయుటను గలుగునని

చెప్పుకొందురు. ఈ క్షేత్రము నీనాఁడు 'బ్రహ్మసమేధ్యము' అని యందురు.

కౌశికినది:—గౌతమీనది పశ్చిమశాఖనుండి యీనది 'మంద పల్లి' (అగస్త్యప్రతిష్ఠితుఁడగు మందేశ్వరుఁడు నెలకొనినచోటు) సమీపమునఁ గల 'సూర్యకుండము' అను చోటునుండి విడువడి అమలాపురము తాలూకాలోని గ్రామము లన్నియుఁ జుట్టుచు 'బెండమూర్లంక' యనుచోట సాగరమునఁ గలియుచున్నది. ఈ ప్రదేశమును విష్ణుసంవేద్యము' అని యందురు. ఇది బ్రహ్మసంవేద్యమునకు నాలుగుక్రోసుల దూరములో నున్నది. ఇచట రామలింగేశ్వరస్వామియును లక్ష్మణస్వామియును గలరు. ఈ కౌశికీనదికి కౌంతేయి యనుపేరును గలదు. 'పలివెల' కొప్పులింగేశ్వరుఁ డీనదీతరమునఁ గలఁడు. ఈ నది ప్రవహించిన చోటునంతను 'కోనసీమ' యని యందురు.

ఈ కౌశికినది పుట్టినచోటునకుఁ బశ్చిమముగ గౌతమీనదిలో నుండి యొకశాఖ విడువడి, యది యాత్రేయినది పుట్టినచోట మరల గౌతమిలోఁ గలిసినది. దీనిని కణ్వానది యందురు. ఈ నాఁ డిది ప్రభుత్వము వారి లెక్కలలో 'ఓకిడ్రైను' అని వ్యవహరింపఁబడుచున్నది. ఈ విజయసంవత్సరమున గోదావరి యుప్పొంగి వఱదలై ప్రవహించినపుడు ఈ నదీముఖములయొద్దనే గళ్లు పడినవి. తుల్యానదీముఖమున ధవళేశ్వరము దగ్గఱను, కౌశికీనదీముఖమున మందపల్లియొద్దను, కణ్వానదీముఖమున కపిళేశ్వరపురమునొద్దను, ఆత్రేయీనదీముఖమున పిల్లంకయొద్దను, భారద్వాజీనదీముఖమున పశువుల్లంకయొద్దను నదీశాఖాముఖములు తెఱచికొని సప్తశాఖలు నేకమై తరంగహస్తములతో సముద్రుని గాఁగిలించినది. గోదావరికి బడిన, గిళ్ళన్నియు సరిగా నదీముఖములందే పడుట యొక యద్భుతవిషయము.

వసిష్ఠ:—ఇది కొవ్వూరునకు క్రోసుదూరముక్రింద విఘ్నేశ్వరము నొద్ద గౌతమినుండి విడువడి సరాసరిగాఁ బోయి అంతర్వేదియొద్ద సము

ద్రగామి యైనది. అచట నీలకంఠేశ్వరుఁడు నృసింహస్వామియుఁ గలరు. ఇది యొక గొప్ప పుణ్యక్షేత్రము. మాఘశుద్ధపాడ్యమినాఁడు చొల్లంగి నుండి బయలుదేఱి, సప్తగోదావరీశాఖాసంగములలో స్నానముచేయుచు మాఘశుద్ధ ఏకాదశివఱకు సప్తసాగరయాత్ర చేయువారీ అంతర్వేదికిఁ జేరుదురు. అచట నా యేకాదశికి గొప్ప తీర్థము (తిరునాళ్లు) నేటికిని జరుగుచుండును.

ఈ విధముగ గోదావరి యేడుశాఖలై ప్రవహించి సముద్రగామి యైనను, భీమమండలి యీ సప్తశాఖలనడుమనే యున్నది. ఈ భీమమండలి నడుమనే భీమేశ్వరుఁడు పుండరీకమధ్యమున రాజహంసమువలె ప్రతిష్ఠ నందినాడు. ఆ దృశ్యమును శ్రీనాథుఁ డెంతయు మధురముగఁ జిత్రించియున్నాఁడు.

సీ. ఆంధ్రభూభువనమధ్యము పుండరీకంబు
సప్తగోదావరజలము తేనె
బ్రహ్మసంవేద్యాది బహుతీర్థములు కేస
రకరులు చారుదివ్యస్థలములు
నాళంబు లవణాబ్ధివేలావిభాగంబు
కల్యాణభోగమోక్షములు తావి
దక్షవాటీమహాస్థానంబు కర్ణిక
హంసంబు భీమనాయకుఁడు శివుఁడు
గౌతమీసింధు కాంతేయకణ్వనదులు
తుల్యభాగయు నేలేరు దుమ్మికోనలు
భువనసంభావ్యమైన యీ పుణ్యభూమి
యనఘ సంసారతాపశాంత్యౌషధంబు, భీమ. 3-౫౦

ఇట్టి పుణ్యనదీశాఖలు, దత్తీరముల దివ్యమూర్తులయిన యీశ్వరలింగములు నెలకొనియుండిన కారణముననే భారతదేశమంతటిలోను గోదా

వరీనదీతీరము పరమపావనమని యితర దేశస్థుల నమ్మకము. ఇతరనదుల కంటె నీ గోదావరి విలక్షణముగ సప్తశాఖలతో సముద్రుని కౌఁగిలించినది గావున నీ నదీమహాత్మ్య మితరనదులకంటె ప్రశస్తతరమని శ్రీనాథుఁడే వివరించినాఁడు.

నీరుకడఁ గోళ్ళఁగూడి మున్నీటిఁ గవయు
మొగులుబడి వాహినులకెల్ల మొరయవచ్చు
వార్ధులేడింటికి వలపు వనితయైన
మంగళోత్సంగ గౌతమీగంగ యెదుర. భీమ. 3-౨౨

ఈ తీరుగ శ్రీనాథుఁడు గౌతమీగంగను వార్ధులేడింటికిని వలపువనితనుగాఁ జేసి మంగళోత్సంగను జేయుటయం దాతని కవితాశిల్పము ప్రతిఫలించి పురాణమును రసబంధురకావ్యబంధముగా వెలయించినది.

ఓం శమ్

కళాసమీక్ష

చిలుకూరి వీరభద్రశాస్త్రి

శేదా; ప్రవరుఁ డేమియు నెఱుఁగని విప్రుఁడు, శ్రోత్రియుఁడు, గృహా మునందే యుండి, లోక మెఱుంగక, ఏకపత్నీవ్రతస్థుఁడై, నియమనిష్ఠా గరిష్ఠుఁడై లోకవ్యవహార మెటు లుండునో, స్త్రీ లెట్లుందురో, విశేషితః అందకత్తె లెటు లుందురో, ఎంతెంత వార లుందురో, విలాసవతు లెట్లుం దురో, రాగిణు లెట్లుందురో, గంధర్వాంగ లనిన నెట్లుందురో? కూడఁ దెలియనంతటివాఁడు. అతనికిఁ బూర్వకార్యము లనినను, అతిథిసంతర్ప ణము లనినను, తీర్థసేవ లనినను మిక్కుటమగు వాంఛ. కావుననే యోగి తిఱిగిన దేశము లన్నియు వినినాఁడు. వింతలు విశేషములు కనుఁగొని నాఁడు. అతనిని బ్రతిమాలెను. పాదరసలేపనముతో రావచ్చుటలోను హిమవత్పర్వతము మెట్టినాఁడు. మధ్యాహ్న మయినది. మాధ్యాహ్నిక కృత్యము లొనర్చుకొనుటకు నిలు సేర సంకల్పించెను. పాదలేపము కరఁగిపోయినది. అఱిగిన దా పరిభావము. కంగారు హెచ్చినది. ఇలు సేరు నుపాయ మేమి యని యూందోళన బయలుదేరినది. అన్నియు నా డిగులులో జ్ఞాపకము వచ్చినవి. అగ్నులు నీఱు కప్పిపోయి యుండునని బాపుగు మనినాఁడు. ఇటునటుఁ దిరిగినాఁడు ఏమియుఁ దెలియవు. తన యూరిదారి యేదియో యూహించుద మన్నను "ఎక్కడి యరుణా స్పదపుర మెక్కడి తుహినాద్రి!" అసాధ్య మయిన విషయము. సంక ల్పోత్తరముననే చేరిపోయెనేమో యేదిక్కునకు వచ్చినాఁడో తెలియదు. ప్రాక్పశ్చిమములు తెలిసినను, దక్షిణోత్తరములు దెలియవు. ఇంతకు దెక్కులు తెలియనినాఁడు, దిక్కులు తెలియలేదు. తిరిగినాఁడు. ఒక పాట వినినాఁడు. మొదటవచ్చిన దపశకునము. అందు వాసన తగలినది. పోనీ మసిపీకదా! దా రడిగిపోవుద మని యింకను కొంచెము ముందు నకు వచ్చినాఁడు.

ఒక మెఱుపువలె మెఱసినది దేహము. "ఇదియేమి" యని కంగారుపడినాఁడు. "ఎవరూ!" అని. కనులు కనిపించినవి ఆవిడవి. అవి ఆశ్చర్యజనములుగా నున్నవియఁట. శతపత్రమంతటి విశాలములుగా నున్నవి.

ఒక్కసారి చలించిన పద్మము వాయువునకుఁ జలించినట్లున్నది. కన్నులు వాసనచుట్టుచున్నవి దూరానికి. అంత శ్యామలత కురులకు నెచ్చటను జూడలేదు ఆ బ్రాహ్మణుఁడు. ముఖమో చంద్రుఁడో తెలియక భూమ్యాకాశములు తలక్రిందు లయినట్లు కంగారుపడినాఁడు. తుదికి మిగిలిన అవయవ సంఘటనముబట్టి ముఖము అనుకొనినాఁడు. నాభి గాంభీర్యము చూచి భయ మెత్తినది. అట్టి స్తనములు చూడలేదు. ఉల్లి పొరజట్టలోనుండి తొంగిచూచుచున్నవి కాంబోలు. మొత్తముమీఁదఁ దా నెక్కడను, ఇట్టి స్త్రీని జూచియుండలేదు. దేవతా స్త్రీ యనికొని నాఁడు.

వరూధిని గంధర్వాంగన. భోగిని. విలాసిని. ప్రవరులు ఆమెకు వలసినవారు. ఇతఁడు ఏకాంతములో నుండఁగాఁ దనయొద్దకు వచ్చి నారు. ఏకాంతవాసములో నొక యందగాఁడు దొరకిన అట్టి స్త్రీ మన్మథ పరవశురా లగుట కబ్బురమా? అందులో నలకూబర సన్నిభుఁ డద్దరా మరుఁడు. మొదట స్త్రీజాతి కనుక కంగారుపడిలేచినది ఒడలు సవరించు కొనినది. తరువాతఁ జూచినది. నచ్చెను. అతనిపైఁ బ్రేమ యంకురించి నది, పల్లవించినది, పుష్పించినది. లేచి యడ్డముగాఁ దొందరతో వచ్చి నిలచినది. ఇం కొకలిప్తలో, ఒకపదమాత్ర పదవ్యంతరములో నున్న దామె. "ఇంక నీ పయిం జిక్కె మనంబు" అని మీఁదఁబడుటకు. అఁడు దానిని అందమయినదానినిఁ జూడకపోవుట ఒకటి మీఁదికి వచ్చుట ఇదిచూచి దిగ్భ్రాంతియో? విభ్రాంతియో? మిథ్యామతియో? ఏదియో అయిపోయినాఁడు. అంటాఁడు.

ఏమీ యిది? ఎవతెవు నీవు? ఆ గ్రుడ్లు త్రిప్పుట యేమిటి. లేడిఁ (పసువు) గ్రుడ్లు త్రిప్పినట్లు త్రిప్పుచుంటివి? ఎక్కడనో యడవిజంతువు వలె నుంటివి? ఎందులఁ కా కంగారు. మీఁదికి వచ్చుచుంటివిలే! పేట్రేగి పోయి భయ మేమియు లేక యెవరి సహాయములేకుండఁగ, ఎవరి అపే క్షయు లేకుండఁ దిరుగుచుంటివి? ఎవతెవు నీవు? ఈ ఘోరారణ్య మేమి? ఒక్కర్తెవు నుండుట యేమి? దేవతవా, దెయ్యానివా? ఎదుటివాఁ డెవఁడో తెలియక మీఁదఁబడున ట్లుంటివి? అఁగుమటీ నే నెవరనో?

కొంచెము తెలిసికొనుము. నేను భూసురుఁడను,ఎవరు కనిపించిన వారిని జెట్టపట్టుకులములోఁ బుట్టితి ననుకొంటివా ? నే బ్రాహ్మణుఁడను. "నా కరణుల్ దర్భలు నగ్నులుల్ ప్రియములై నట్లన్యముల్ కావు" "చెప్పకు మిట్టి తుచ్ఛ సుఖముల్ మీసాలపైఁ దేనియల్, "వ్రతులై దినములు గడపెదు విపులఁగామింప మది విచారము వలదే" బ్రాహ్మణులలోఁ గూడఁ బ్రవరుఁడను. శ్రేష్ఠుఁడను. అందుకే నా పేరు ప్రవరుఁ డందురు. దానజపాగ్నిహోత్రపరతంత్రుఁడను. తత్పదాంబుజధ్యానరతుండను పర దారధనాదుల కోరనివాఁడను. అందుకే భూదేవతను. ప్రవరుఁడను గూడ. స్త్రీ లనిన నంత విరాగి వెందులకు వచ్చితి వని యడుగవచ్చు, స్త్రీ లుందు రని యనికొని రాలేదు. నీ వంటివా రున్న మొదటే రాక పోయెడువాఁడనే. ఇక్కడఁ గాపుర ముండుటకును రాలేదు. వచ్చుటయే మానివేయకూడదా ? యనిన నిట్టి పనులను జేసినవారినే క్రొవ్వెక్కిన వా రని యందురు. క్రొవ్వెక్కినది కనుక నే నీ హిమాలయమునకు, ఈ శిఖరమునకు వచ్చితిని. తగినశాస్తి అయినది. క్రొవ్వెక్క ఏ పని చేసినను తగినశాస్తి అయితీరును. ఎవరిదైనను నడఁతే మంచిదైనపుడే మంచి. లేకపోయిన నాకయినట్లయి తీరును. చూడు. ఎక్కడినుండియో యిక్కడకు వచ్చితిని. మా పురమార్గము మఱచిపోయితిని. తెలిసినదిగా దారి తప్పివచ్చితిని కాని నీవు మీఁదఁబడుదవని రాలేదు. కనుక మా యూరుదారి తెలిసినఁ జెప్పుము. నా కేమియు నుపాయము తోఁచుటలేదు. ఇంత ఏకాంతములోనున్న దాని కన్ని దారులు తెలిసియే యుండును. నాకు దారి తెలిసిన నీకు మేలగును. నీ కోర్కెలు సిద్ధించును. నేను బ్రాహ్మణుఁడనుగా ! బ్రాహ్మణాశీర్వాదము అమోఘము. అంతియే కాని మీఁదకుమాత్రము రాకుము. ఆఁగు మటే. నీ వెవతెవు ?

కుముదాన్యేవ శశాంకః సవితా బోధయతి పంకజాన్యేవ
వశినాం హి పరపరిగ్రహసంశ్లేషపరాఙ్ముఖీవృత్తిః

అని శుద్ధఛాందసముఁగా స్పష్టపఱచి అడిగినాఁడు అనవచ్చు.

లేదా: వరూథిని ప్రవరుని పద్యమున కేమి యర్థమును దీసికొని యుండునని యాలోచించిన "కామీ స్వతాం పశ్యతి" అని కాళి

దాసు అన్నట్లు వరూథిని ప్రవరుని చూచుటతోడనే ప్రేమించినది. మోహవిభ్రాంతిలో మునింగిపోయినది. అతఁడు దారి అడుగుటకు వచ్చినను, దారి యడిగినను, తన ప్రేమకు పరిపడున ట్లర్థముఁ దీసికొని యుండును. అటుల ననుకొన్నటుల నీక్రింది రెండు పద్యములు కొంతఁ దోడ్పడఁగలవు.

క. అని తనకథ నెఱిఁగించిన
   దనకనుఁగవమెఱుఁగు లుబ్బ దాటంకములన్
   జనుఁగవయు నడుము వడఁకఁగ
   వనిత సెలవివాఱ నవ్వ వానికి ననియెన్.

ఇంతలు కన్నులుండఁ దెరువెవ్వరి వేడెదు భూసురేంద్ర! యే
కాంతమునందు నున్న జవరాండ్ర నెపంబిడి పల్కరించు లా
గింతియకాక నీవెఱుఁగవే! మునువచ్చిన త్రోవచొప్పు నీ
కింతభయంబులేకడుగ నెల్లిదమైతిమె! మాటలేటికిన్.

అని నర్మగర్భంబుగాఁ బలికి......అని యున్నది.

ఓ భూదేవేంద్ర! దారి తెలియకపోవుటకుఁ గన్నులు లేవా? నిద్దురపోవుచుంటివా? ఇంతింత కన్నులున్నవి. రూపమేవాస్యైతన్మ హిమానం వ్యాచష్టే అని కన్నులే తెలుపుచున్నవి నీవు తెలివిగలవాఁడవో? కాదో? కన్నులతో మాటాడువాఁ రున్నారు లోకములో. నీ వందులో భూసురుఁడవు. ప్రవరుఁడవు కూడ నంటివి. భూసురప్రవరుఁడవు మార్గదర్శకుఁడ వగుదువు. నీకుఁ దెలియని మార్గములు లేవు. ఈ మార్గము, ఈ ఏకాంతప్రదేశము, ఈ నాయునికి నీ కెటులఁ దెలిసినదో యటులనే అన్నియుఁ దెలిసియే యుండును. దారి తెలియక నీవు వచ్చి యుండలేదు. యువతుల పొత్తుగోరి వారిని బల్కరించి వారి మాటలో మాట కలిపి మంచిమాట చేసికొనఁగోరువారి మాట లిటులనే యుండును. సరే! దానికేమి. నన్ను దారి యడుగుట దేనిటికి? ఇదివఱలో నిటుల తప్పుదార్లు పట్టియుంటివు దార్లు అన్నియు నెఱిఁగియు నుంటివు? ఇది వఱలో నీ దారిని నెడలుచుంటివో అదియే యిప్పుడును.ఏదారియు నీవె

ఱుఁగనిచో మే మంతకంటె నెఱుఁగ మే దారియు. మే మాడువారము. మేమసలు మఱచిపోవుదుము వచ్చినదారి. ఆఁడువా రనిన నింతభయము లేకపోయినది మగవారికి. సరే ఆడువాళ్ళంటేయంత చులకనై పోయినది. ఏలాగుననైన ఏకాంతప్రదేశముదాఁక వచ్చితివి కాన మాటలెందులకు. ఆఁడువారి కంతభయము లేదనుకున్నావా? నోటితో నడుగుటకు. ఇప్పటికి నప్పటికి నెంత మగవారు చుల్కనగాఁ జూచిన చేష్టలే చూపుదురుగాని అంత సిగ్గులేనివారు కారు. “స్త్రీణా మాద్యం ప్రణయవచనం విభ్రమో హి ప్రియేషు” కాదా? క్రియాప్రధానముగాని మాటలెందుకయ్యా? బ్రాహ్మణోత్తమా? నీవు తెలియని శుంఠవుగావు కన్నులను వర్ణించిన నీవు. నీ కన్నులున్నట్లే నా కన్నులు నున్నయవి.

ఈ నర్మమునకు మర్మము “ఎవ్వతెవీవు”, పద్యము కనుక ఆమె ప్రవరుని అమాయకునిగా నర్థముచేసికొనను లేదు. అతఁ డుగ్గడించిన పద్యమునకు వేఱుగా నర్థముచేసికొని యుండియుండును. కనుక మఱి యొకరీతిగ దీని యర్థమును ఊహింపవచ్చును.

మే మప్పుడప్పుడు వినియున్నట్లు కలదు. అందమయినవార లప్సరసలు. వారి నేత్రములే చాల నందముగఁ జంచలములుగ నుండును. అవిదితేలు. వా రెక్కడనో హిమాలయాదిపర్వతములఁ జరింతురు. అది నిజమయిన నీ వప్సరః స్త్రీవై యుండవలయును. ఎవ్వతెవీవు? భయముగొలకు లేకుండఁగఁ దిరుగుచుంటివి? ఇంత నిర్జనారణ్యములోఁ దిరుగుటకు దిట్టతనమొక్క సురాంగనలకే యుండునుగాని మఱియెవ్వరికి నుండనేరదు. అందులో నేకాంతవాసిత కామినులగు గంధర్వస్త్రీలకే యుండును. ఈపర్వతశిఖరములో నింతయేకాంతవాసినివి నీవు అప్సరసవే. నీ వెవ్వతెవు? నీవు సురజాతి కెటులఁజెందితివో నేను నట్లే సురజాతికిఁ జెందినవాఁడనే. ఇంకొక వైశిష్ట్యముకూడ నున్నది. భూసురత్వముగాని అందునను బ్రవరుఁడను. వరుం డన్న నే “ప్రియతే ప్రియత్వేన స్వయం అంగీక్రియతే- కావ్యప్రకాశిక. యఃకౌమారహరః సఏవహి వరః. శ్లోక వ్యాఖ్య - ఉద్యోతము. ఆఁడుదానిచేఁ జూడఁబడినవెంటనే వరింపఁబడు వ్యక్తిని, దానిలోఁగూడ వైశిష్ట్యమున్నది. ప్రవరుఁడను. లేకపోయిన

నీవంటి అందకత్తె నాయందు బద్ధానురాగవై యెటులగును? ఏమని యెదవు? నామీఁద నీకనురాగ ముద్భవింపలేదని యనియెదవనినను నీ చంచలదృగంచలనిరీక్షణము, నీమీనాంకానలసూచక ధూమాంకురములవలె మన్న పులకలు నీయంతరంగమును దెలుపుచున్నవి. నేను సన్మార్గగామితను వదలుకొంటిని. ఎన్నియేండ్లయినను ఒకే బాటలో నడచిన జడత రోఁతగలుగును. ఇటులఁ బను లొనర్చిన వారిని సజ్జనులో క్రొవ్వెక్కినవా రనియెదరు. ఒవ్వకొనలేదా బయలుదేరితిని. క్రొవ్వెక్కినదికనుక నే "నాదు కేఁగినఁ దల పొలమునఁగాని నిలువ" దనినట్లు ఈపర్వతాగ్రమునకుఁ జేరితిని. ఇఁక వెనుకదారిఁ బట్టను. నీయిష్టము తెలిసిన మీఁద నిక మా పురమునకు నేఁగను. వెనుకకు చూడను. ఇటుపైని నా కేమియు నుపాయము కానరాదు. ఏమిచేయుటకు. ఉపాయము నీవు చెప్పవలసియున్నది అన్నిదార్ల మెట్టినదానవీవు. దారెద్దియేని తెలుపుము. అది నీకు శుభశోభనములకుఁ బనికివచ్చునది అయ్యెడిది చూడుము దారి. దారి తప్పినవారికి దారిచూపు విధానము తెలిసి చూపుదాన వీవుకదా! అను నర్థము నూహింపవచ్చును.

లేదా; భీత! ఎవ్వతె వీవు? లేడి వనములో గుంపువీడి ఉండదు. ఏకాంతముగాఁ జరింపదు. దానికి విశేషకారణముండును. మరలనభీష్టులతోఁ జేరినపుడే భయము పోవును. ఒంటరిగా నున్నపుడు భయపడుచు నుండును. ఏకాకిగానుండి భయపడు లేడివోలెఁ జంచలనేత్రములతోఁ జూచుచుంటివి. నీ వెవరవు? భయము వేయకుండఁగనే ఈవనభూమిలో చరించుచుంటివా? కాదు. నీవు నా వలెనే భయమంది యుండవు. నీవును నేనును ఒక విధమైయినవారలమే యై యున్నాము. ఇద్దఱము కలిసిన ఒక దారిత్రొక్కుటకు వీలుపడును. సరే, నే నెవర్తనో చెప్పిన నీకుఁ గొంత తెలియఁగలదు. నేను బ్రాహ్మణుఁడను. నాకుఁ జాతుర్వర్ణ్యస్త్రీలతోఁ గలియుటకు నధికారమున్నది. నీవు సురస్త్రీవయిన మఱి బాగుగనే కుదురును. భూసురుఁడ నేను. ప్రవరుఁ డనువాఁడను. క్రొవ్వెక్కి యిక్కడికి వచ్చితిని. దారి తప్పితిని. ఇంతదూరము వచ్చిన

తరువాత వెనుకదారిఁ బట్టను. చేరుటకు నుపాయము కానరాదు. నీవు అట్టిదాననే అయి యుందువు. ఇద్దఱము మన కెందులకుఁ గలసితిమో? నష్టాశ్వదగ్ధరథన్యాయమున. ఆఁడుదానికి నీకు భయమే అను నాకెందు కింతభయము. ఆ భయములో నేమి యుపాయము తోఁచుటలేదు. నీకు శుభమగు మార్గమొకటి ఆలోచించిన నదియే నాకు శుభంభావుకము. ఒక దారిఁద్రొక్కి ఈ మార్గమునఁ బోవుదుమనిన నటులఁ జేయుదము. కనుక ముందు నీవు దారి తీయుము. అది యెటులైనను సరే. నేను దోఁకితిని కావున నీకింక భయపడవలసినది లేదు. ఈపై నీయిష్టము. అని తన కథ నెఱింగించె ననవచ్చును.

లేదా; బ్రాహ్మణుఁడు యజ్ఞయాగాదులు చేసినవాఁడు. స్వర్గసుఖములమాట తెలిసినవాఁడు. హిమవత్పర్వత శిఖరాగ్రముమీఁద మరున్నారీశిరోమణులు లుందురని తెలిసినవాఁడు. యజ్ఞఫలముచే సశరీరస్వర్గము వచ్చునని తెలిసినవాఁడు. కనుక నే అనేకదృశ్యములయిన వుండఁగా నన్నియు విడచి హిమమత్పర్వత శిఖరాగ్రమునకు వచ్చినాఁడు. గంధర్వాంగన తారసిల్లినది. ఈమిడ గంధర్వాంగనయే అని రూపును బట్టి ఆనవాలు కట్టినాఁడు. కాని నిమేషిత, స్విన్నగాత్రము చూచి మనుష్యాంగనయేమో యని భ్రాంతిలోఁబడినాఁడు. అయినను పృచ్ఛించినఁదేలునని యనుకొని అనినాఁడు. ఈ పర్వతశిఖరాగ్రాన, ఈవన్యమృగాకీర్ణారణ్యములో, నొక్కతెవు సంచరించుచుంటివి నీ వెవతెవు? ఓ చంచలనేత్ర! నేను భూదేవుఁడను. ప్రవరుఁడను. భూసురత్వసాధ్యమయ్యెడిది యున్నదా అని తిరుగుచు నీ ప్రాంతమునకుఁ జేరితిని. నీ వెవతెవో తెలిసిన నా రాక తెలుపుదును. అయినను చెప్పివైచెదను. బ్రాహ్మణత్వముచే సంపాదింపవలయు బ్రహ్మత్వము వీడి కర్మలదారి తప్పి, క్రొవ్వుచే నీ పర్వతశిఖరమునకుఁ జేఁతిని. వచ్చివేసితినిగాన నింక మాయూరు చేరను. ఏమిచేయు నుపాయము తోఁచుట లేదు. బ్రాహ్మణుకున శరీరస్వర్గమున్న యెడల దాని ఫలితము మీ కవుఁగిళ్ళ సుఖించుటయైనచో, నీవు గంధర్వస్త్రీ వైన నీతోఁ జెప్పకపోవుట యేమి. ఏమియు

ఏమియు నాకు దోఁచుటలేదు. ఈ పైననేది యేనిదారి చూపుము. నీకే శోభన మగునులే? అటుల నొనర్తము. అని ఆమె ఎవరో! ఆమె ఆకూతమెట్టిదియో? తెలియఁగోరినాఁ డని యనుకొనవచ్చును. మనుష్యాంగనయా? గంధర్వాంగనయా యను భ్రాంతిలో.

ఈ రీతిని నింకను బలురీతుల నొక్క పద్యమున నర్థములు గోచరించుట కలదు. ఈ రీతిగఁ జమత్కృతిచేయు శక్తి ఆ పద్యమునఁగల పదములకుఁ గలదు. దానికొక పేరుపెట్టి పిలుచుటచే వ్యంజనాశక్తి యనిరి. స్ఫురించునర్థమునకు ధ్వనియని పేరిడిరి. ఇయ్యదికళకు అందునను సాహితీ కళకు ముఖ్యమైనదనిరి.

పై రీతిని రసమునకు, (ధ్వనికి, వ్యంగ్యార్థమునకు తత్ర చర నప్రధాన ధ్వని) ఉద్దీపకములయిన అలంకారములు, సంఘటన, వృత్తులు, యమకాదులు, అభిధా మొదలగు శక్తులన్నియు నిటు ఆనందానుభూతి కాటంకము కలిగించకుండ నయథార్థవిషయములఁ దెల్పిననరే మైమఱపును కలిగింపఁజేయు కళానిర్మాత యుత్తమకళాస్రష్ట. పై రీతివాక్యమునంతను నిండించి నడిపించిన కళాకారున కగ్రస్థానమీయవలసినదే.

ప్రాచీనకాలమునఁ గళావిదులందఱు పై వర్గమునకుఁ జెందిన వారే. వారు సమగ్రకావ్య నిర్మితిలో నుత్తమకళను రూపొందించిన రీతిగ నొక్కొక్క పద్యమునందే ముక్తకమునందే కళను రూపొందింపఁ గలరు,

శ్లో. తన్వీచారుపయోధరా సువదనా శ్యామా మనోహారిణీ
సీతా నిష్కరుణేన కేనచి దహో దేశాంతరా దాగతా
ఉత్సంగోచిత యాతయా రహితయా కిం జీవనాపేక్షయా
భిక్షో తే దయితాస్తి కిం నహి నహి ప్రాణప్రియా కుండికా.

శ్లో. ఆకృష్యాదావమందగ్రహ మలకభరం వక్త్ర మావర్జ్య వక్త్రే
కంఠే లగ్నః సుకంఠః పృథుని కుచతటే దత్తగాఢాంగసంగః
బద్ధాసక్తి ర్నితంబే పతతి చరణయో ర్యస్య తాదృక్ప్రియో మే
బాలే! లజ్జా నిరస్తా నహినహి సరలే! చోలకః కిం త్రపాకృత్.

రెండవ పద్యముమాట యటు లుంచి మొదటి పద్యము కరుణ,శృంగార, హాస్యముల కాలవాల మయి యున్నది. చేతశ్చమత్కృత్యాధాయకమై యున్నది ఇట్టి ముక్తకములలో హాసంబాభివ్యక్తి ఉన్నదని చెప్పిరి. అమరుక మిట్టి ముక్తములతో నిండియున్నయని. తెలుఁగులో శ్రీనాథుఁ డిట్టి ముక్తరచనములో నాఱితేరినవాఁడు.

"ముద్దులగుమ్మ" "విూనవిలోచనంబులును" ఇటువంటి పద్యము లిట్టివే.

నాటకకళ — ఉపదేశకత

శ్రవ్యకావ్యముల మాట అటులుంచి దృశ్యకావ్యములలోనికి వచ్చిన ఈ కళకు నీతి, ఉపదేశకత యున్నపుడే సొంపుండును. సమాజము ఒప్పుకొనును. దృశ్యకావ్య మనినను నాటకకళ యనినను ఒక్కటియె. ఈ కళ కన్నికళలకంటెఁ బ్రాధాన్య మున్నయది. ప్రాధాన్యముండుటకుఁ గూడ నీ కళలో ననేక కళాసమ్మిశ్రిణ ముండును. గీతము, నృత్యము, వాద్యము, నాట్యము, ఆలేఖ్యము, చిత్రకళ, ఇంచుమించు చతుష్షష్టి కళలలోనే కొన్నిటికో తక్క చాలవానికిఁ బ్రవేశ ముండియుండును. ఇన్ని కళలతో నిండియున్నది కావుననే ప్రేక్షకుని మనస్సు చట్టున నాకృష్టమయిపోవును. ఈ నాటక కళాద్వారా ఆవిష్కృత మగు విషయము మనుజుని వెంటనే మార్చివేయును. ప్రేక్షకుని మనస్సున ఈ కళలోఁ బ్రదర్శింపఁబడు విషయములు సంస్కారరూపముగ మాఱిపోవును. వానికిఁ గొన్ని జీవితాదర్శముల నేర్పాటుచేయును. నాటకము లింతగా మార్చివేయును మనుజుని. మాట మాఱును. భాషమాఱును. ఆచారవ్యవహారములు మాఱును. హావభావములు మాఱును. దుస్తులు మాఱును. చేష్టలు మాఱును, ఈ రీతిగా, గుణములోఁ క్రియలోఁ తుదికి జాతిలో మార్పువచ్చును. విగళితవేద్యాంతరమగుటకు, తన్మయతకు నీ కళ ప్రధానసాధనము.

ఈ యుగమునఁ బరీక్ష చేసి చూచిన, చిన్నలు, పెద్దలు, యువకులు, యువతులు, అందఱు చలనచిత్రములను (సినీమాలను) జూచి మాఱిపోవుచుండిరి. మాటలలో, పాటలలో, దుస్తులలో, చేష్టలలో, నడకలలో, నడఁతలలో, ఇవియు నవియు నేమి అన్ని విషయములలో మాఱిపోవుచుండిరి. ఎక్కడ విమర్శ మైనను వీనినిగూర్చియే. ఏపత్రికలైనను జలనచిత్రవిమర్శనలతో నిండినవే. ఏ సమాజములలోఁ జూచినను, ఏసంఘములలోఁ జూచినను చలనచిత్ర సామ్యములే. పండిత పామరగోష్ఠియు సిద్ధానిని గూర్చియే. ఇంత తమ యాధిపత్యమును చలనచిత్రములు ఆబాలగోపాలమునఱకు సంపాదించిన వనినచో నాఁడు నేఁడు నాటక కళాప్రభావ మట్టిదే! వెనుకటి యాకళ, నీతి, ధర్మ సహాకృతమై వానికేఁ బ్రాధాన్యము హెచ్చునిచ్చి, వాని యుపదేశము మానవ సౌభాగ్యమునకు, జగత్కల్యాణమునకుఁ దోడ్పడవలెనని సృజింపఁబడెడిది. అటులఁ దమ విధ్యుక్తమును నెఱవేర్చుకొనెడిది. ఈ యుగములో నీకళ సమాజోద్ధారమునకయి బయలు దేఱుచు, వెఱ్ఱితలలు పెట్టుకొని, తన యభివ్యక్తికిఁ బనికివచ్చు అంగవిషయక ప్రాధాన్యమునే హెచ్చు చేసికొని, చెప్పనెంచిన ప్రధానవిషయము మఱిగి, మ్రగ్గిపోవునంతటి యేమఱిపాటుతో నెలువడుచున్నది.

వెనుకటి కళాస్రష్టలు సమాజము మనల నెంతవఱకుఁ బరీక్షించి నిలువనీయఁ గలదనియు, మన కెట్టిస్థాన మిచ్చెదరో యనియు, నా కళా ప్రతిపాద్యాంశ మెంత జగత్కల్యాణదాయి యగు ననియు, ఆ సమాజ ముత్తమ సమాజము కావలెననియు, నిరీక్షించి, పరీక్షించి, తమ కళను వెలువఱచుట కలదు. కాళిదా సనును,

శ్లో. ఆ పరితోషా ద్విదుషాం న సాధు మన్యే ప్రయోగవిజ్ఞానం
బలవదపి శిక్షితానాం ఆత్మ న్యప్రత్యయం చేతః.

అని, ఈ రీతిగ ననేకులు సమాజోపయోగమునకుఁ దాము కళ సృజించి, సమాజములో నుత్తమకళాకారు లనిపించుకొనవలెనని ప్రయత్నించెడి వారు. తా నాద్యకళాస్రష్టయయినను తెలుఁగురీతికి. "సత్సభాంతరసరసీవసంబున ముదంబొదవం గొనియాడి వేడుకఁ" అను నన్నయకుఁగూడ

నచే భయము. సమాజమునకుఁ గళకు సంబంధ మనిన జీవితమునకుఁ గళకు సంబంధ మనినను దప్పు లేదు. జీవితము యుగయుగములనుండి క్రమవికాస మెట్లు పొందినదో యాజీవితలక్ష్యములను, జీవితానందమును దెలుపుచు కళకూడ ప్రాకుచు వచ్చినది.

కళ—జీవితవికాసము.

ఆదియుగములో (దీనికంటె ఐతిహాసికులే వేసుకొనియెదరు) సంఘజీవనము వారి లక్ష్యము. వారి యానందము. వారిసంఘము నొక యంకనముచే సంకేతము గావించి వ్యవహరించుటయే. దానికయి వారు మృగ, సింహ, కరి, అశ్వాది చిహ్నములలో నేదియో యొకటి తమదిగాఁ జేసుకొని దానిని దమ కత్తులందుగాని, బాణములందుఁ గాని, ఇండ్లయందుఁ గాని ముద్రింపఁజేసి తమ నా గుర్తుచే నేర్పాటుచేసుకొనుటయే.

రెండవ యుగమువారు రాతిమీఁదఁ దమ మనస్సు నుపయోగించి, వానికిఁ గొన్ని మార్పులు రావించి, వానినిఁ దమ వానినిగా నొనర్చుకొని, వాని చిత్రణము (వానిని చెక్కడము) వలనవచ్చు ఆనందమునే కళానందముగా సంతోషించెడివారు. ఇయ్యది రాతియుగములోని కళ. లోహయుగము దాఁక నిట్లే వచ్చినది. రాతిమీఁద వచ్చిన మార్పు లన్నియు నీకళకుఁ దార్కాణములు.

మూఁడవ యుగములోఁ గొలఁది పరిశ్రమలమీఁదికి దృష్టి పడినది. వృత్తికళ ఉత్పత్తి అయినది. నేఁత మొదలయిన కొన్ని జీవితోపయోగ మగు, కళ ఉద్భవించినది. అజ్ఞాతావస్థలో నున్న కళకు, అవ్యక్తముగా నున్నకళకుఁ గొంచెము తల వాడసూపినది.

తరువాతి యుగములో వీరులు బయలుదేరిరి. వీరులను సుందరులనుగాఁ జేయుట, వారిని యుద్ధములోఁ గుశలులనుగాఁ జేయుటకయి యుపయోగపడు సాధనముల నిర్మించు వృత్తికళలలోనే ఈ యుగము కూడ నడచినది. ఇక్కడికి వచ్చునప్పటికి వ్యవహారోపయుక్తముగాఁ గళ విస్తృతిఁ జెందినది యనవచ్చు. ఈ కళ తా నొనర్చు పనులలో

"నేర్పు" అను నిర్వచనములో సాగిపోయినది. అంకనములో నేర్పు, రాతి చెక్కడములో నేర్పు లోహవస్తు నిర్మితిలో నేర్పు, వస్త్రనిర్మితిలో నేర్పు, యుద్ధములో నేర్పు, అను రీతిలోఁ గళ సాగినది.

మానవసమాజము తరువాత కల్పనాత్మకళను నేర్చుకొనినది. పంచభూతములలో నొకదానిని దేవతగా భావించి వానిమీఁద శ్రద్ధాభక్తులనుంచి, ఫలదాత లగు దేవతలగా భావించి, సేవించి, ఆనందమొందుచుండెడిది సమాజము. కళ విస్తృతి చెందినది. సంప్రదాయములు సంప్రదాయవిభేదములు, తాము దేవునిగా నారాధించు దాని మూర్తిని నిర్మించుట (చిత్రకళ- మూర్తికళ-) వానిని ప్రశంసించుట (గానకళ- సాహిత్యకళ-) జరిగి ఆయా కళల కుజ్జలోదాహరణములు దొరకినవి. ఈ యుగములో భక్తులు, ఉపాసకులు, నగు కళాకారులు బయలుదేరి తమ కల్పితవస్తువునకు రూప మిచ్చి, వానికి శక్తి నిచ్చి, వానివలన లాభములను బొందుచు నానందించు జీవితలక్ష్యములోనికి వచ్చిరి.

ఈ యుగమునకుఁ జెందినవే ఋషులు దేవతలు, ఈవాలు వారి పైగంబరులు, బుద్ధుఁడు వారి క్షపణకులు, మొదలగు భేదములు వచ్చినవి. అనేక మతస్థులు లేచిరి. చీనావారి బుద్ధమూర్తి ఒకరీతి, ఏశియావారి బుద్ధమూర్తి ఒకలాగునఁ దయారయినవి. ఈ యుగములో భావనా సహకృతకళ విస్తరించినది. పురాణము లీయుగమునకుఁ జెందినవి. ఖురాను వచ్చినది. ధమ్మపదములు వ్యాపించినవి. ఈ యుగములో సృష్టమయిన కళ సంఘమును జాల మార్పులోనికిఁ దీసుకొని రాఁగలిగినది. సంఘమునకుఁ జైతన్యము పోయినది. ఈ యుగమున లలితకళలు పూర్ణరూపు పొందినవి.

పై యుగములన్నిటిని గప్పి "Realistic Art" వెలువడుచుంటిమని ప్రకృతివాదులగు కళాకారులు కళాస్థానమును ఆక్రమించిరి. నక్షత్రరత్నములు పొదిగిన నీలావిదానము కలిగి, శుభ్రజ్యోత్స్నాపటావృత మయి, శుచితర సూర్యరశ్మిపాతము గల విశ్వవిస్తృత రంగ

మంచము, వివిధములగు రంగులతో నిండిన సహస్రపరిమితదృశ్యవిరాజమానశైలశిఖరములు, సముద్రతరంగమృదంగఘోషము, అరణ్యశిరస్సులమీఁద నీడ యెండలఁ గలిగించు రేయింబవళ్ళు, పక్షి యొక్కటి లేచుట, రెండవది పడిపోవుట; ఋతువొకటి యుద్భవము, ఒకటి లయము, అనెడి వింతవింతలు విలక్షణము లయిన తెఱలు కలిగి, గొప్ప ఇంద్రజాలికశక్తితోఁ గూడి, పూలతో వికసించుచు, కేసరపరాగమములతో మేపూఁతఁ బూసికొని, విచిత్రరంజకద్రవ్యరంజిత ఘనావృతదిశావస్త్రములుఁ గూర్చుకొని, దిక్కులలో నుండి వంగితొంగి చూచుచు, సెలయేళ్లలోఁ బాడుచు, అంధకారములో సంతర్ధానము నందుచు, దినరశ్మిలో బయటపడుచు హాస్యము- రోదనము; సంయోగము- వియోగము; మానము- ఈక్షణము కలిగి, సర్వద్వంద్వాశ్రితమై; నవరసముల నాశ్రయించి, మధురభీషణకలరవములఁ జేయుచు, జీవజంతుస్వభావాభినయముల నొనర్చుచున్న ఈ ప్రకృతి, ఈ విశ్వము, ఒక ఈశ్వరీయ యథార్థసాహిత్యము. సరససాహిత్యము, వాస్తవనాటకము. ఇది ఒక సంపూర్ణకళ. వీనివి ఉన్నవి ఉన్నట్లు చిత్రించువాఁ డుత్తమకళాకారుఁ డనిపించుకొనును. ఇతఁడు "Initatiue Art" "కనుకరణకళ"ను సృజింపవలసినవాఁడు కాఁడు. వీరు లేని దానిని గల్పించరు. వీరు కళాసృష్టికయి ప్రకృతిని ప్రేమింతురు. ఉపాసింతురు. ప్రకృతిధ్యానములో, ప్రకృతిసమాలోచనలో నిమగ్నులయి ఉన్నది ఉన్నట్లు చెప్పికొనుచు, చిత్రించుచు నానందించెదరు. వారికిఁ ప్రకృతి నిరీక్షణమువలననె, ప్రకృతిచిత్రణమువలననే, ఆనందించు శక్తి ఈశ్వరుఁ డిచ్చినాఁడు. ప్రకృతివస్తువును ధ్యానించుచు, ఆకృతికిఁ జెందిన ప్రకృతిగతమగు ననేక వస్తువుల సామ్యమును అస్థలమునకుఁ దెచ్చుకొని ఆనంద మందెదరు.

పుష్పకములో నుండి రాముఁడు సీతకుఁ బ్రకృతిరామణీయకత నిర్దేశించి చూపును. ఒక్క గంగను అనేక విధములుగాఁ జూడ మనెను.

శ్లో. క్వచి త్ప్రభాలేపిభి రింద్రనీలై ర్ముక్తామయీ యష్టి రివానువిద్ధా
అన్యత్ర మాలాసితపంకజానాం ఇందీవరై రుత్ఖచితాంతరేవ

వీరు తమ కళ నగ్నముగా ఆ విష్కృత మయినను మాకు హాని యేమియు లే దనిరెదరు. సమాజము పతిత మయినను వృద్ధిచెందినను మా కవసరము లే దనిరెదరు. మావలె వీరుకూడ నానందించ మని రెదరు.

ఈ యుగమునకుఁజెందిన కళ లటులుండ కళ ఆదర్శ, మయి యుండవలె నను వారు భయలుదేరిరి. ఈయుగములు రెండు నొకదాని నొకటి తప్పించవలయు నని యున్నవి. ఈయుగపరివర్తనము ముందుకు నడచునో వెనుకకు వెడలునో యనునది యనిర్వచనీయము. ఈ కాల ము రచనాత్మక కాలము. ఈ రచనాత్మక కళాకాలములోనే మానవుఁడు పూర్ణవ్యక్తిత్వముకొఱకుఁ బ్రయత్నించుచున్నాఁడు. ఈ కళాకారుఁడు తన వ్యక్తిత్వములోఁ బరిపూర్ణత నంది సమాజమును ముందుకు నడి పింత మని చూచుచున్నాఁడు. ఈకాలములోఁ గళాకారుఁడు సమాజము నకుఁ దనకు, తన జీవితమునకు సమాజమునకు ఈ రెంటికినిఁ గళకు ఘనిష్ఠసంబంధ మున్నది యని గ్రహించి తాను సృష్టించుకళ సమాజోప యోగి యనవలెనని, వేధపడుచున్నాఁడు, తన రచనకు సమాజముద్ర పడవలెనని యున్నాఁడు. కాని ఈయుగములో కళ ఎంత కన్నులు తెఱ చినదో, ఎంత ఉన్నతికి రానలెననుకునుచున్నదో, అంత అంధకార ములో మునిఁగిపోవుచున్నది. అంత అధఃపతిత మయిపోవుచున్నది.

కళ—శృంగారరసము.

ఇప్పుడు సృష్టమగు కళ శృంగారరసప్రధాన మయినది. (బా హ్యేంద్రియాకర్ష కము. తుచ్ఛభోగేచ్ఛావివర్ధకము) అనఁగా మను జుని అన్నిరీతుల విరసునిగా నొనరించుచున్నది. వెనుకటి ప్రసిద్ధకళా కారుల కళలో శృంగారరస మత్యంత ముత్యుక్తమయినదని యనుట లేదు. కళ శృంగారరసముతో నుండుట మంచిదే. శృంగారరసముతో నున్న కావుననే మనుజుఁడు తొందరగా నాకర్షింపఁబడుచున్నాఁడు. ఆకృష్టికి, అభిముఖీకృతికి శృంగారరసము అవసర మనినాఁడు ధ్వనికర్త ఆనందవర్ధనుఁడు.

శ్లో. వినేయా నున్ముఖీ కర్తుం కావ్యశోభార్థ మేవ వా
తద్విరుద్ధరసస్పర్శః తదంగానాం న దుష్యతి.

శృంగారము నియతానుభూతివిషయ మందఱకు, అది విరుద్ధరసములలోను నింపవచ్చును. వానితోఁగూడిన నాటకాదులు తమ ముఖ్యోద్దేశ్యమగు నీతిని బోధించునవి కావచ్చును. శృంగార ముండిన ప్రతిపాద్యము సరసముగా నుండును.

శృంగారచేత్కవిః కావ్యే సర్వం రసమయం జగత్
స ఏవ వీతరాగశ్చే న్నీరసం పరివర్తతే.

అని కదా ఆనందవర్ధనుఁడు శృంగారమును హెచ్చుగా వర్ణించిన కళాస్రష్ట హెచ్చునీతిని బోధించి శృంగారమును మఱచిపోయి ఉపదిష్టమయిన నీతి నాశ్రయించి మనజుని సదాచారిగా మార్పఁగలిగినంతటి శక్తి ఉండినపుడే కళలో శృంగారము ఉంచవలె నని పై నంటున్నాఁడు. ఇంకొక విధమును శృంగారరసము ఉంచుట కలదు. చేతకానివాఁడు కావ్యకళను శృంగారరసముతోనే నింపును. అంతయు శృంగారరసముతో నింపి సృజింపఁబడిన కళ సత్పథములోనికి దింపుటకు బదులు దుష్పథములోనికి మార్చును. అటుల మార్చినది కళకాదేమో.

శృంగారమును వర్ణింపని మహాకవులు లేకపోలేదు. కళాకారులున్నారు. వారు త్తమతరగతికిఁ జెందియున్నారు. వారు సాహితీరంగములోఁ బ్రవేశించి కళ కట్టించిరి. వారు తమ కావ్యమునకు స్థాయిభావముగా శోకమును (ఏడ్పును, రోదనమును) స్థాయిభావముగాఁ దీసుకొనినను, ఏడుపు తా మేడ్చినను, సామాజికులును ఏడ్పులోఁగూడ నేడుచుచుంటి మను మనోవేదన లేకుండ, పైకది ఏడుపైనను దానిలో నానందము ననుభవింపఁజేసిరి. ఏడుపే అన్ని రసముల కాలవాలమైన దన్నంత వెఱ్ఱిలెత్తించిరి ఆ ఆనందానుభూతిలో. కరుణలో అనుభూతివిషయ మానంద మనిరి. తత్తచ్చేష్టానుగుణా స్మరణము లుద్దీపములు. పైకి దుఃఖమయినను, కొంతదుఃఖ మనుభూతివిషయమయినను శీతకాలములో కర్పూరమిశ్రితచందనరాగమువలె అనందానుభవమే ఉత్కట

ఏకాదశ స్కంధము

హరిభట్టారకుఁడు

క. ధారుణిఁ బెక్కగు నా యవ
తారంబులు గలవు నరుఁడు దన చిత్తములో
నే రూపమంద రుచి గల
దా రూపము దలఁప వలయు నభ్యాసమునన్.

ఆ. పరమ యోగివరులు పరతత్త్వ మైనట్టి
నన్ను విమల చిత్తనలినమందుఁ
దనివి లేక యేకతంబుగాఁ దలఁచినఁ
బొంద రెచట జన్మముల మునీంద్ర !

వ. మరియు యోగంబునకు నష్టాదశధారణావిశేషంబులు గలవు.
అం దెనిమిది మత్ప్రధానంబులై గుణహేతువు లగు, అణిమయు,
మహిమయు, లఘిమయు, నింద్రియప్రాప్తియు, శ్రుతదృష్టంబుల
యందుఁ బ్రకాశమగు శక్తియుఁ బ్రేరణంబు నీశత్వంబు ననఁ బరగు
నీ యెనిమిదియును యోగసిద్ధకారణంబు లని యోగశాస్త్రజ్ఞులు
చెప్పుదురు. ఇంద్రియంబుల స్వేచ్ఛావిహారంబు మాన్చి, మనంబు
నం గూర్చి, మనంబు నాత్మయందుఁ దగులం జేసి యాత్మ నాత్మ
తోఁ గూర్చి బ్రహ్మమార్గంబున శరీరత్యాగంబు సేయవలయు.
యోగసిద్ధిపరగుఁ డైన మానవోత్తమునకు నితర ధర్మానుసంధానం
బు వలదు. తొల్లి కురుపాండవ యుద్ధానంతరమున భీష్ముండు శరతల్ప
గతుం డై యోగధారణారూపం బడిగిన నతనికి నేఁ జెప్పిన రూప
లక్షణంబు చెప్పెద. చరాచరరూపం బైన జగంబులందుఁ దదాకా
రంబు దాల్చి భూతంబులయం దాధారభూతం బై సూక్ష్మంబుల
యందు జీవుండును, దుర్జయంబులయందు మనువును, దేవర్షుల
యందు నారదుండును, ధేనుగణంబులయందుఁ గామధేనువును,
సిద్ధులయందుఁ గపిలుండును, పతగంబులయందు సుపర్ణుండును,
బ్రహ్మలయందు దక్షుండును, పితృగణంబులయం దర్యముండును,

దైత్యులయందుఁ బ్రహ్లాదుండును, నక్షత్రౌషధులయందుఁ గళా నిధియును, గజంబులయం దైరావతంబును, దురంగంబులయం దుచ్చైశ్శ్రవంబును, దర్వీకరంబులయందు వాసుకియును, మృగం బులయందు సింహంబును, నాశ్రమంబులయందు యత్యాశ్రమంబు ను, వర్ణంబులయం దకారంబును, నదులయందు గంగయు, సాగ రంబులయందు క్షీరసాగరంబును, ఆయుధంబులయందు ధనువును, గిరులయందు మేరుశైలంబును, వనస్పతులయం దశ్వత్థంబును, నోష ధులయందు యవధాన్యంబును, యజ్ఞంబులయందు బ్రహ్మయజ్ఞం బును, వ్రతంబులయం దహింసయు, యోగంబులం దాత్మసంరోధం బును, స్త్రీలయందు శతరూపయు, మునులయందు నారాయణుండు ను, యుగములందుఁ గృతయుగంబును, సిద్ధులయందు దేవళుండును, ధర్మంబులయందు సన్న్యాసంబును, గోప్యంబులయందు సత్యంబును ఋతువులయందు వసంతంబును, మాసంబులయందు మార్గశీర్ష మాసంబును, నక్షత్రంబులయం దభిజిన్నక్షత్రమును, భగవదాకా రంబులయందు వాసుదేవుండును, గింపురుషులయం దాంజనేయుం డును, జయశీలంబు లగు నాయుధములయందు సుదర్శనంబును, రత్నంబులయందుఁ బద్మరాగంబును, దానంబులయం దన్నదానం బును, తిథులయం దేకాదశియును, నీతులయందు వైష్ణవుండును నై వర్తింతు. ఇవి మద్విభూతులుగా నెఱుంగుము. మరియు, నింక జగంబులయందు నే వస్తువులం దెయ్యవి మించు చూపు నవి మద్రూ పంబులుగా నెఱుంగవలె నని పుండరీకాక్షుం డానతిచ్చిన విప్రవరుం డిట్లనియె.

క. అర్ణవశయనా నాయక
వర్ణితసుగుణాభిరామవైభవ! నాకుఁ గా
వర్ణాశ్రమ ధర్మంబులు
నిర్ణయముగ నానతిమ్ము నిత్యచరిత్రా!

వ. అని పలికిన సర్వంసహా సురేంద్రునకు నారాయణుం డి ట్లనియె.

సీ. కృతయుగంబందు సత్కృతుఁడనై
హంసరూపంబున నలరియుండు
ఆ యుగంబున ధర్మ మంతయు వృషరూప
మున వృద్ధిబొందును దినదినంబు
త్రేతాయుగంబునఁ జాతుర్ని నా ధర్మ
మంతయుఁ బాదత్రయమునఁ దనరు
ద్వాపరంబందుఁ బాదద్వయంబున నది
వర్తించు నెచ్చోట వరుసచెడక.

గీ. బలిమి నొందక కలియుగంబందుఁ బాద
మాత్రమున నుండి యదియును మాసిపోవు
నీ విధంబున ధర్మంబు నేపు దప్పి
యుగయుగంబున వర్తించు నుర్విమీఁద.

సీ. ఆరయ వక్త్రబాహూరుపాదములందు
రమణ విప్రాది వర్ణములు పుట్టె
యజ్ఞంబు సత్య మధ్యయనంబు శమమును
విప్రధర్మంబులై వెలయుచుండు
దాన మాస్తిక్యంబు దయయును శౌర్యంబు
క్షత్రిధర్మంబులై జరుగుచుండు
నియమంబు శాంతి వాణిజ్య గోరక్షణా
దులు వైశ్యధర్మముల్ తెలిసిచూడ.

సీ. విప్రసేవయు దానంబు విష్ణుభక్తి
స్వామికార్యంబు మాయగాఁ జరుపకుంట
జయము చేకొంట శత్రులసమయఁజేయు
టరయ నివి శూద్రధర్మంబు లన్నిదిశల.

ఆ. హింసచేయకుంట హితే వాచరించుట
దానగుణము శాంతిదయయుఁ గలుగు
టనృత మాడకుంట హర్షంబునొందుట
వరుస నివియు సర్వవర్ణసమము.

వ. మరియు నందు బ్రహ్మవర్ణంబుల బ్రహ్మచారి గృహి వానప్రస్థ యత్యాశ్రమభేదంబుల నాల్గువిధంబు లయ్యె. నా యాశ్రమంబుల యందు యథాకాలవిహితోపనయనాది సంస్కారసంస్కృతత్వంబును, మౌంజీకృష్ణాజినోపవీతదండకమండలుధారణంబును, నింద్రియజయంబును, గురుశుశ్రూషణంబును, నిత్యశుచిత్వంబును, భిక్షాచరణంబును, స్వాధ్యాయపఠనంబును, సర్వసమత్వంబును, నాఁదగు నివి బ్రహ్మచారి ధర్మంబులు. పుణ్యతీర్థస్నానంబును, భూతదయయును, బ్రహ్మయజ్ఞంబును, దేవర్షిపితృతర్పణంబును, నగ్నిహోత్రంబును, దర్శపౌర్ణమాసియు, నౌపాసనవైశ్వదేవాది నిత్యక్రియాచరణంబును, శ్రాద్ధనియమంబును, దేవతారాధనంబును, స్వభార్యయందు ఋతుకాలగమనంబును, దానంబును, బ్రతిగ్రహంబును, నతిథిపూజనంబును, నివి గృహస్థ ధర్మంబులై పర్యవసించు. శిలోంఛధాన్య సంగ్రహంబును, జటావల్కల ధారణంబును, నిత్యనైమిత్తిక కర్మాచరణంబును, కామ్యనిషిద్ధ కర్మ పరిత్యాగంబును, భూతదయయును, సుఖదుఃఖ సమత్వంబును, మదీయ సేవా నియమంబును, వానప్రస్థ ధర్మంబు లనఁబరగు. కౌపీనాజిన దండకమండలుధారణంబును భిక్షాచరణంబును, బ్రహ్మజ్ఞానంబును, బ్రహ్మచర్యంబును, బరమాత్మదర్శనంబును, బుత్రదారాదిస్నేహ విసర్జనంబును, రిపుషడ్వర్గజయంబును, బుణ్యతీర్థాశ్రమ పర్యటనంబును, మన్నామస్మరణంబును, మదాకృతి ధ్యానంబును, సర్వకర్మ పరిత్యాగంబును నివి యతి ధర్మంబు లనఁబరగు. నీయాశ్రమముల యందుఁ దుర్యాశ్రమంబు నా రూపంబుగా నెఱుంగుము. అట్టి యత్యాశ్రమస్థుండు పుత్రదారధనాదులతోడి సంగంబు పరిత్యజించి గ్రీష్మకాలంబునం బంచాగ్ని

మధ్యంబందును, వర్షాకాలంబున వర్షంబుల యందును, శిశిరంబునఁ గంఠదఘ్నసలిలంబులయందును దపము సేయుచుఁ జాతుర్మాస్యాదులయందుఁ గాలపక్వపదార్థంబు లనుభవించుచు హాత్మారోపితాగ్ని సమేతుండై నఖచ్ఛేదనంబు పరిత్యజించి యనిందిత గృహంబుల యందు భిక్షాటనంబు సేయుచు,దృష్టిపూతం బగు మార్గంబున గమనం బాచరింపుచు, వస్త్రపూత జలపానంబు సేయుచు, సత్యపూతం బగు వచనంబులు పల్కుచు,రిపుషడ్వర్గ జయంబు గల్గి, విరక్తుండై, యేకాంతసమాసీనుండై, మదాకృతిధ్యానసుఖం బెఱింగి, యెఱుక గలిగియును బాలుని చందంబునఁ గ్రీడించుచు, కుశలుండయ్యును జడునిమాడ్కి సంచరించుచు,జ్ఞానంబు గల్గియు నున్మత్తుని రీతిఁ బ్రవర్తించుచుఁ బాషండ సంగమంబు పరిత్యజించి, పశువు క్రియంబునఁ బరులయందు వైరంబు సేయక ప్రాణధారణ మాత్రంబు నీరసాహారంబు భుజియింపుచు, దుఃఖోదకంబు లైన కామంబుల యందు సంజాత వైరాగ్యుండై, గురుసేవాపరిజ్ఞాన తత్త్వసారుండై, మద్భక్తి సంయుక్తుండై మోక్షమార్గంబు చింతించుచు వర్తింపవలయు.

క. ఆ యతివరుఁ డీ జగమును
మాయారూపం బటంచు మదిఁ దలఁచుచు న
న్యాయంబు విడిచి దేహ మ
పాయం బని యెఱుఁగవలయు బ్రహ్మవిధిజ్ఞా.

క. జ్ఞానం బెక్కువ నరునకు
జ్ఞానంబున ముక్తి గలుగు జ్ఞానముచే దు
ర్జ్ఞానంబు మాసిపోవును
జ్ఞానంబునఁ గీడు గలదె జగములలోనన్.

గీ. ఆత్మ యను పేరఁ దనరుచున్నట్టి యనల
మందు నధ్యాత్మ యను నాజ్య మమర వేల్చి
జ్ఞానయజ్ఞంబు చేసిన జనుల కెల్ల
కలుగు మోక్షంబు నిక్క మిా కథ మునీంద్ర.

చ. సమరములోన బాంధవుని
జిక్కఁగఁజేసి యనూత్మజుంకు చి
త్తమున విరక్తి కల్గి పరి
తాపము నొందుచు నన్ను మోక్ష ధ
ర్మములను భక్తితో నడుగఁ
గ్రిమ్మఱఁ జెప్పినయట్టి మోక్ష ధ
ర్మములను నీకుఁ జెప్పెద ధ
రామర నీనులు హర్ష మందగన్

క. అజ్ఞాన ముడిగి కేవల
సుజ్ఞానము బొడముదాక సువిధిజ్ఞుండై
యజ్ఞాదికర్మసమితి మ
దాజ్ఞను జరుపంగవలయు నఫలాశుండై.

శా. ఆ యజ్ఞాదులు చేసి త త్ఫలముపై
నాసక్తి వర్జించి మ
న్మాయామోహిత మైన యీా జగములో
మధ్యస్థుఁడై కర్మ మా
ర్గాయాసంబు పరిత్యజించి నరుఁ
డత్యంతాత్మ యోగంబునన్
గాయం బేర్పడకుండఁ దన్నవలయున్
సంసార బాహ్యస్థుఁడై.

గీ. స్నాన యాగ దాన తర్పణంబులు మాని
పుత్రదారవిత్తబుద్ధి మాని
గర్వ ముడిగి సర్వకర్మముల్ జరుపక
తలఁపులోన నన్ను దలఁపవలయు.

వ. అని, ఇవ్విధంబునం జక్రి నిర్వక్రి సమ్యగ్జ్ఞానప్రకాశకరంబు లైన వచనంబులు పల్కిన ధరామరముఖ్యుండు సంతసించి యి ట్లనియె.

క. తెలియనివి గొన్నిమాటలు
గల వడిగెద భువనవంద్య కళ్యాణసము
జ్జ్వల రూప నాకుఁ గ్రిమ్మలఁ
దెలుపుము చిత్తంబులోనఁ దెలివి తలిర్పన్.

సీ. యమ మెన్నివిధములు శమ మన నెయ్యది
దమ మేది ధృతి యేది దాన మేది
తప మే విధంబు సత్యత్యాగ ధన యజ్ఞ
దక్షిణావిద్యలుఁ దనర నెవ్వి
లక్ష్మియు సుఖ దుఃఖ లజ్జ లనా నెవ్వి
పండితమూర్ఖు లే పగిదివారు
మార్గోత్పథంబుల మహిమ లే విధములు
స్వర్గనారకముల జాడ లెవ్వి.

గీ. బంధు లెవ్వారు గృహమేధి పరగ నాఢ్యుఁ
డనఁగ నెవ్వఁడు ఘన దరిద్రాంధకార
సహితుఁ డెవ్వఁడు నాథుఁ డే జాడవాఁడు
దీనమందార యివి నాకు నానతిమ్ము.

వ. అనిన విప్రవరునకు గోపికావల్లభుం డి ట్లనియె.

క. నీ వడిగిన 'యీ ప్రశ్నల
కే వంకను నవతు లేద యీ భావము నీ
భావంబున కొడఁబడ నం
భావన నెఱిఁగింతు నీకుఁ బటువాక్ప్రౌఢిన్.

వ. అకర్దింపు మది యె ట్లనిన నహింసయు, సత్యంబును, కార్యరాహిత్యంబును, అసంగమంబును, అసంచయంబును, ఆస్తిక్యంబును, బ్రహ్మచర్యంబును, మానంబును, స్థైర్యంబును, క్షమాభయంబు

లును, శౌచంబును, జపంబును, తపంబును, హోమంబును, అతిథి సత్కారంబును, మదర్చనంబును, తీర్థస్నానంబును, పరమయోజన కృత్యంబును, తుష్టియు, ఆచార్యసేవనంబును నివి యమం బనా బరగు. సర్వేంద్రియనిగ్రహంబు శమంబు. శత్రుమిత్రాదుల యందు మాధ్యస్థ్యంబు భజియించుట దమంబు. జిహ్వోపస్థ జయంబు ధృతి. మూఢమతులకు జ్ఞానోపదేశంబు చేయుట దానంబు. కామత్యాగంబు తపంబు. సమదర్శనత్వము సత్యంబు, కర్మాసంగ మంబు త్యాగంబు, వైష్ణవధర్మార్జనం బిష్టధనంబు, మ ల్లక్షణం బెఱుంగుట యజ్ఞంబు, సూత్మజ్ఞానం బడుగుట దక్షిణ, ప్రాణా యామంబును, నిశ్చలభక్తి, విద్యలనఁ దనరు శమాది గుణంబులు లక్ష్మి, ఆశారాహిత్యంబు సుఖంబు, కామసుఖాపేక్ష నిశ్చయం బగు దుఃఖము, బోధను వికర్మమంబులయందు ప్రవర్తనంబు మాన్పుట లజ్జ, బంధమోక్షణమార్గజ్ఞుండు పండితుండు, దేహాదుల యం దహంకారంబు బొందినవాఁడు మూర్ఖుఁడు, మద్భక్తిమార్గంబు చిత్త విక్షేపం బుత్పథంబు, సత్త్వగుణోదయంబు స్వర్గంబు, తమో గుణోదయంబు నరకంబు, గురువు బంధువుం డనాఁ బరగు, నిజ శరీ రంబు గృహంబు, గుణాఢ్యుం డాఢ్యుండు, తుష్టిలేని యతండు దరిద్రుండు, సర్వసంగ విరక్తుం డీశ్వరుండు, అని ప్రశ్నోత్తరంబు లిచ్చి వాసుదేవుండు మరియు నిట్లనియె.
